www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 5-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 350 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: అష్టమి రా.7:27 తదుపరి నవమి, నక్షత్రం: పునర్వసు తె.5:32 తదుపరి పుష్యమి, వర్జ్యం: సా.5:26-7:02, దుర్ముహూర్తం: ఉ.6:10-ఉ.7:48, అమృతఘడియలు: తె. 3:06-4:43, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: .6:10, సూర్యాస్తమయం: 6:25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



## యూనస్‌తో మోదీ భేటీ

బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతకు భరోసా ఇవ్వాలి

ప్రజాస్వామ్య, సుస్థిర, సమ్మిళిత, శాంతియుత బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుంది

అక్రమ చొరబాట్లను అడ్డుకోవాలి: ప్రధాని మోదీ

షేక్ హసీనా అప్పగింతపై చర్చించిన యూనస్

'బిమ్‌స్టెక్'ను బలోపేతం చేద్దాం

21 సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించిన మోదీ

2

# ఫార్మాపైనా సుంకాలు

త్వరలో సెమీకండక్టర్లపైనా విధిస్తాం: ట్రంప్



మేం విధించిన సుంకాలు మాకు బేరమాడే శక్తినిచ్చాయి. ఇప్పుడు అన్ని దేశాలూ మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. మేం చేసిన పని వల్ల కలిగిన గొప్ప ప్రయోజనం అదే. ఈ సుంకాలు మళ్లీ అమెరికాను డ్రైవర్ సీటులో కూర్చోబెట్టాయి. - డొనాల్డ్ ట్రంప్

మునుపెన్నడూ లేని స్థాయిలో ఉంటాయని వెల్లడి

అద్భుత ఆఫర్లతో వచ్చే దేశాలతో సుంకాలపై సంప్రదింపులకు సిద్ధంగా ఉన్నానని స్పష్టీకరణ

ఐఫోన్లు, ఐప్యాడ్ల ధరలు 30-43% పెరిగే చాన్స్

అమెరికాపై 34% అదనపు సుంకం వేసిన చైనా

భారత మార్కెట్లు పతనం.. ఫార్మా షేర్లు కుదేలు

930, 345 పాయింట్ల మేర సెన్సెక్స్, నిఫ్టీ డౌన్

18 లక్షల కోట్లు కోల్పోయిన ప్రపంచ కుబేరులు

భారీగా నష్టపోయిన జుకెర్‌బెర్గ్, జెఫ్ బెజోస్, మస్క్

వాషింగ్టన్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాల కత్తి దూసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు! త్వరలోనే ఫార్మాస్యూటికల్స్ (ఔషధాలు), సెమీకండక్టర్లపైనా దిగుమతి సుంకాలు విధిస్తామని.. గురువారం సాయంత్రం ఆయన ప్రకటించారు. ఆ సుంకాలు మునుపెన్నడూ ఎరుగని స్థాయిలో ఉంటాయనే సంకేతాలిచ్చారు. బుధవారం ఆయన ప్రకటించిన సుంకాల జాబితాలో ఈ రెండు రంగాలూ లేకపోవడంతో ఆయా పరిశ్రమలవారు ఊపిరి పీల్చుకున్నారు. ఫార్మా షేర్ల ధరలు పెరిగాయి కూడా. కానీ, అంతలోనే ఆయన ఈ ప్రకటన చేయడంతో ఫార్మా ఇండస్ట్రీ ఆనందం ఆవిరైంది. ట్రంప్ ప్రకటన ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో స్టాక్‌మార్కెట్ కుదేలైంది. సెన్సెక్స్ 930 పాయింట్లు, నిఫ్టీ 345 పాయింట్ల మేర పతనమయ్యాయి. ముఖ్యంగా ఫార్మా రంగ షేర్లు భారీగా నష్టపోయాయి. అటు

మిగతా 2వ పేజీలో...

## వారంలో మెగా డీఎస్సీ!

14

నోటిఫికేషన్ జారీకి పాఠశాల విద్యాశాఖ సిద్ధం

కొత్త రోస్టర్ కోసం ఎదురుచూపు

### 38 ఏఎంసీలకు చైర్మన్లు

టీడీపీకి 31, జనసేనకు 6, బీజేపీకి 1

14

## రొయ్య విలవిల

ట్రంప్ సుంకాలతో ఆక్వాకు శరాఘాతం

ఏపీ నుంచి ఎగుమతులపై తక్షణ దెబ్బ


ఇప్పటికే మొదలైన ధరల పతనం

దేశంనుంచి 40% ఉత్పత్తులు అమెరికాకే..

27% సుంకాలకు ఇతర డ్యూటీలూ కలిపితే 35 శాతం వరకు అదనపు భారం

14





## 'వక్ఫ్'కు ఓకే

రాజ్యసభలోనూ ఆమోదం

128-95 ఓట్ల తేడాతో విజయం

అర్ధరాత్రి 2 గంటలకు ఓటింగ్

మద్దతిచ్చిన ఐదుగురు బీజేడీ ఎంపీలు

వైసీపీ సభ్యుడు నత్వానీ కూడా!

శరద్ పవార్, శిబూ సోరెన్ గైర్హాజరు

12

## వైసీపీ డబుల్ గేమ్!

లోక్‌సభలో వ్యతిరేకం.. రాజ్యసభలో మద్దతు

ఎగువ సభలో ఆ పార్టీ ఎంపీలు ఏడుగురూ అనుకూలంగా ఓటేశారన్న టీడీపీ

ఎంపీ పరిమళ్ నత్వానీ క్రాస్ ఓటింగ్ చేశారని వైసీపీ వర్గాల అంగీకారం

అయితే ఐదుగురు బిల్లుకు అనుకూలంగా ఓటేశారని ప్రచారం

జగన్ ద్వంద్వ వైఖరిపై మైనారిటీల్లో అసంతృప్తి

బిల్లులో కీలక సవరణలు ప్రతిపాదించిన టీడీపీ

జేపీసీ ఆమోదంతో బిల్లులో చేర్పించిన వైనం

13

## 'నీట్'పై తమిళనాడు బిల్లును తిరస్కరించిన రాష్ట్రపతి

2

# ప్రతి నియోజకవర్గానికీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

## 100 నుంచి 300 పడకలతో ఏర్పాటు

## పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి చర్యలు



బర్డ్ ఫ్లూతో బాలిక మృతి నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన ఐసీఎంఆర్ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసిన దృశ్యం

గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలి

అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి

కొత్తగా 13 డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లు

ఆరోగ్య శాఖపై సమీక్షలో చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ 100 నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించేలా కార్యాచరణ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా

మిగతా 13వ పేజీలో...

## బర్డ్ ఫ్లూతో జాగ్రత్త

ముందస్తు చర్యలు తీసుకోండి

కేసులు, మరణాలు నమోదు కావద్దు

నరసరావుపేటలో బాలిక మృతిపై ఐసీఎంఆర్ బృందం అధ్యయనం

వారితో సీఎం చంద్రబాబు సమీక్ష

## సచివాలయంలో అగ్ని ప్రమాదం



రెండో బ్లాక్ బ్యాటరీ రూమ్‌లో మంటలు

ఆ బ్లాక్‌లోనే పవన్, అనిత చాంబర్లు

పరిశీలించిన సీఎం.. భద్రతా ప్రమాణాలపై ఆరా

అన్ని చోట్లా సీసీ కెమెరాలకు బాబు ఆదేశాలు

సచివాలయంలో జరిగిన అగ్ని ప్రమాద దృశ్యం

14

## నేను ఉగ్రవాదిని కాను..రాజకీయ నాయకుడిని

- ఏడుగురు ప్రధానులు నాతో చర్చలు జరిపారు
- విచారణ సందర్భంగా సుప్రీంకు తెలిపిన యాసిన్ మాలిక్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: తాను రాజకీయ నాయకుడినే తప్ప ఉగ్రవాదిని కాదని జమ్మూ-కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) చీఫ్ యాసిన్ మాలిక్ సుప్రీంకోర్టుకు తెలిపారు. తనతో ఏడుగురు ప్రధానులు చర్చలు జరిపారని చెప్పారు. శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉన్న ఆయనను వివిధ కేసుల విచారణ నిమిత్తం ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు పరచకూడదని, వర్చువల్ విధానంలోనే విచారణ జరపాలని కోరుతూ సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఆయన కోర్టుకు వస్తే భద్రతపరంగా ముప్పు ఉంటుందని తెలిపింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌తో యాసిన్ మాలిక్ తీసుకున్న ఫొటోను గతంలో అన్ని పత్రికలు ప్రచురించడంతో పాటు అన్ని ఛానెళ్లు ప్రసారం చేశాయని తెలిపారు. దీనికి యాసిన్ మాలిక్ సమాధానం చెప్పారు. ఆ ఫొటోను చూపించే తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమ సంస్థను కేంద్ర ప్రభుత్వం 'ఉపా' కింద ఉగ్రవాద సంస్థగా గుర్తించలేదని చెప్పారు. పి.వి.నరసింహారావు దగ్గర నుంచి నరేంద్ర మోదీ వరకు ఏడుగురు ప్రధానులు తనతో చర్చలు జరిపారని తెలిపారు. అయితే ఆకస్మికంగా తనపై 35ఏళ్ల క్రితం ఉన్న మిలిటెంట్ కేసులను తిరగదోడి విచారణ జరుపుతున్నారని చెప్పారు. ఇది కాల్పుల విరమణ ఒప్పందానికి వ్యతిరేకమని తెలిపారు. ఇందుకు తుషార్ మెహతా అభ్యంతరం చెప్పారు. ప్రస్తుత కేసుకు, కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధం లేదని అన్నారు. తాను భద్రతపరంగా ముప్పు కాదని యాసిన్ తెలిపారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వలేదన్నారు. అహింసాయుతంగా జరిపిన రాజకీయ ఆందోళనలపైనే కేసులు నమోదయ్యాయి తప్ప, ఇతరత్రా ఏవీ తనపై లేవని అన్నారు.

## 'సరిహద్దు ప్రజలు' దేశ భద్రతకు కళ్లూ చెవులు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశ సరిహద్దుల్లో ఉన్న గ్రామాల ప్రజలను.. సరిహద్దు భద్రతా బలగాల కళ్లు, చెవులుగా కేంద్రప్రభుత్వం అభివర్ణించింది. ఆయా గ్రామాల అభివృద్ధికి సంబంధించిన 'ఉజ్వల గ్రామాల పథకం' రెండో దశకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర క్యాబినెట్ శుక్రవారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. దీంట్లో భాగంగా రూ.6,839 కోట్ల వ్యయంతో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బిహార్, గుజరాత్, జమ్ముకశ్మీర్, లడక్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని సరిహద్దు గ్రామాల్లో 2028-29 వరకు అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టనున్నారు. మరోవైపు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో రైల్వేల విస్తరణకు రూ.18,658 కోట్ల వ్యయంతో చేపట్టే నాలుగు ప్రాజెక్టులను కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదించింది. వీటి ద్వారా దేశంలో రైల్వేమార్గం మరో 1,247 కి.మీ.ల మేర పెరగనుంది.

## తమిళనాడు బీజేపీ అధ్యక్ష రేసులో లేను: అన్నామలై

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా మరోసారి కొనసాగాలని తాను కోరుకోవడం లేదని అన్నామలై ప్రకటించారు. ఆ పదవికి నియామకం జరిగిన తర్వాత దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. శుక్రవారం ఉదయం కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షపదవికి కొందరి పేర్లను సిఫారసు చేసినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని అన్నామలై తెలిపారు. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య రాష్ట్రంలో ఎన్నికల పొత్తు కుదిరే అవకాశాలు ఉండటం వల్లే అధ్యక్ష పదవి నుండి తప్పుకొంటున్నారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఎటువంటి రాజకీయ ఊహాగానాలపైనా తాను స్పందించబోనని స్పష్టం చేశారు. తనకు అధిష్ఠాన వర్గం నిర్ణయమే శిరోధార్యమన్నారు.

# ఫార్మాపైనా సుంకాలు



(మొదటి పేజీ తరువాయి)

అమెరికా, ఆసియా మార్కెట్లూ పతనమయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లో ఎస్ అండ్ పీ 500 ఫ్యూచర్స్ 3.6 శాతం మేర పడిపోగా.. డౌజోన్స్ సూచి 3.4%, నాస్‌డాక్ 4% మేర డౌన్ అయ్యాయి. అటు యూరోపియన్ మార్కెట్ల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్.. ఆసియాలో జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. కొవిడ్ (2020) తర్వాత మార్కెట్లు ఈ స్థాయిలో క్రాష్ కావడం ఇదే మొదటిసారి. దీంతో టాప్-500 ప్రపంచ కుబేరుల సంపద 208 బిలియన్ డాలర్లు.. అంటే దాదాపుగా రూ.17.8 లక్షల కోట్ల మేర ఆవిరైపోయింది. భారీగా నష్టపోయిన ప్రముఖుల్లో ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా అధిపతి జుకెర్‌బెర్గ్, అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ వంటివారున్నారు. మెటా షేర్లు 9% మేర పతనం కావడంతో.. జుకెర్‌బెర్గ్ 17.9 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ1.5 లక్షల కోట్లు) నష్టపోయారు. అమెజాన్ షేర్లు కూడా 9% పతనమై బెజోస్ వ్యక్తిగతంగా రూ.1.3 లక్షల కోట్ల మేర సంపద కోల్పోయారు. ఇక.. ట్రంప్‌కు అనుంగు మిత్రుడు, టెస్లా అధినేత ఈలన్ మస్క్ సంపద 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.94 వేల కోట్లు) మేర కరిగిపోయింది. ప్రముఖ పాదరక్షల బ్రాండ్లు నైకీ, అడిడాస్ వంటి సంస్థల షేర్లు రెండంకెల పతనాన్ని చవిచూశాయి. కాగా.. భారత్‌పై 26% సుంకాలను విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించగా, ఆ తర్వాత వైట్‌హౌస్ అధికారులు విడుదల చేసిన అనెక్సర్‌లో అది 27 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. కానీ, గురువారంనాడు దాన్ని మళ్లీ సవరించి భారత్‌పై 26% సుంకం విధిస్తున్నట్టు మరో పత్రాన్ని వైట్‌హౌస్ వర్గాలు విడుదల చేశాయి. మరోవైపు.. అమెరికా ప్రతీకార సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తాయని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం పార్లమెంటులో సమాధానం చెప్పాలంటూ కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో నిరసన తెలిపారు.

### చర్చలకు సిద్ధం

తన ప్రతీకార సుంకాల ప్రకటనతో స్టాక్‌మార్కెట్లు కుదేలైనా ట్రంప్ మాత్రం తన నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. తాను సుంకాలు విధించడం వల్లనే ఇప్పుడు ప్రతి దేశం తమను అభ్యర్థిస్తోందని.. ఇప్పుడా దేశాలు తాము ఏం అడిగినా కాదనే పరిస్థితిలో ఉన్నాయని, తమ కోసం ఏదైనా చేస్తాయని ఆయన మీడియాతో అన్నారు. తన హయాంలో అమెరికాను మరింత సుసంపన్నం చేస్తానని పునరుద్ఘాటించారు. "మేం విధించిన సుంకాలు మాకు బేరమాడే శక్తినిచ్చాయి. ఇప్పుడు అన్ని దేశాలూ మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. మేం చేసిన పని వల్ల కలిగిన గొప్ప ప్రయోజనం అదే. ఈ సుంకాలు మళ్లీ అమెరికాను డ్రైవర్ సీటులో కూర్చోబెట్టాయి" అని ఆయన పేర్కొన్నారు. "ఏదైనా దేశం అమెరికాతో డీల్ కుదుర్చుకోవాలని భావిస్తే అందుకు మీరు అంగీకరిస్తారా?" అని విలేకరులు ప్రశ్నించగా.. అద్భుతమైన ఆఫర్లతో ఏ దేశమైనా ముందుకొస్తే తాను సిద్ధమేనని జవాబిచ్చారు.


### చైనా ప్రతీకార చర్యలు..

'తమలపాకుతో నువ్వొకటిస్తే తలుపుచెక్కతో నేనొకటిస్తా' అన్న సామెత చందంగా.. తమ దేశంపై తాజాగా 34 శాతం సుంకాలు విధించిన అమెరికాపై చైనా అంతేస్థాయిలో అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. అంతటితో ఆగక.. అమెరికా రక్షణ రంగానికి, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలకు అత్యంత కీలకమైన అరుదైన ఖనిజ లోహాల ఎగుమతులపై నియంత్రణలు విధించింది. అమెరికాకు చెందిన 16 సంస్థలకు పంపే ద్వంద్వ వినియోగ ఉత్పత్తుల ఎగుమతిపై నిషేధం విధించింది. చైనాకు ఎగుమతులు చేస్తున్న ఆరు అమెరికా సంస్థలపై వేటు వేసింది.. చైనా తీసుకున్న ఈ నిర్ణయాలు అమెరికాలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమలపై గట్టిగానే ప్రభావం చూపనున్నాయి. అమెరికాపై తాము విధించిన ఈ అదనపు సుంకం ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి వస్తుందని చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ ఆఫ్‌ద స్టేట్ కౌన్సిల్ ప్రకటించింది. అమెరికాపై ప్రపంచ వాణిజ్య సంస్థలో వ్యాజ్యం కూడా దాఖలు చేసింది. కాగా, చైనా విధించిన ప్రతీకార సుంకంపై ట్రంప్ వెంటనే స్పందించారు. తాను విధించిన సుంకాలతో భయాందోళనలకు గురై చైనా తప్పు చేసిందని తన సొంత సామాజిక మాధ్యమం సోషల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు.

## పెరగనున్న ఐఫోన్లు, ఐప్యాడ్ల ధరలు?

ప్రతీకార సుంకాలతో అమెరికాను మళ్లీ సుసంపన్నం చేస్తానంటూ ట్రంప్ ఘనంగా ప్రకటించారు గానీ.. ఈ పెంపు ప్రభావం అంతిమంగా అమెరికన్ వినియోగదారులపైనే పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు.. యాపిల్ సంస్థ ఐఫోన్ల ఉత్పత్తికి చైనాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. కొన్నాళ్లుగా వియత్నాం, భారత్ వంటి దేశాల్లోనూ ఉత్పత్తి ప్రారంభించింది. కానీ, తాజా పెంపుతో చైనాపై సుంకాల భారం 54 శాతానికి చేరింది. అలాగని తమ ఉత్పత్తి మొత్తాన్నీ చైనా నుంచి వియత్నాంకో, భారత్‌కో తరలిద్దామన్నా.. ఆ రెండు దేశాలపైనా వరుసగా 46%, 26% చొప్పున సుంకాలను ట్రంప్ విధించారు. ఆ ప్రభావం యాపిల్‌పై గట్టిగానే పడబోతోంది. ఇప్పుడు యాపిల్ ముందున్న దారులు రెండే.. సుంకాల వల్ల అదనంగా పడే భారాన్ని తాను భరించడం. లేదా వినియోగదారులపై వేయడం. అలా వేయడం వల్ల ఐఫోన్ల ధరలు 30 నుంచి 43 శాతం దాకా పెరుగుతాయని అంచనా. దీనివల్ల.. ప్రస్తుతం అమెరికాలో 799 డాలర్లకు విక్రయిస్తున్న ఐఫోన్ 16 ధర దాదాపు 1142 డాలర్లకు విక్రయించాల్సి ఉంటుంది. 1599 డాలర్లకు విక్రయిస్తున్న ఐఫోన్ 16 ప్రోమ్యాక్స్ ధర ఏకంగా 2,300 డాలర్లు అవుతుంది.

## లోకం తీరు




## ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులో ఇక నుంచి రెండు జెండర్లే..

- 'ఇతర జెండర్' ఆప్షన్ తొలగింపు

వాషింగ్టన్, ఏప్రిల్ 4: ఇమ్మిగ్రేషన్ దరఖాస్తుల్లో అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సేవల (యూఎస్‌సీఐఎస్) సంస్థ మార్పులు తీసుకొచ్చింది. ఇకపై దరఖాస్తుల్లో స్త్రీ లేదా పురుషులను మాత్రమే గుర్తించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ మార్పు ఏప్రిల్ 2వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో 2023లో బైడెన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇతర జెండర్' ఎంపిక అవకాశాన్ని తొలగించినట్లయింది. ఈ ఏడాది జనవరిలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో యూఎస్‌సీఐఎస్ ఈ కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. లింగనిర్ధారణకు బర్త్ సర్టిఫికెట్ లేదా దానికి సమానమైన ధ్రువీకరణను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని యూఎస్‌సీఐఎస్‌కు ప్రభుత్వం సూచించింది.

## దక్షిణ కొరియా అధ్యక్షుడిపై వేటు

### యూన్‌ను పదవి నుంచి తొలగించిన కోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దక్షిణ కొరియాలో నాలుగు నెలలుగా నెలకొన్న రాజకీయ అనిశ్చితికి ఎట్టకేలకు తెరపడింది. ఆ దేశాధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను రాజ్యాంగ ధర్మాసనం పదవి నుంచి తొలగించింది. గతేడాది డిసెంబరులో నేషనల్ అసెంబ్లీ ఆమోదించిన అభిశంసన తీర్మానాన్ని సమర్థిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఈ క్రమంలో యూన్ ఉన్నపళంగా అధ్యక్ష నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. తాజా పరిణామాల నేపథ్యంలో దక్షిణ కొరియా చట్ట ప్రకారం 60 రోజుల్లోగా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. యూన్ సుక్ గతేడాది డిసెంబరులో సైనిక చట్టాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఆయన అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

## గోల్డెన్ 'ట్రంప్ కార్డ్..' ఇదే..




వాషింగ్టన్: ఎలాంటి నిబంధనల జంఝాటాలు లేకుండా నేరుగా అమెరికా పౌరసత్వం పొందడానికి వీలుకల్పించే 'గోల్డ్ కార్డ్' ఫస్ట్‌లుక్ వచ్చేసింది. గురువారం ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడుతున్న సమయంలో దీనిని విడుదల చేశారు. "ఐదు మిలియన్ డాలర్లు చెల్లిస్తే ఇది మీదే.. ఇదే మొదటి కార్డ్.. ఇదేవిటో తెలుసా..? ఇది గోల్డ్ కార్డ్.. ది ట్రంప్ కార్డ్" అంటూ వీసా గోల్డ్ కార్డ్‌ను చూపించారు. మొదటి కార్డును తానే కొనుగోలు చేశానని చెప్పారు. బంగారు రంగులో ఉన్న ఈ కార్డ్‌పై డొనాల్డ్ ట్రంప్ 'మగ్‌షాట్' చిత్రం ఉండటం గమనార్హం. నేరస్థులకు సంబంధించి పోలీసులు/జైలు అధికారులు తీసే చిత్రాలే 'మగ్ షాట్'లు. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో.. ట్రంప్ ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారంటూ నమోదైన కేసు నేపథ్యంలో ఆయన అట్లాంటాలోని ఫుల్టన్ కౌంటీ జైలులో లొంగిపోయారు. ఆ సమయంలో జైలు అధికారులు ట్రంప్ మగ్‌షాట్స్ తీశారు. అందులో ఆయన ముఖం నేరుగా కనిపించేలా ఉన్న చిత్రం వైరల్‌గా మారింది. ఇప్పుడు గోల్డ్‌కార్డ్‌పై దాన్ని ముద్రించడం విశేషం. ఇక కార్డ్‌పై ఆయన వెనకాల స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చిత్రంతోపాటు 'ది ట్రంప్ కార్డ్' అని క్యాప్షన్ పెట్టారు. అంతేకాదు.. దీని విలువ 5 మిలియన్ డాలర్లు అన్నదీ చాలా స్పష్టంగా కనిపించేలా ముద్రించారు. అమెరికాలో నివసించాలనుకునే ఇతర దేశాల సంపన్నులను ఆకర్షించేందుకు 'గోల్డ్ కార్డ్' వీసాను ప్రవేశపెడుతున్నట్టు ట్రంప్ గతంలోనే ప్రకటించారు. దీనికోసం 5 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.42.7 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా సమకూరే నిధులతో అమెరికా అప్పులను కూడా తీర్చేయవచ్చని కూడా ట్రంప్ తెలిపారు.



## 'నీట్'పై తమిళనాడు బిల్లు తిరస్కరణ

- ఆమోదించని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ నుంచి మినహాయింపు కోరుతూ తమిళనాడు అసెంబ్లీ రూపొందించిన బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. నీట్ కారణంగా తమిళనాట పలువురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నీట్‌ను రద్దు చేయిస్తామని డీఎంకే అధ్యక్షుడి హోదాలో ఎంకే స్టాలిన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు డీఎంకే ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. నీట్‌కు వ్యతిరేకంగా బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, గవర్నర్‌కు పంపించగా ఆయన తిరస్కరించారు. అనంతరం కొన్ని మార్పులు చేసి, రెండోసారి గవర్నర్ పరిశీలనకు పంపారు. అయితే.. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో ఆ బిల్లును రాష్ట్రపతి తిరస్కరించినట్లు తనకు సమాచారం అందిందని స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. 2021 సెప్టెంబరు 13న శాసనసభలో నీట్ మినహాయింపు ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించి, గవర్నర్‌కు పంపితే ఆయన తిరస్కరించారని తెలిపారు. 2022 మే 2న అఖిలపక్ష సమావేశం నిర్వహించి, వారి సూచనలతో బిల్లులో కొన్ని సవరణలు చేసి, మళ్లీ గవర్నర్ ఆమోదానికి పంపగా.. ఆయన రాష్ట్రపతికి పంపి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన శాసనసభలో చేసిన ముసాయిదా బిల్లును కేంద్రం ఆమోదించకపోవడం గర్హనీయమన్నారు. నీట్‌పై భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించేందుకు అన్ని పార్టీలతో ఈ నెల 9న భేటీ కానున్నట్లు స్టాలిన్ తెలిపారు. ఆ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# 'బిమ్‌స్టెక్'ను బలోపేతం చేద్దాం

## సభ్య దేశాల చెల్లింపు వ్యవస్థలతో యూపీఐ అనుసంధానం

- స్థానిక కరెన్సీలో వాణిజ్యానికి ప్రోత్సాహం
- మోదీ 21 సూత్రాల ప్రణాళిక ప్రతిపాదన
- బిమ్‌స్టెక్ సదస్సులో బ్యాంకాక్ విజన్-2030కు ఆమోదం

బ్యాంకాక్, ఏప్రిల్ 4: బిమ్‌స్టెక్ దేశాల చెల్లింపు వ్యవస్థలతో భారత యూపీఐని అనుసంధానించాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. దీనిద్వారా సభ్య దేశాల మధ్య పర్యాటకాభివృద్ధితో పాటు వాణిజ్యం, పారిశ్రామిక రంగాలకు విస్తృత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. బ్యాంకాక్‌లో శుక్రవారం నిర్వహించిన 6వ బిమ్‌స్టెక్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రపంచ శ్రేయస్సును మరింత మెరుగుపరచడానికి ఈ ఫోరం ఒక ముఖ్యమైన వేదికగా మోదీ అభివర్ణించారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం అత్యవసరమని, దీనికోసం 21 సూత్రాల కార్యాచరణ ప్రణాళికను ప్రతిపాదిస్తున్నానని అన్నారు. దీనిలో భాగంగా బిమ్‌స్టెక్ దేశాలకు చెందిన 300మంది యువతకు భారత్‌లో ఏటా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐటీ రంగ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకొని ఈ వేదికను సాంకేతికంగా బలోపేతం చేద్దామని మోదీ పిలుపునిచ్చారు. సభ్య దేశాల మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడానికి బిమ్‌స్టెక్ చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేయాలని, వార్షిక వ్యాపార సదస్సులు నిర్వహించడంతో పాటు స్థానిక కరెన్సీలో వాణిజ్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. విపత్తు నిర్వహణ, సహాయ, పునరావాసంలో సహకారం దిశగా బిమ్‌స్టెక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజార్డర్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బిమ్‌స్టెక్ పరిధిని, సామర్థ్యాలను విస్తరించాల్సిన అవసరాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. సభ్య దేశాలకు మానవ వనరుల శిక్షణ, నానో ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలు, రిమోట్ సెన్సింగ్ డేటా వినియోగం కోసం గ్రౌండ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, నలంద యూనివర్సిటీల్లో బిమ్‌స్టెక్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని, సభ్యదేశాలకు చెందిన దౌత్యవేత్తలకు ఏటా శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. యువత భాగస్వామ్యం కోసం ఈ ఏడాది బిమ్‌స్టెక్ యంగ్ లీడర్స్ సమ్మిట్ నిర్వహిస్తామని, బిమ్‌స్టెక్ హ్యాకథాన్, యంగ్ ప్రొఫెషనల్ విజిటర్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కాగా, బంగాళాఖాతం ప్రాంతంలో భద్రత, సమ్మిళితత్వం పట్ల భాగస్వామ్య నిబద్ధతను సాకారం చేయడానికి బిమ్‌స్టెక్ సమావేశం బ్యాంకాక్ విజన్-2030ను ఆమోదించింది. థాయ్‌లాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఈ సదస్సుకు భారత్, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, భూటాన్ దేశాధినేతలు హాజరయ్యారు.



ప్రధాని మోదీతో బంగ్లాదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు యూనస్

## హిందువుల భద్రతకు భరోసా ఇవ్వండి

బిమ్‌స్టెక్ సదస్సు నేపథ్యంలో ప్రధాని మోదీతో బంగ్లాదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు యూనస్ బ్యాంకాక్‌లో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయొద్దని యూనస్‌ను మోదీ ఈ సందర్భంగా హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల భద్రతకు భరోసా ఇవ్వాలని కోరారు. గతేడాది ఆగస్టులో హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత నుంచి ఈ రెండు దేశాల నేతలు కలుసుకోవడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య, సుస్థిర, శాంతియుత, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు. సరిహద్దు భద్రతపై కూడా నేతలు చర్చించారు. బిమ్‌స్టెక్ అధ్యక్ష పదవిని చేపట్టిన బంగ్లాదేశ్‌కు మోదీ అభినందనలు తెలిపారు. కాగా, హసీనా అప్పగింతపై మోదీ, యూనస్ ఈ భేటీలో చర్చించారని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. దీనిపై ఇప్పుడు ఇంతకుమించి వ్యాఖ్యానించడం సరికాదని ఆ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీతో ప్రధాని మోదీ శుక్రవారం బ్యాంకాక్‌లో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, బ్యాంకాక్‌లోని వాట్ ఫో ఆలయంలో విశ్రాంతి తీసుకుంటున్న భంగిమలో ఉన్న 46 మీటర్ల పొడవైన బుద్ధుడి విగ్రహాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. నాలుగు సింహాలతో కూడిన అశోక చక్రం ప్రతిమను మందిరానికి బహూకరించారు.

## వక్ఫ్ బిల్లు చట్టబద్ధతపై సుప్రీంకు కాంగ్రెస్, ఎంఐఎం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: పార్లమెంటు ఉభయసభలూ ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును కాంగ్రెస్, ఏఐఎంఐఎం పార్టీలు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ నిబంధనలను అది ఉల్లంఘిస్తోందని బిహార్‌లోని కిషన్‌గంజ్ కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావేద్, ఎంఐఎం అధ్యక్షుడు-హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం ఈ మేరకు పిటిషన్లు దాఖలు చేశారు. వక్ఫ్‌పై ఏర్పాటైన జేపీసీలో వీరిద్దరూ సభ్యులు కూడా. ఈ బిల్లు ముస్లింల పట్ల వివక్ష చూపుతోందని.. వారి మతపరమైన స్వేచ్ఛను అడ్డుకునేలా ఉందని.. వక్ఫ్ ఆస్తులు, నిర్వహణపై నియంత్రణ విధిస్తోందని జావేద్ తరఫు న్యాయవాది అనాస్ తన్వీర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాలు స్వేచ్ఛగా కోర్టుకు వెళ్లవచ్చని.. కానీ దీనిపై మైనారిటీలను రెచ్చగొట్టడం, బుజ్జగింపులకు పాల్పడడం వంటి సంకుచిత రాజకీయాలకు పాల్పడవద్దని బీజేపీ విజ్ఞప్తి చేసింది. 'ట్రిపుల్ తలాక్‌పైనా కోర్టుకు వెళ్లారు. రామజన్మభూమిని అడ్డుకోవడానికి సైతం ప్రయత్నించారు. 370 అధికరణ రద్దును రాజ్యాంగ విరుద్ధమని కూడా అన్నారు' అని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ గుర్తుచేశారు. మరోవైపు, వక్ఫ్ బిల్లును లోక్‌సభలో బుల్డోజ్ చేశారన్న సోనియాగాంధీ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'బిల్లుపై దాదాపు 14 గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. వివిధ పార్టీలకు చెందిన 61 మంది ఎంపీలు చర్చలో పాలుపంచుకున్నారు. మూడు సార్లు ఓటింగ్ జరిగింది. ఇంత విస్తృత చర్చ, సముచిత ఆమోదం తర్వాత.. సభ నియమావళినే సీనియర్ నేత ప్రశ్నించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య గౌరవానికి తగినట్లుగా లేదు' అని ఆయన అన్నారు. కాగా, వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం చరిత్రాత్మకమని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా అన్నారు.

### జేడీయూలో వక్ఫ్ ముసలం

వక్ఫ్ సవరణ బిల్లు వ్యవహారం ఎన్డీయే కూటమి పార్టీ, బిహార్ అధికార పార్టీ జేడీయూలో ముసలం పుట్టించింది. ఈ బిల్లుకు అనుకూలంగా జేడీయూ ఎంపీలు పార్లమెంటులో ఓటు వేయడాన్ని తప్పుబడుతూ కీలక నేతలు పార్టీకి రాజీనామాలు సమర్పించారు. ఏకంగా ఐదుగురు నాయకులు పార్టీ నుంచి వైదొలుగుతున్నట్టు రాజీనామా పత్రాలను పంపించారు. వీరిలో షహనవాజ్ మాలిక్, మొహమ్మద్ అన్సారీలు గురువారం రాజీనామా చేయగా, నదీమ్ అఖ్తర్, రాజు నయ్యర్, తబ్రేజ్ సిద్దిఖీలు శుక్రవారం పార్టీకి గుడ్‌బై చెప్పారు.

## పార్లమెంటు నిరవధిక వాయిదా

- బడ్జెట్ సమావేశాల్లో 16 బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. శుక్రవారం ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన కాసేపటికే నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. వక్ఫ్ బిల్లు అంశంలో ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ చేసిన విమర్శలపై ఎన్డీయే సభ్యులు నిరసన తెలిపారు. 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. సభ్యుల ఆందోళనల నడుమ సభను స్పీకర్ వాయిదా వేశారు. కాసేపటికే రాజ్యసభను కూడా ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిరవధికంగా వాయిదా వేశారు. జనవరి 31వ తేదీ నుంచి శుక్రవారం వరకు బడ్జెట్ సమావేశాలు జరిగాయి. తొలి విడత సమావేశాల తర్వాత మధ్యలో ఫిబ్రవరి 14 నుంచి మార్చి 9వ తేదీ వరకు విరామం ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ 100 శాతం కంటే ఎక్కువగా పనిచేయడం (ఉత్పాదకత) విశేషం. వక్ఫ్ (సవరణ) బిల్లుతో పాటు మొత్తం 16 బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. గురువారం (ఏప్రిల్ 3) ఉదయం 11 గంటల నుంచి శుక్రవారం వేకువజాము వరకు విరామం లేకుండా 17:02 గంటల పాటు రాజ్యసభ సమావేశాలు జరిగాయి. రాజ్యసభ చరిత్రలోనే ఇంత సుదీర్ఘ సమయం సభ నడపడం ఇదే తొలిసారి. వక్ఫ్ బిల్లుతో పాటు మణిపూర్ అంశంపై చర్చించారు.

# త్వరలో సంక్షేమ శాఖల 'స్వయం ఉపాధి' జాతర!

- బీసీ సంక్షేమశాఖ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి
- రూ.2 వేల కోట్లతో బీసీలకు వివిధ యూనిట్లు
- కొత్తగా ప్రారంభించిన ఎస్సీ సంక్షేమం
- రూ.800కోట్లతో 20 వేల మందికి ఉపాధి లక్ష్యం
- త్వరలో ఎస్టీ, మైనారిటీ కార్యాచరణ ప్రణాళికలు
- గత ప్రభుత్వం నిలిపేసిన పథకాలు మళ్లీ గాడిలోకి..
- ఏటా లక్షల మందికి స్వయం ఉపాధి లక్ష్యంగా సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కూటమి సర్కారు రాకతో సంక్షేమంతోపాటు అభివృద్ధికి బాటలుపడ్డాయి. ఇప్పటికే సామాజిక పింఛను పెంపుదలతో పాటు అన్న క్యాంటీన్, మహిళలకు గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ పథకాలు అమల్లోకి తెచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు స్వయం ఉపాధి యూనిట్లు అందించి వారిని స్వయం అభివృద్ధి దిశగా మళ్లించి స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. మిగతా శాఖల కంటే ముందుగా బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత స్వయం ఉపాధి యూనిట్లను బీసీలకు అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఆ శాఖ ఇప్పటికే 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం(ఓబీఎంఎంఎస్) ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఎస్సీ కార్పొరేషన్ కూడా 2025-26 సంవత్సరానికి ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక ప్రారంభించింది. ఈ నెల 11 నుంచి ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్లు కూడా కసరత్తు ప్రారంభించాయి.

రాష్ట్రంలో నిరుద్యోగులకు స్వయం ఉపాధి జాతర మొదలవనుంది. దీనికి సంబంధించి ఆయా సంక్షేమ శాఖలు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. గత టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు వివిధ యూనిట్ల ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కారు వారి నోటికాడ కూడు లాగేసింది. ఇప్పుడు మళ్లీ టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఆయా వర్గాల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే గత ఐదేళ్ల వైసీపీ సర్కార్ విస్మరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమాన్ని తిరిగి ప్రారంభించి.. పేద బడుగు వర్గాల మోముల్లో సంతోషాన్ని నింపుతోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు భారీగా సంక్షేమ పథకాలను అమలు చేయగా, ఇప్పుడు మళ్లీ అదే రీతిలో సంక్షేమ పథకాల అమలుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది!.

## యూనిట్లపై లబ్ధిదారులతో సమావేశాలు

గతంలో స్వయం ఉపాధి యూనిట్ల ఎంపిక, యూనిట్ విలువ తదితర అంశాలపై అసంబద్ధంగా ఉండటంతో.. ఇప్పుడు అలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బీసీ సంక్షేమశాఖ ఈసారి వినూత్నంగా జనరిక్ మెడికల్ షాపులు డీఫార్మసీ, బీఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు అందిస్తోంది. జనరిక్ షాపులకు రూ.8 లక్షలు యూనిట్ విలువగా నిర్ణయించి రూ.4 లక్షలు సబ్సిడీగా అందించి.. మండల కేంద్రాలు, ఇతర ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటుకు నిర్ణయించారు. మంత్రి సవిత ఆదేశాలతో ఈసారి ప్యాసింజర్ ఆటోలను కూడా స్వయం ఉపాధి కింద యువతకు ఇవ్వాలని నిర్ణయించారు. మొత్తంగా బీసీలకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం సుమారు రూ.2 వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. బీసీ కార్పొరేషన్ అధికారులు విజయవాడలోని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఆటో డ్రైవర్లు, ఆటోలను సరఫరా చేసే కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. లబ్ధిదారులతో సంప్రదించి వారికి అవసరమైన యూనిట్లు కొనుగోలు చేయడం ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు సక్సెస్ అవుతాయని అధికారులు గుర్తించారు. ఇప్పటికే మినీ డెయిరీ యూనిట్ కోసం మేలు రకం గేదెలు కొనుగోలు చేసేందుకు బీసీ సంక్షేమశాఖ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఎస్సీ కార్పొరేషన్ కూడా ఇటీవల 32 రకాల యూనిట్లును ఎస్సీలకు అందించాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 11 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించనుంది. రూ.800 కోట్లతో సుమారు 20 వేల మంది ఎస్సీలకు స్వయం ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వయం ఉపాధి ఏటా నిరంతర ప్రక్రియగా కొనసాగనుంది.

## టీడీపీ హయాంలోనే స్వయం ఉపాధి

2014కు పూర్వం కాంగ్రెస్ హయాంలో ఫెడరేషన్లు ప్రారంభిస్తే.. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నిధులు కేటాయించడంతో పాటు ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి గౌరవించారు. 2018-19 బడ్జెట్‌లో బీసీల్లోని అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించారు. అంతకుముందు ఎప్పుడూ కేటాయించని తరగతులకు ఆ బడ్జెట్‌లో ప్రత్యేక స్థానమివ్వడం విశేషం. చేనేత సంక్షేమానికి అంతకుముందు కంటే పది రెట్లు పెంచి కార్మికుల విశ్వాసాన్ని చూరగొన్నారు. రజకులకు వంద రెట్లు, దూదేకుల కులాలకు చెందిన వారికి 20రెట్లు, నాయీబ్రాహ్మణులకు 35రెట్లు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారు. రాష్ట్రంలో ఉన్న 137 బీసీ కులాలను గుర్తించి ప్రతి కులానికి చెందిన పేదలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకున్నారు. రజక, నాయీ బ్రాహ్మణ, సగర, వడ్డెర, ఉప్పర, కృష్ణ బలిజ, వాల్మీకి, కుమ్మరి, భట్రాజ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా చంద్రబాబు ప్రభుత్వం మార్చింది. కొత్తగా మేదర, విశ్వబ్రాహ్మణ, కల్లుగీత కార్మికులకు ఫైనాన్స్ కార్పొరేషన్లను ఏర్పాటుచేసింది. ఎన్నికల ముందు యాదవ, తూర్పు కాపు/గాజుల కాపు, కొప్పుల వెలమ/పోలినాటి వెలమ, కురుబ/కురుమ, వన్యకుల క్షత్రియ, కళింగ, గవర, చేనేత, మత్స్యకారులు, గాండ్ల, ముదిరాజ్‌లకు కూడా ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటుచేశారు. ఏటా ఈ కార్పొరేషన్ల ద్వారా సుమారు 60వేల మంది బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్లన్నింటినీ రద్దుచేసి మళ్లీ అదే పేర్లతో అన్ని కులాలకూ ఫైనాన్స్ కార్పొరేషన్లు ఏర్పాటుచేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పెట్టిన కేటాయింపులన్నీ 2019-20 బడ్జెట్‌లో యథావిధిగా ఉంచి.. ఈ నిధులన్నీ నవరత్నాల కోసం మళ్లించారు. ఆయా కార్పొరేషన్ల స్వయం ఉపాధి పథకాల కోసం ఒక్క పైసా ఖర్చు చేయలేదు. బీసీ కులాల ఫైనాన్స్ కార్పొరేషన్లు వేటికీ నిధులు కేటాయించలేదు. దీంతో స్వయం ఉపాధి పథకాలు, ఇతర సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయాయి. అయితే డీబీటీ పథకాలను ఆయా కార్పొరేషన్ల ద్వారా లెక్కలు రాసి బుక్ అడ్జెస్ట్‌మెంట్ కార్పొరేషన్లుగా మార్చేశారు. కూటమి సర్కార్ తిరిగి స్వయం ఉపాధి కల్పనలో పూర్వ వైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది.

# 546 మందికి రూ.1,000 కోట్ల భూమి పట్టాలు

- ఘనంగా ఆరంభమైన 'మన ఇల్లు - మన లోకేశ్'
- తొలి విడతలో 3000 మందికి నివేశన స్థలాలు
- 13న 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన: మంత్రి లోకేశ్


పేదలకు నివేశన పట్టాతోపాటు నూతన వస్త్రాలను అందజేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.1,000 కోట్ల విలువైన ఆస్తులపై పేదలకు శాశ్వత హక్కును కల్పిస్తూ నివేశన పట్టాలను పంపిణీ చేస్తున్నామని మంత్రి లోకేశ్ అన్నారు. 'మన ఇల్లు- మన లోకేశ్' నినాదంతో పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని మంగళగిరి డాన్ బోస్కో ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు షెడ్యూల్‌లో భాగంగా మొత్తం 546 మందికి నివేశన పట్టాలను లోకేశ్ తన స్వహస్తాలతో పంపిణీ చేశారు. వారందరికీ నూతన వస్త్రాలను అందజేసి లబ్ధిదారుల కుటుంబాలతో కలసి ఫొటోలను దిగారు. ప్రారంభ సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... మంగళగిరిలో పోటీచేయాలని 2019లో తీసుకున్న నిర్ణయం, తదనంతర పరిణామాలు, 2024లో అత్యధిక మెజార్టీతో గెలుపొందడం వంటి విషయాలను భావోద్వేగంతో వివరించారు. మంగళగిరి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం తొలి విడతగా 3,000 మందికిపైగా పట్టాలను పంపిణీ చేయిస్తున్నా. దేవదాయ శాఖ, రైల్వే భూముల విషయంలో కొంత సమయం పట్టే అవకాశం వుంది. వాగు భూములు, అటవీ భూముల్లో నివశిస్తున్న వారికి పట్టాలను ఇప్పించడం చాలా కష్టమైన పని. అయినా నేను చేసి తీరుతా. అందుకు మూడేళ్లు పట్టవచ్చు. మొదటి విడత ఇస్తున్న పట్టాల విలువను బహిరంగ మార్కెట్‌తో పోల్చి చూస్తే రూ.1,000 కోట్ల వరకు వుంటుందని లోకేశ్ చెప్పారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి 13న శంకుస్థాపన చేస్తామన్నారు. భూగర్భ డ్రైనేజి, గ్యాస్, పైప్ లైన్లు... చివరకు భూగర్భ విద్యుత్ లైన్ల పనులు కూడ మంగళగిరిలో వచ్చే రెండు నెలల్లో ప్రారంభిస్తామని లోకేశ్ వివరించారు.

# విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ

కల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పేర్లతో పెంచుతున్న విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కమిషన్‌కు ప్రజలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కర్నూలు నగరశివారులోని దిన్నెదేవరపాడు ఏపీఈఆర్సీ కార్యాలయంలో 400 మెగావాట్ల సోలార్ విండ్ హైబ్రిడ్ పవర్ కొనుగోలు ఒప్పందంపై ఇన్‌చార్జ్ చైర్మన్ పీవీఆర్ రెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, యాక్సిస్ కంపెనీ సీఈఓ మురళి పీపీఏ అనుమతి కోసం కమిషన్‌ను కోరారు. ఒక యూనిట్ రూ.4.60 కొనుగోలుకు యాక్సిస్ కంపెనీ ప్రతిపాదించింది. వీడియో కాన్ఫరెన్స్, నేరుగా పలువురు అభిప్రాయాలు తెలియజేశారు. పీపీఏ ఒప్పందంపై ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందని ప్రకటించారు.

**సెకీతో ఒప్పందం రద్దు చేసుకోవాలి: సీపీఐ**

రాష్ట్ర ప్రభుత్వం సెకీతో చేసుకున్న ఒప్పందాన్ని, ప్రజలకు భారంగా మారిన యూజర్స్ చార్జీలను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ట్రూఅప్ చార్జీలు, ఇంధనపు చార్జీల పేరుతో పేదలపై పెంచే విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో ఏపీఈఆర్సీ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన రామకృష్ణ యాక్సిస్ ఎనర్జీ 400 మెగావాట్ల సోలార్ విండ్ హైబ్రిడ్ పవర్ కొనుగోలు ఒప్పందంపై అభిప్రాయాన్ని వెల్లడించారు.

# హైకోర్టులో ఐదుగురు స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం: ఉత్తర్వులు జారీ చేసిన న్యాయశాఖ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు ఐదుగురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాదులు.. ఏపీ కొండయ్య- ఏపీ విత్తనాభివృద్ధి కార్పొరేషన్, కేకే దుర్గా ప్రసాద్-తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, జి.రత్నకుమార్-ఏపీ ఎస్సీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, నందం జీవన్‌కుమార్-ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మహ్మద్ సలీం ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. వీరి నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

## మంగళగిరికి ఎంఎస్‌ఎంఈ ప్రధాన కార్యాలయం

- ప్రారంభించిన మంత్రి కొండపల్లి

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని మంగళగిరికి మార్చారు. విజయవాడలో కొనసాగిన ఈ కార్యాలయ భవనాలు శిథిలస్థితికి చేరుకోవడంతో.. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్ సమీపాన ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లోకి మార్చారు. నూతన కార్యాలయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు.

## నెలాఖరులోపు ఆస్తి పన్ను చెల్లిస్తే 5 % రిబేటు

పట్టణాల్లో 2025-26 సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నును ఈ నెలాఖరులోగా చెల్లిస్తే 5 శాతం రిబేటు కల్పిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.


## గిరిజన సంక్షేమశాఖ ఈఎన్‌సీ పోస్టు డౌన్‌గ్రేడ్

- సీఈ పదోన్నతులకు మార్గం సుగమం

గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ పోస్టును చీఫ్ ఇంజనీర్ స్థాయికి డౌన్‌గ్రేడ్ చేస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో చీఫ్ ఇంజనీర్ అత్యున్నత ఇంజనీర్ అధికారిగా ఉన్న గిరిజన సంక్షేమశాఖలో అప్‌గ్రేడ్ చేయడంతో అప్పట్లో చీఫ్ ఇంజనీర్ కమరుద్దీన్ ఇంజనీర్-ఇన్-చీఫ్ అయ్యారు. 2009లో ఆయన రిటైర్ అయ్యాక ఆ శాఖలో చీఫ్ ఇంజనీర్లు లేకపోవడంతో ఆ పోస్టులను పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లతో డిప్యుటేషన్‌పై భర్తీ చేయసాగారు. ఆ తర్వాత డీపీసీ అర్హత కలిగిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు 1994-95 నుంచి 2023-24 వరకు నోషనల్ పదోన్నతి కల్పించారు. వారిని సూపరింటెండెంట్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాలో చేర్చారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ పోస్టును డౌన్‌గ్రేడ్ చేయడం ద్వారా పదోన్నతులకు అవకాశం ఏర్పడుతుందని ఈఎన్‌సీ నివేదించడంతో ప్రభుత్వం ఈమేరకు ఆదేశాలిచ్చింది.

## నేడు తిరుమలకు సీజేఐ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ రోజు తిరుమల చేరుకుంటారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకుంటారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా ఆదివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.


రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## బెంగళూరులో మంత్రి నారాయణ బృందం

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులతో కలిసి శుక్రవారం బెంగుళూరులో పర్యటించారు. బెంగుళూరులో ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌లు, రియల్టర్లతో మంత్రి, అధికారులు సమావేశమయ్యారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం తీసుకున్న మోడల్స్‌ను క్షేత్రస్థాయిలో మంత్రి బృందం పరిశీలించింది. అమరావతిలోనూ ప్రైవేట్ సంస్థల ద్వారా రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. దీంట్లో భాగంగానే బెంగుళూరులో మోడల్స్‌ను మంత్రి పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# అందరూ దోషులేనా?

ఒక సిట్టింగ్ జడ్జి ఇంట్లో నోట్లకట్టలు దొరికితే, మీరు ఆయనను బదిలీ మాత్రమే చేశారు, మరి వీళ్ళను ఎందుకు చేయలేదు? అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఉద్దేశించి వేసిన ప్రశ్నలో అణచిపెట్టుకోలేనంత ఆగ్రహం, అక్కసూ కనిపిస్తున్నాయి. పదేళ్ళుగా పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేస్తున్న ఉపాధ్యాయుల నియామకప్రక్రియ అంతా కలుషితం, గందరగోళం, అవినీతిమయం అంటూ సుప్రీంకోర్టు గురువారం చేసిన నిర్ధారణ తృణమూల్ అధినేత్రికి పెద్ద ఎదురుదెబ్బ. సర్వోన్నత న్యాయస్థానం మీద గౌరవం ఉన్నదని అంటూనే, తీర్పు అనంతరం ఆమె తాను చేయదల్చుకున్న రాజకీయ వ్యాఖ్యలన్నీ చేశారు. పాతికవేలమంది కుటుంబాలను రోడ్డునపడేసిన పాపాన్ని బీజేపీ, సీపీఎం మీదకు నెట్టేశారు. గత ఏడాది కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం ఆమెకు మరింత బాధ కలిగించే అంశం. ఆ హైకోర్టు తీర్పు వెనుక ప్రస్తుతం బీజేపీ ఎంపీగా మారిన అప్పటి న్యాయమూర్తి ఉన్నారని కదా ఆమె వాదన.

ఏడాదిలో ఎంత మార్పు! పాతికవేలమందిని ఒక్కవేటున తొలగించడం, వారు ఎనిమిదేళ్ళుగా ఆర్జించిందంతా నెలరోజుల్లోనే వసూలు చేయడం ఇత్యాది కఠినమైన నిబంధనలతో గత ఏడాది కలకత్తా హైకోర్టు వెలువరించిన తీర్పు అమలును సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలువరించడంలో మానవీయ అంశాలతో పాటు అనేకం పనిచేశాయి. 2016నాటి ఈ రాష్ట్రస్థాయి పరీక్షలో అక్రమార్కులు ఎందరు, నీతిమంతులు ఎవరన్నది పట్టించుకోకుండా, బియ్యాన్నీ రాళ్ళనీ వేరు చేయకుండా, మొత్తం నియామకప్రక్రియనే తప్పుబట్టి, అందరూ దొంగలేనని నిర్ధారించడం అమానుషం కాదా? అని ప్రశ్నిస్తూ మమత ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సార్వత్రిక ఎన్నికలముందు వెలువడిన ఆ తీర్పువెనుక రాజకీయ కుట్ర ఉన్నదన్న వాదనను కూడా ఆమె ప్రజల్లోకి తీసుకుపోయారు. అభిజిత్ గంగోపాధ్యాయ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఈ కుంభకోణం మీద ఎంత శ్రద్ధచూపారో తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు వరుస ఎఫ్ఐఆర్‌లు నమోదవుతూ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులు జరుగుతూ తృణమూల్ బాగా అప్రదిష్టపాలైంది. ఏకంగా పద్నాలుగు కేసులను ఆయన సీబీఐకి అప్పగించి, ఎప్పటికప్పుడు మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లక్ష్యాలుగా విమర్శలు గుప్పించేవారు. ఒక దశలో సుప్రీంకోర్టు రంగప్రవేశం చేసి ఆయనను నిలువరించాల్సి వచ్చింది కూడా. రెండేళ్ళపాటు ఇలా అవినీతి వ్యతిరేకపోరాటం చేసిన ఈ సిట్టింగ్ జడ్జి సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి లోక్‌సభకు పోటీ చేయడంతో తృణమూల్‌కు ఆయుధం అందివచ్చింది. బీజేపీ మనిషి అంటూ ఎంతోకాలంగా తాము చెబుతున్నది నిజమైందని, ఈ కుంభకోణంలో ఆయన ఇచ్చిన ఆదేశాలన్నీ రద్దు చేయాలని తృణమూల్ అప్పట్లో డిమాండ్ చేసింది. అంతిమంగా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక బీజేపీ ఉన్నదని దాని వాదన.

విద్యామంత్రి పార్థాచటర్జీ సహా పలువురు నాయకులను జైలుకు పంపిన ఈ కుంభకోణంలో బీజేపీ, తృణమూల్ నాయకుల పరస్పర ఆరోపణలను అటుంచితే, కోల్‌కత్తా హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఆ మరుసటి నెలలోనే నిలిపివేయడం వెనుక ఈ కేసుతో లక్షన్నరమంది జీవితాలు ముడిపడివున్నాయన్న విచక్షణ కూడా ఉంది. సీబీఐ నివేదిక, స్కూల్ సర్వీస్ కమిషన్ చేసిన నిర్ధారణలు, వివిధ దర్యాప్తులు, విచారణలు తేల్చిన లెక్కలను బట్టి మొత్తం నియామకాల్లో ఓ నాలుగున్నర వేల పోస్టులు మాత్రమే అక్రమంగా భర్తీ అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం వాదన. ఇప్పుడు అక్రమం, సక్రమం నిష్పత్తిని నిగ్గుతేల్చకుండా హైకోర్టు మాదిరిగానే యావత్ ప్రక్రియను ఒకేగాటన కడుతూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుచెప్పడం ఈ ఉద్యోగులకు అశనిపాతం. ఈ తీర్పు ప్రభుత్వ నియామక వ్యవస్థల్లో జవాబుదారీతనాన్ని పెంచవచ్చు. కానీ, భార్యాబిడ్డలు, అమ్మానాన్నలను చూసుకుంటూ, అప్పునీ, అనారోగ్యాన్నీ మోసుకుంటూ, పదేళ్ళుగా ఉద్యోగంలో ఉంటూ మూడుపదులు దాటిపోయినవారిని ఇలా రోడ్డునపడవేస్తే మిగతా జీవితాన్ని ఎలా నెట్టుకొస్తారని న్యాయస్థానం ఆలోచించివుంటే బాగుండేది. కొందరు చేసిన పాపానికి అందరూ ఇంతటి శిక్ష అనుభవించాల్సిందేనా, వందమంది దోషులు తప్పించుకున్నా సరే, ఒక్క అమాయకుడు కూడా బలి కాకూడదన్న సహజ న్యాయసూత్రం ఇక్కడ అమలవుతున్నదా? అన్నవి ప్రశ్నలు.

# ముస్లింలపై మరో దాడి!

స్వాతంత్ర్య తొలి దశాబ్దంలో తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం–1954ను రద్దు చేస్తూ పార్లమెంటు 1995లో కొత్త వక్ఫ్ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టానికి 2013లో ప్రధాన సవరణలు చేశారు. జరిగిన సవరణలు 57 అని నా లెక్కలో తేలింది. దాదాపు 12 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎవరి ప్రయోజనాల కోసమయితే ఆ చట్టాన్ని చేశారో వారు ఏమైనా ఫిర్యాదులు చేస్తే వాటి ఆధారంగా కొత్త సవరణలు తప్పనిసరి అని లేదా లాభదాయకమని ప్రభుత్వం విశ్వసించిన పక్షంలో సవరణల బిల్లు ద్వారా సదరు చట్టంలో సంస్కరణలు తీసుకురావచ్చు. అయితే వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 చేసింది వక్ఫ్ చట్టాన్ని సంస్కరించడం ఎంత మాత్రం కాదు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతమున్న చట్టాన్ని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన సొంత ఉద్దేశాలతో గుర్తించడానికి వీలు లేకుండా వికృతం చేసింది. ఒక అసమగ్ర చట్టాన్ని తీసుకువచ్చింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

బహుళ మతాలు విలసిల్లుతున్న ఒక ప్రజాస్వామిక దేశంలో గౌరవించవలసిన మొదటి సూత్రం అన్ని మతాలు సమానమే అన్నది కాదూ? ఏదైనా ఒక మతానికి చెందిన మత సంస్థల నిర్వహణ అనేది విధిగా అదే మతస్థుల చేతుల్లో ఉండితీరాలి. హిందూ మతస్థులు అత్యధికంగా ఉన్న భారత్‌లో ఆ సూత్రం హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థలు అన్నిటికీ ఎటువంటి మినహాయింపు లేకుండా వర్తింపచేస్తున్నారు. 'మైనారిటీ' మతాల విషయంలోనూ ఈ సూత్రాన్ని భారత రాజ్యాంగం ప్రకారం వర్తింపచేస్తున్నారు. మత సంస్థల నిర్వహణలో స్వేచ్ఛ అనే విషయమై భారత రాజ్యాంగ అధికరణ 26 ఇలా నిర్దేశించింది: 'ప్రజా సంక్షేమం, ఆరోగ్యకరమైన నైతికతలకు లోబడి మత సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రతి మతానికి ఈ క్రింద ఉదహరింపబడిన స్వేచ్ఛ ఉంటుంది– మత, ధార్మిక సంస్థల సంస్థాపన, నిర్వహణ; మత విషయాల సంబంధిత కార్యకలాపాలను తమకుతామే నిర్వహించుకొనుట; స్థిర, చరాస్తులను సమకూర్చుకొనుట; చట్టం ప్రకారం సదరు స్థిర, చరాస్తుల నిర్వహణ.

హిందూ మత సంస్థలు, దాతృత్వ సంస్థల పాలనా వ్యవహారాలను హిందువులు మాత్రమే నిర్వహిస్తున్నారు. హిందూ దేవాలయాలు, మత సంస్థలు, దాతృత్వ సంస్థల నిర్వహణ, పాలనా వ్యవహారాలలో హిందూయేతరులకు పాత్ర కల్పించాలని ఎవరూ సూచించరు, హిందువులు ఎవరూ అటువంటి సూచనను అంగీకరించబోరు. ఇది స్పష్టం. (అసలు హిందూయేతరులు ఎవరినీ తిరుమల–తిరుపతి దేవస్థానంలో కనీసం ఉద్యోగులుగా కూడా నియమించకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు). ఇతర మతాలకు చెందిన కోట్లాది అనుయాయులు కూడా అదే అభిప్రాయాన్ని కలిగివున్నారు.




ప్రస్తుతం ఉన్న వక్ఫ్ చట్టాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వికృతం చేసి, ఈ అసమగ్ర చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలే అయి ఉండాలన్న నిబంధనను తొలగించారు. ముస్లిమేతరులు కూడా బోర్డులో నియమితులవుతారు. మరి, దీన్ని ఇతర మతాల సంస్థల పాలనావ్యవహారాలకు కూడా వర్తింపచేస్తారా? హిందూ సంస్థలలో హిందూయేతరులను నియమిస్తారా? వక్ఫ్ (సవరణ) ముస్లిం మతస్థులపై మరో దాడి, సందేహం లేదు. అదొక దుష్టయోచన ఫలితమని స్పష్టమవుతోంది.

ప్రస్తుతం హిందూ, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ మతాలకు సంబంధించిన ఆరాధనా మందిరాలు, దాతృత్వ సంస్థలలో ఏ ఇతర మతానికి చెందిన వ్యక్తికి పాత్ర కల్పించేందుకు చట్టాలు అనుమతించడం లేదు.

వక్ఫ్ చట్టం–1995 కింద ఆ సూత్రాన్ని నిష్ఠాబద్ధంగా పాటించారు. వక్ఫ్ అంటే ముస్లిం చట్టం గుర్తించిన ధార్మిక, మత, దాతృత్వ కార్యకలాపాల కోసం ఏ వ్యక్తి అయినా ఆస్తిని శాశ్వతంగా సమర్పించడం. ముస్లిమేతరులు సృష్టించిన వక్ఫ్‌లను సైతం న్యాయస్థానాలు గుర్తించడం జరిగింది. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఒక వక్ఫ్ అనేది చాలవరకు స్వతంత్ర, స్వయం పాలిత ఆస్తి. రాష్ట్రాల స్థాయిలో వక్ఫ్ ఆస్తుల నియంత్రణకు అత్యున్నత సంస్థ వక్ఫ్ బోర్డు. ఇందులో సభ్యులు అందరూ విధిగా ముస్లింలే ఉంటారు. ఛీఫ్ ఎక్జిక్యూటివ్ అధికారి సైతం ముస్లిమే అయివుండాలి. ఈ బోర్డు తన అధికారాలను వక్ఫ్ ఆదేశాలకు, వక్ఫ్ లక్ష్యాలకు, వక్ఫ్ ఆచారాలు, ఉపయోగాలకు అనుగుణంగా చెలాయించాలి. వక్ఫ్ ఆస్తులపై న్యాయ నిర్ణయాలు తీసుకునే అధికారం ఒక ట్రిబ్యునల్‌కే ఉంటుంది. ఈ న్యాయాధికార సంస్థకు జిల్లా జడ్జి ఛైర్‌పర్సన్‌గా ఉంటారు.

వివాదాస్పద సవరణ బిల్లు ఎంతో కాలంగా ఉన్న సూత్రాలు, ఆచరణలను తలకిందులు చేసింది: (1) 'ఏ వ్యక్తి అయినా' ఒక వక్ఫ్‌ను సృష్టించలేడు; కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్నానని నిరూపించిన వ్యక్తి మాత్రమే ఒక వక్ఫ్‌ను సృష్టించాలి. ఎందుకు? ఒక వ్యక్తి తాను ఇస్లాంను ఆచరిస్తున్నానని ఎలా నిరూపించాలి? సమాధానం లేదు. (2) ఒక వక్ఫ్ సృష్టికర్త తన చర్యవెనుక ఎటువంటి 'వంచనాపూర్వక ఎత్తుగడ' లేదని నిరూపించాలి. 'వంచనాపూర్వక ఎత్తుగడ' అంటే ఏమిటి? సమాధానం లేదు; (3) వక్ఫ్‌గా సమర్పించిన ఆస్తి 'ప్రభుత్వ' ఆస్తి అని వాదన వస్తే దాని నిజానిజాలపై సీనియర్ ప్రభుత్వాధికారి విచారణ నిర్వహించాలి. సదరు వక్ఫ్ ప్రభుత్వ ఆస్తి అవునో కాదో ఆ విచరాణాధికారి నిర్ణయిస్తాడు. ప్రభుత్వ ఆస్తి అని నిర్ధారించినపక్షంలో ఆ అధికారి అందుకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో సవరణలు చేయాలి. ఇది న్యాయమూర్తి తన సొంత కేసులో తానే తీర్పు ఇవ్వడం'లాంటిది కాదా? ఈ ప్రశ్నకూ సమాధానం లేదు. (4) రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలే అయి ఉండాలన్న నిబంధనను తొలగించారు. ఈ ప్రకారం ముస్లిమేతరులను కూడా వక్ఫ్ బోర్డులో నియమితులవుతారు. మరి దురుద్దేశాలతో వ్యవహరించే ఒక ప్రభుత్వం ముస్లిమేతరులనే ఎక్కువగా వక్ఫ్ బోర్డు సభ్యులుగా నియమించవచ్చు. ఇదొక తిరోగామి నిబంధన. మరి దీన్ని ఇతర మతాల సంస్థల పాలనావ్యవహారాలకు కూడా వర్తింపచేస్తారా? హిందూ మత/ దాతృత్వ సంస్థలలో హిందూయేతరులను నియమిస్తారా? సమాధానం లేదు; (5) వక్ఫ్ (సవరణ) బిల్లు నమూనా అద్వితీయమైనది. దీని స్ఫూర్తితో ఇతర మతాల సంస్థలకు సంబంధించిన చట్టాలలో కూడా సవరణలు చేస్తారా?

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలపై దాడిని జాతీయ పౌరుల పట్టిక/ పౌరసత్వ సవరణ చట్టంతో ప్రారంభించింది. ఉమ్మడి పౌర స్మృతిని తొలుత ఉత్తరాఖండ్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ముస్లింలు మెజారిటీగా ఉన్న ఏకైక రాష్ట్రం జమ్మూ–కశ్మీర్‌ను విభజించి కేంద్ర పాలిత ప్రాంతాల స్థాయికి కుదించారు. 2019–20 నుంచి 2023–24 దాకా మైనారిటీలకు మొత్తం రూ.18,274 కోట్ల మేరకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. అయితే ఆ మొత్తంలో రూ. 3,574 కోట్ల ఖర్చు పెట్టనే లేదు. మౌలానా ఆజాద్ ఫెలోషిప్ ఫర్ మైనారిటీ స్టూడెంట్స్‌తో సహా ముస్లింలకు అందిస్తున్న విద్యాసంబంధ సహాయాన్ని నిలిపివేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు ముస్లిం మతస్థులపై మరో దాడి, సందేహం లేదు. అదొక దుష్టయోచన ఫలితమని స్పష్టమవుతోంది.


గత ఏడాది 18వ లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లు తమకు ఇచ్చింది 240 సీట్లు మాత్రమే అయినప్పటికీ ప్రజల వైఖర్లు, అభిప్రాయాలు ఏమీ మారలేదని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది. 17వ లోక్‌సభ కాలంలో అనుసరించిన రాజకీయ అజెండానే జాతీయ పాలక పార్టీ ఇప్పుడూ ఔదలదాల్చుతోంది. మార్పులేని ఆ అజెండానే అమలు పరిచేందుకు బీజేపీ నిశ్చయించుకుంది. అందులో భాగమే పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన కొత్త వక్ఫ్ చట్టం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# నికోబార్‌లో నమ్మకద్రోహం

సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై బహిరంగ చర్చలలో ఏ పదమూ, 'జాతీయ మీడియా'లా భ్రమలు కల్పించదు, తప్పుదోవ పట్టించదు. జాతీయ మీడియాగా పరిగణన పొందుతున్న వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, టీవీ ఛానెల్స్ ఆలోచనా రీతులు సంకుచిత పరిధిలోనే ఉండిపోతున్నాయి. సైద్ధాంతిక, పక్షపాత గంతలు కట్టుకుని వాస్తవాలను చూస్తున్నాయి. జాతీయ రాజధాని ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్) నుంచి, తరచు ఎన్‌సిఆర్ నుంచి మాత్రమే మన సువిశాల భారతదేశ సంఘటనలు, పరిణామాలను అవి చూస్తున్నాయి. అధికార పీఠానికి అన్ని విధాల చేరువలో ఉండడం వాటిని ప్రలోభపరుస్తుంది, సంతృప్తి పరుస్తుంది. కనుకనే వార్తాపత్రికల సంపాదకీయ పుటలో కేంద్ర కేబినెట్ మంత్రుల వ్యాసాలు తరచు ప్రచురితమవుతుంటాయి. ఇక టెలివిజన్‌లో భారతావని విలక్షణ వైవిధ్యం భిన్న పార్టీలకు చెందిన రాజకీయవేత్తల మధ్య అరుపులు, కేకల వ్యవహారానికి పరిమితమవుతోంది! ఈ కారణంగానే మన సువిశాల మాతృభూమి వేర్వేరు ప్రాంతాలలోని విభిన్న సామాజిక సముదాయాల జీవనస్థితిగతులపై నిశిత, సమగ్ర అధ్యయనాలకు సంబంధించిన కథనాలకు 'జాతీయ' వార్తాపత్రికలలో అల్ప ప్రాధాన్యం మాత్రమే లభిస్తుండగా, 'జాతీయ' టెలివిజన్‌లో అసలు ప్రస్తావనకే నోచుకోవడం లేదు!

'జాతీయ మీడియా'పై నా సంశయాలు సంవత్సరాలుగా పెరుగుతూనే ఉన్నాయి. అవి సహేతుకమైనవని పెద్ద ఎత్తున వెల్లడవుతోన్న ఒక జాతీయ కళంకం గురించిన రెండు ప్రశస్త వ్యాస సంకలనాలు ధ్రువపరిచాయి. మరి ఎన్‌సిఆర్‌లోని ఏ టెలివిజన్ స్టూడియోలోను ఆ విషయమై ఎన్నడూ ఎలాంటి చర్చ కనీస మాత్రంగానైనా జరగలేదు. జరగగలదనే ఆశాభావానికి సైతం ఆస్కారం లేదు. నేను ప్రస్తావించిన లజ్జాకర విషయం గ్రేట్ నికోబార్ దీవిలో ప్రణాళికా బద్ధ విధ్వంసం. చెన్నై నుంచి వెలువడే ఫ్రంట్ లైన్ మ్యాగజైన్ (3 మార్చి, 2025 సంచిక), పంకజ్ సేఖ్సారియ సంకలనం చేసిన వ్యాస సంపుటంలో ఆ అంశంపై నిశిత, విపుల వ్యాసాలు ఉన్నాయి. పంకజ్ సంకలనం 'The Great Nicobar Betrayal' ఒక దుర్బల దీవిని ప్రభుత్వం బుద్ధిపూర్వకంగానే విపత్తులోకి నెట్టివేస్తోందని పేర్కొంది. పంకజ్ స్వయంగా అండమాన్ నికోబార్ దీవులలో పలు సంవత్సరాల పాటు పరిశోధన నిర్వహించారు. ఆయన సంకలనంలోని వ్యాస రచయితలకు కూడా ఆ దీవుల స్థితిగతుల గురించి పరిశోధనల రూపేణా ప్రత్యక్ష పరిజ్ఞానం ఉన్నది.




గ్రేట్ నికోబార్‌లో అమలవుతున్న మెగా ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం ఒక విపుల ప్రణాళికతో ఆ దీవి ప్రాకృతిక, సాంస్కృతిక సమగ్రతపై సంకల్పించిన దాడి. పర్యావరణాన్ని పరిరక్షించి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించవలసిన శాసన విహిత బాధ్యతలు ఉన్న ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీల హక్కులను రక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను విస్మరించడం దిగ్భ్రాంతిగొలుపుతుంది.

కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రాజెక్టుతో గ్రేట్ నికోబార్ దీవికి అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆ వ్యాసాలు అన్నీ స్పష్టం చేశాయి ప్రస్తుతం ఆ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,000కోట్లు. ఇది ఇంకా తప్పకుండా పెరుగుతుందని నిశ్చితంగా చెప్పవచ్చు. ఈ దుర్బల దీవిలో ఒక నౌకాశ్రయం, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, భారత్ ప్రధాన భూభాగం నుంచి వలసవెళ్లే లక్షలాది ప్రజల ఆవాసానికిగాను ఒక పట్టణాన్ని ఆ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. 910 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రేట్ నికోబార్ దీవి నికోబార్ దీవుల సముదాయంలో చాలా పెద్దది. 'అండమాన్, నికోబార్ అనే ద్వీప సముదాయంలో భాగంగా ఉన్న గ్రేట్ నికోబార్ భూకంపాలకు ఆస్కారమున్న ప్రాంతం. ఈ దీవిలో గత దశాబ్దంలో 400కు పైగా భూకంపాలు నమోదయ్యాయి. 2004లో గ్రేట్ నికోబార్ సునామీ తాకిడికి గురయింది. దీవి అంతా ధ్వంసమయింది. ఆ దీవివాసులు అయిన ఆదివాసీలలో అనేక మంది సునామీలో కొట్టుకుపోయారు. మరెంతో మంది పూర్తిగా నిరాశ్రయులయ్యారు.

ఆ సముద్ర ఉత్పాతం ఊహించని, ఆకస్మిక పరిణామం. అయితే ఇప్పుడు అమలవుతున్న కొత్త ప్రాజెక్టు ప్రభుత్వం ఒక విపుల ప్రణాళికతో ఆ దీవి ప్రాకృతిక, సాంస్కృతిక సమగ్రతపై సంకల్పించిన దాడి! అవును, అక్షరాలా దౌర్జన్యమే, సందేహం లేదు. నౌకాశ్రయ నిర్మాణంతో అరుదైన భారీ తాబేళ్ల ఆవాస ప్రదేశాలన్నీ ధ్వంసమవుతాయి. ఇంకా పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతుంది. నిర్మించనున్న పుర నివేశం (టౌన్‌షిప్)తో 130చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని కోటికి పైగా వృక్షాలు ఉన్న దట్టమైన అడవి అంతరించిపోతుంది. ఈ దీవి చాలా అరుదైన, స్థల విశిష్ట వృక్ష, కీటక, పక్షి, జంతు జాతులు, సరీసృపాలకు నెలవు. ఈ జీవ వైవిధ్యమంతా నాశనమై పోతుంది. ఇదంతా పర్యావరణ పరమైన హాని కాగా సామాజిక మూల్యాలు అంతే తీవ్రమైనవి. అసలే దుర్బలురు అయిన ఆ దీవి మూలవాసులు అందరూ మరింతగా పేదరికంలోకి జారిపోతారు. గిరిజన సముదాయాలను కాపాడాలనే రాజ్యాంగ నిర్దేశాలు పూర్తిగా ఉల్లంఘనకు గురవుతాయి. గ్రేట్ నికోబార్‌లో ప్రస్తుతం 8500 మంది నివసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలయితే జనాభా సంఖ్య 40 రెట్లు పెరుగుతుంది. ఆ దీవి సంస్కృతి, పర్యావరణంపై భారతదేశ ప్రధాన భూభాగం నుంచి జనాభా వలసల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ మార్పు చాలా హానికరంగాను, మార్పులేనిదిగాను ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అండమాన్ నికోబార్ దీవులలో విస్తృతంగా క్షేత్ర పరిశోధనలు చేసిన అజయ్ సైని, అన్విత అబ్బి ఇటీవల ఒక వ్యాసంలో ఇలా రాశారు: 'గ్రేట్ నికోబార్ మెగా ప్రాజెక్టు కేవలం ఒక పర్యావరణ విపత్తు మాత్రమే కాదు; అభివృద్ధి పేరిట జరుగుతున్న ఉద్దేశపూర్వక, భయంకర, భాషాసంబంధి, సాంస్కృతిక జాతి సంహారం'.

ఈ మెగా ప్రాజెక్టు గ్రేట్ నికోబార్‌ను సామాజిక నిర్మాణాలను పర్యావరణ వ్యవస్థలనూ పూర్తిగా ధ్వంసంచేస్తుంది. ఆర్థిక లబ్ధిపరంగా చూసిన అది సమర్థనీయమైన ప్రాజెక్టు కానేకాదు. ఫ్రంట్‌లైన్‌లో వెలువడిన ఒక వ్యాసం శీర్షిక 'The numbers do not add up' (సంఖ్యలు కలిసిరావు) ఆ వాస్తవాన్ని ప్రభావదాయకంగా చెప్పింది. నౌకాశ్రయం, పర్యాటక రంగం నుంచి సంభావ్య రాబడి పెద్దగా ఉండదని, ఆ ప్రాజెక్టును ఆర్థికంగా ప్రయోజనకరంగా చేయదని రాజశేఖర్ వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరిచేందుకు భారీ ధనరాశులను ఉపయోగించడం వాస్తవంగా ప్రైవేట్ కార్పొరేట్ ప్రయోజనాలకు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. ఈ వ్యాసాలను చదవడం ద్వారా ఆ దీవి పర్యావరణాన్ని పరిరక్షించి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించవలసిన శాసన విహిత బాధ్యతలు ఉన్న ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీల హక్కులను రక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను ఎలా విస్మరిస్తున్నారో దిగ్భ్రాంతి గొలుపుతుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, భారతీయ వన్యప్రాణుల సంస్థ, నీతి ఆయోగ్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించకుండా, సాధ్యాసాధ్యాలను నిర్దుష్టంగా అంచనా వేయకుండా మెగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను ఎంత నిరాలోచనగా మంజూరు చేశాయో పంకజ్ సంకలన గ్రంథం, ఫ్రంట్‌లైన్‌లోని వ్యాసాలు విపులంగా వివరించాయి.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈ హానికర వ్యవహారంలో గౌరవనీయ శాస్త్రవేత్తలు సైతం భాగస్వాములు కావడం కలవరం కలిగిస్తోంది. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మాజీ డైరెక్టర్ ఒకరు 2018లో ఈ మెగా ప్రాజెక్టుకు ఆక్షేపణ తెలుపడాన్ని పంకజ్ తన వ్యాసంలో ప్రస్తావించారు. 'చాలా ఆందోళనకరమైన ప్రాజెక్టు అని, దాన్ని అమలుపరిస్తే ప్రపంచ సాగర జీవవైవిధ్యపు అరుదైన ప్రదేశాలు పూర్తిగా ధ్వంసమవుతాయని' ఆ శాస్త్రవేత్త అన్నారు. 'గ్రేట్ నికోబార్ జీవ వైవిధ్యాన్ని యథాతథంగా పరిరక్షించాలని, ఆ దీవి స్వతస్సిద్ధ పర్యావరణ వనరులను జాతీయ ఆస్తులుగా పరిరక్షించాలని ఆ శాస్త్రవేత్త సూచించారు. అయితే కొద్ది సంవత్సరాల అనంతరం ఒక ప్రభుత్వ కమిటీ ఛైర్మన్‌గా నియమితుడైన ఆ శాస్త్రవేత్త మాట మార్చి గ్రేట్ నికోబార్‌లో ఆ ప్రతిపాదిత మెగా ప్రాజెక్టును అమలుపరిచి తీరాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు! స్వతంత్ర వైఖరి ఉన్న యువ శాస్త్రవేత్తలు ఆ మెగా ప్రాజెక్టును స్ఫూర్తిదాయకంగా వ్యతిరేకించారు. యువ పర్యావరణవేత్తలు రోహన్ ఆర్థర్, టిఆర్ శంకర్ రామన్‌లు ఫ్రంట్‌లైన్‌లో రాసిన ఒక వ్యాసంలో గ్రేట్ నికోబార్‌లోని సమృద్ధ జీవ వైవిధ్యాన్ని, అక్కడి ఆదివాసీ సమూహాలకు తమ ప్రాకృతిక పరిసరాలతో ఉన్న ప్రగాఢ అనుబంధాన్ని వివరించి, ప్రతిపాదిత ప్రాజెక్టుకు 'నష్టపరిహారంగా అభివృద్ధిపరిచే అడవులు', దెబ్బతిన్న ప్రవాళ భిత్తికల 'పునరుద్ధరణ' పథకాలు ప్రయోజకరమైనవి కాబోవని' స్పష్టం చేశారు. 'ప్రణాళికాబద్ధ పర్యావరణ విపత్తును వైజ్ఞానిక పరిశోధకులుగా మేము సమర్థించలేమని' వారు నిక్కచ్చిగా చెప్పారు. పంకజ్ సంకలన గ్రంథానికి ప్రముఖ పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ ముందు మాట రాశారు. 'పాలక వర్గాలు పర్యావరణ భద్రతను కాపాడేందుకు, సామాన్య ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు పూనుకోవనేది ప్రపంచ దేశాల అనుభవం. ప్రజా ఉద్యమాలు మాత్రమే ప్రభుత్వాలు అలా పర్యావరణ, ప్రజాహితకరంగా వ్యవహరించేలా చేస్తాయి' అని గాడ్గిల్ పేర్కొన్నారు.

గ్రేట్ నికోబార్ ప్రాజెక్టును నౌకా లేదా వాణిజ్య మంత్రిత్వ శాఖ కాకుండా హోం మంత్రిత్వ శాఖ నిర్వహించడం గమనార్హం. ఇది చాలా ఆందోళనకరమైన విషయం కూడా. ప్రాజెక్టుపై విమర్శలు, ఆక్షేపణలను ముందుగానే అణచివేసేందుకే ఇలా జరుగుతుందన్నది స్పష్టం. నిజానికి జర్నలిస్టులు ఇప్పుడు ఆ దీవిని సందర్శించడం అంతకంతకూ కష్టతరమవుతోంది. ఈ వ్యాస రచనకు ఆధారాలు అయిన క్షేత్ర పరిశోధనలు నిర్వహించిన రచయితలు, యువ పరిశోధకులు ఆ మెగా ప్రాజెక్టును తప్పుపడుతూ, దాని సంభావ్య విపత్కర పర్యవసానాలకు పాలకులే బాధ్యులు అని నిష్కర్షగా చెప్పారు. ఇందుకు వారు మన ఉమ్మడి కృతజ్ఞతలకు పాత్రులు. వారు అదే సమయంలో మన 'జాతీయ మీడియా' సిగ్గుపడేలా చేశారు సుమా!

(వ్యాసకర్త చరిత్రకారుడు)

# దార్శనిక నాయకుడు జగ్జీవన్‌రామ్

ఆధునిక భారత నిర్మాతల్లో ఒకరుగా పేరుగాంచిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్. సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికనే దేశ సమైక్యత సాధ్యపడుతుందని చాటిన జాతీయవాది. తండ్రి జీవన తాత్విక బాటలో అహింసాతత్వాన్ని పుణికిపుచ్చుకొని, జాతీయోద్యమంలో గాంధీ స్ఫూర్తితో పాల్గొని, దేశ రాజకీయాల్లో ఒక సరికొత్త నినాదంగా మారిన వ్యక్తి.

జగ్జీవన్‌రామ్ బాల్యం, విద్యాభ్యాసం బిహార్‌లోని 'అర్రా'లో కొనసాగాయి. ఇక్కడే ఆయనకు మదన్‌మోహన్ మాలావ్యా వంటి రాజకీయ ఉద్దండులతో పరిచయం అయింది. కలకత్తాలో చదువుకునే రోజుల్లో కార్మిక సభకు నాయకత్వం వహించి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి పెద్దల దృష్టిని ఆకర్షించారు. చంద్రశేఖర్ ఆజాద్ వంటి విప్లవకారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. విద్యార్థి నాయకుడిగా సమాజంలోని అంతరాలను రూపుమాపేందుకు అనేక తాత్విక సిద్ధాంతాలను అధ్యయనం చేశారు. 1934లో బిహార్‌లో సంభవించిన తీవ్ర భూకంప సహాయక చర్యల్లో పాల్గొని అనేక మంది జాతీయ నాయకుల దృష్టిని ఆకర్షించారు. పేద, అణగారిన వర్గాల అభ్యున్నతికి గాంధీజీ చేస్తున్న కృషి జగ్జీవన్‌రామ్‌కు ఆదర్శప్రాయమైంది. గాంధీజీ అహింసా సిద్ధాంతం ప్రభావంతో అట్టడుగు వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం దక్కాలని ఆయన ఉద్యమించారు. స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న కాలంలో సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారు.



వ్యవసాయ కూలీల హక్కుల కోసం 'కేతిహర్ మజ్దూర్' సభను స్థాపించి వారి సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం పోరాడారు. 'ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్' ద్వారా దళితులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని; విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించి తద్వారా కింది వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేరువయ్యేలా చేయాలని ఉద్యమించారు. 1935లో 'హమాండ్' ఆధ్వర్యంలో ఏర్పాటయిన 'డీలిమిటేషన్' కమిటీ ముందు హాజరై దళితులకు ఓటు హక్కు కావాలని ఉద్యమించారు. రాజ్యాంగ రచనా సంఘ సభ్యుడిగా సమానత్వం, వివక్షలను రూపుమాపే అధికరణాల రూపకల్పనలో కీలకపాత్ర వహించారు.

అంటరానితనం నిర్మూలనకు, వెనుకబడిన వర్గాలు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందేందుకు, ఎస్సీ–ఎస్టీలకు చట్టసభలో సీట్లు రిజర్వు కావడానికి విజయవంతమైన పాత్ర పోషించారు. రాజ్యాంగంలో ఇటువంటి మార్గదర్శకాలు ఉండటం వల్ల సామాజిక, రాజకీయ సాధికారతకు, ఆర్థిక పురోభివృద్ధికి సాధనాలుగా ఉంటాయని భావించారు. ఇవన్నీ సాధించేందుకు డాక్టర్ అంబేడ్కర్‌తో కలిసి ఇతర సభ్యులతో వాదులాడి రాజ్యాంగంలో సామాజిక న్యాయ అంశాన్ని సాధించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుండి దళితుల రిజర్వేషన్లకు కాపలాదారుడిగా, ఉద్యోగ, విద్యా రంగాలలో వారి హక్కులకు భంగం వాటిల్లకుండా కాపాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్.

బాబుజీ ఇరవై ఎనిమిదేళ్ళకే బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎంపికయ్యారు. నాలుగు దశాబ్దాలు పార్లమెంటేరియన్‌గా కొనసాగారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో దేశానికి మొట్టమొదటి కార్మికమంత్రిగా కనీస వేతన చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సవరణ) చట్టం, బోనస్ చెల్లింపుల చట్టం వంటి వివిధ కార్మిక సంక్షేమ కార్యక్రమాలు రూపకల్పన చేశారు. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ వంటి చట్టాల ద్వారా 'సామాజిక భద్రత' అంశానికి పునాది వేశారు. ఫ్యాక్టరీస్ చట్టం ద్వారా మహిళలు, బాలలు ప్రమాదకర పరిశ్రమల్లో, వృత్తుల్లో పనిచేయడాన్ని నిషేధించారు. కాంట్రాక్ట్ లేబర్ సంక్షేమ విధానాన్ని ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం 'కార్మికుల జాతీయ కమిషన్' ఏర్పాటు చేసి, కార్మికుల స్థితిగతులు, అభివృద్ధి వంటి పలు విషయాలపై నివేదిక కోరారు. 1969లో కమిటీ సమర్పించిన నివేదికలో అనేక ప్రయోజనకర ప్రతిపాదనలు అమలు చేశారు.

రైల్వే మంత్రిగా రైల్వేలను ఆధునికీకరించి, సంస్కరణలు చేపట్టారు. లక్షలాది దళిత అణగారిన వర్గాలకు రైల్వేలో ఉద్యోగావకాశాలు కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెరుగుదలకు బాటలు వేశారు. దేశ రక్షణమంత్రిగా ఆయన చూపిన దీక్షాదక్షతలు నేటికీ ఆదర్శనీయమే. పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతున్నప్పుడు సియాచిన్ పర్వత శ్రేణులలో సైనికులతో కలసి తిరిగారు. "పాకిస్థాన్ భూభాగంలో మాత్రమే యుద్ధం జరగాలని" భారత సైన్యాన్ని ఉత్సాహపరుస్తూ సైనికుల్లో సైనికుడిగా మెలిగారు. వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలికారు. ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టి నిరుపేదల ఆకలి తీర్చేందుకు శ్రీకారం చుట్టారు.

ఈ దేశ ప్రజల చేత 'బాబూజీ' అని పిలిపించుకున్న గౌరవం దక్కింది జగ్జీవన్‌రామ్‌కి. గొప్ప దేశభక్తుడు, జాతీయ నాయకుడు, మానవీయమూర్తి, భరతమాత ముద్దుబిడ్డ అయిన జగ్జీవన్‌రామ్‌ను 'భారతరత్న'గా గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

● డొక్కా మాణిక్య వరప్రసాద్
మాజీమంత్రి

(నేడు జగ్జీవన్‌రామ్ జయంతి)

# నష్టాల్లో కోకో రైతులు


ఆంధ్రప్రదేశ్‌లో 75 వేల ఎకరాలలో కోకో తోటల సాగు ఉంది. ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉంది. కోకోను చాక్లెట్లు, కేకులు, వివిధ ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్నారు. అవసరాలకు తగిన విధంగా మన దేశంలో ఉత్పత్తి లేదు. 80శాతం కోకోను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.

గత సంవత్సరం రైతుకు కిలో కోకో గింజలకు సరాసరి ధర రూ.749 లభించింది. రాష్ట్రంలో 1992 నుంచి ఇంత ధర వచ్చిన సందర్భాలు లేవు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి రైతులు కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదు. పైగా అన్ సీజన్ (వర్షాకాలపు) గింజలు కొనుగోలు చేయడం లేదు. సీజన్ కోకో గింజలు ధర రోజు రోజుకీ తగ్గిస్తున్నారు. కోకో రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు సిండికేట్‌గా మారి ఇబ్బంది పెడుతున్నాయి.

పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదు. అన్ సీజన్ గింజలు కొనలేమని, నాణ్యత లేదని బుకాయిస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం కూడా కంపెనీలకు కొనాలని గట్టిగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త గింజలు కొంటామని, పాత గింజలు కొనలేమని చెప్పడం అన్యాయం. కొత్త గింజలకు రూ.650 నుంచి రూ.500లకు ధర తగ్గించారు. ఈ ధర మరింత తగ్గిస్తామని కంపెనీలు రైతులను బెదిరిస్తున్నాయి. అన్ సీజన్ గింజలను రూ.200 నుంచి రూ.240లకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇది కూడా నామమాత్రమే. మొత్తంగా రెండువేల టన్నుల వరకు పాత గింజలు రైతులు వద్ద ఉండిపోయాయి.

కోకో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఎకరా కోకో తోటలకు రూ. లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు కౌలు ఉంది. ఎకరాకు ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు రూ.60 వేల వరకు అవుతున్నాయి. ప్రస్తుతం కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. కంపెనీలు తమకు కావలసిన కోకోను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఎగుమతులు, దిగుమతులు విధానం వల్ల కోకో రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతులు నిలుపుదలకు చర్యలు చేపట్టడం లేదు. ఆయిల్ పామ్, కొబ్బరి వంటి పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్న కేంద్రం, కోకో గింజలకు ఇంతవరకు ధర నిర్ణయించే ఒక ఫార్ములాను రూపొందించకపోవడం అన్యాయం. కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు రైతులు. ప్రస్తుతం కంపెనీలు ఇస్తున్న ధర వల్ల రైతులు నష్టపోతున్నారు కాబట్టి వ్యత్యాసపు ధరను ప్రభుత్వాలు చెల్లించాలి. విదేశీ కోకో గింజలు దిగుమతుల నిలుపుదలకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి. రాష్ట్రంలో కోకో ప్రాసెసింగ్ యూనిట్స్ నెలకొల్పి, రైతుకు మంచి ధర వచ్చేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఈ పరిస్థితుల్లో సమస్యల పరిష్కారం కోసం రైతులు సంఘటితం కావాలి.

– కె.శ్రీనివాస్
కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




# ఎత్తిపోతున్నాయ్!



## టీడీపీ ప్రభుత్వంలో 50కిపైగా ఎత్తిపోతల పథకాల నిర్మాణం

## వాటిలో వేదాద్రి- కంచల ఎత్తిపోతల పథకం ఓ అద్భుతం

- చంద్రబాబు హయాంలోనే ఈ పథకం నిర్మాణం
- బీడు భూములను సాగులోకి తెచ్చిన ఈ పథకాలకు వైసీపీ హయాంలో గ్రహణం
- మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రశ్నార్థకంగా సాగు
- కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో చిగురించిన ఆశలు



### నేడు ముప్పాళ్లకు సీఎం చంద్రబాబు రాక

రైతు సంక్షేమమే ధ్యేయంగా నాడు టీడీపీ హయాంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలను వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. పచ్చగా కళకళలాడుతున్న పంట పొలాలకు చుక్కనీరు రాకుండా చేశారు. కనీస మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయకుండా పథకాలను పాడుపెట్టించారు. ఫలితంగా వేలాది ఎకరాల పంట పొలాలు బీడు భూములుగా మారాయి. కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో ఆశలు చిగురించాయి. శనివారం సీఎం చంద్రబాబు నందిగామ నియోజకవర్గానికి రానుండటంతో నిధులు మంజూరు చేసి ఎత్తిపోతల పథకాలకు పూర్వవైభవం తెస్తారని రైతులు ఆశగా చూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, నందిగామ): మెట్ట ప్రాంతమైన ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్పీ జోన్-2 పరిధిలో ఉంది. ఆయకట్టుకు మూడు దశాబ్దాలుగా సాగర్ జలాలు రావడం లేదు. దీంతో వ్యవసాయంపై రైతులు ఆశలు వదులుకుంటున్న సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా, మునేరు నదులపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి వరకూ 70వ దశకంలో డాక్టర్ కేఎల్‌రావు హయాంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు మాత్రమే ఉన్నాయి. ఆ తర్వాత చంద్రబాబు హయాంలో ఒక్క నందిగామ నియోజకవర్గంలోనే 50కిపైగా పథకాల నిర్మాణం జరిగింది. కాంగ్రెస్ హయాంలో కొన్ని పథకాలు నిర్మించగా, వైసీపీ పాలనలో ఒక్క పథకం కూడా నిర్మించలేదు. టీడీపీ ప్రభుత్వంలోనే అప్పటి నందిగామ ఎమ్మెల్యేలు దేవినేని వెంకటరమణ, దేవినేని ఉమామహేశ్వరరావు, తంగిరాల ప్రభాకరరావు పెద్దయెత్తున నిధులు తీసుకువచ్చి కృష్ణా, మునేటి నదులపై ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. పలితంగా మెట్ట ప్రాంతంలో రైతులు బంగారు పంటలు పండించారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ జలవనరులశాఖ ద్వారా ఈ పథకాలన్నింటినీ కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు. ఆ ఐదేళ్ల కాలంలో ఎన్టీఆర్ జిల్లాలోని పలు పథకాల మరమ్మతులకు రూ.80 కోట్ల నిధులు ఇచ్చి ఆదుకున్నారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకాలకు గ్రహణం పట్టింది. కనీస మరమ్మతులకు కూడా నిధులు ఇవ్వకపోగా, పథకాల సొమ్మును నొక్కేసి శిథిలావస్థకు చేర్చారు.




మూతపడిన వేదాద్రి ఎత్తిపోతల పథకం (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన 130 అడుగులపైకి నీటిని తీసుకువెళ్లే పైపులైన్లు

### పాడుబడ్డ వేదాద్రి- కంచల ఎత్తిపోతల పథకం

మూడు దశాబ్దాల క్రితం ఊహకు కూడా అందని విధంగా వేదాద్రి వద్ద టీడీపీ హయాంలో ఎత్తిపోతల పథకం నిర్మించారు. కృష్ణానది నుంచి 130 మీటర్ల ఎత్తుకు నీటిని తోడి అక్కడి నుంచి గ్రావిటీపై 4300 మీటర్లు పైపుల ద్వారా కొండలు, గుట్టలు దాటుకుంటూ కృష్ణా మిగతా 6లో..

### పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉపాధి

నియోజకవర్గంలో వనరులు ఉన్నప్పటికీ పెద్దగా పారిశ్రామికీకరణ జరగలేదు. రెండు, మూడు పరిశ్రమలు మాత్రమే ఏర్పడ్డాయి. యువతకు ఉపాధి కరువైంది. గత టీడీపీ ప్రభుత్వంలో నందిగామ మండలం పెద్దవరం వద్ద 1,080 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి అప్పగించి అభివృద్ధి పరిచారు. ఆ భూముల్లో పరిశ్రమల స్థాపనకు పెద్దయెత్తున దరఖాస్తులు అందుతున్న తరుణంలో ప్రభుత్వం మారింది. పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోయారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టి ఆ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాల్సి అవసరం ఉంది. కరోనా సమయంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో బల్క్‌డ్రగ్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం రెడ్‌కార్పెట్ వేసింది. ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా పరిశ్రమల ఏర్పాటుకు లైసెన్స్‌లు జారీ చేసింది. చాలా మంది లైసెన్స్‌లు కూడా పొందారు. వారందరినీ ఆహ్వానించి ఆ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాల్సి అవసరం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న శావల దేవదత్

# కొలికపూడిపై తిరుగుబాటు

## కార్యకర్తల సమావేశంగా మారిన ముఖ్య నేతల అంతర్గత సమావేశం

పార్టీ కార్యాలయం కిటకిట ● ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహావేశాలు

- వైసీపీ వారితో కలిసి దందాలు చేస్తున్నారని ధ్వజం
- పార్టీని రక్షించుకునేందుకు సమష్టిగా కష్టపడతామని వెల్లడి
- అధిష్టానం చర్యలు తీసుకోవాలని డిమాండ్

తిరువూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీరుపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుమార్చుకోకపోతే పార్టీని కాపాడుకునేందుకు తామంతా ఆయనపై తిరుగుబాటు చేసేందుకు సిద్ధమంటూ వారు ప్రకటించారు. గురువారం సాయంత్రం ముఖ్యనాయకుల అంతర్గత సమావేశం నిర్వహించారు. ఇదే సందర్భంలో ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల టీడీపీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు రావడంతో నియోజకవర్గ కార్యాలయం నిండిపోయింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పార్టీ అవిర్భవించిన నాటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తల్ని ఎమ్మెల్యే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఆయన్ను కలిసేందుకు ఆయన కార్యాలయం ముందు గంటలకొద్ది పడిగాపులు పడినా, పట్టించుకోకుండా వెళ్ళిపోతాడని, అడుగడుగున అవమానలపాలు చేస్తున్నట్టు కొందరు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వైసీపీ నాయకులతో అంటకాగుతూ, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించేందుకు చూస్తున్నట్టు కొందరు నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటనల సందర్భంలో గ్రామ పార్టీ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఆ గ్రామంలో వైసీపీ నాయకుల ఇళ్లకు వెళుతున్నాడని, ఆయా గ్రామాల్లో టీడీపీకి చెందిన వారినే ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు కొందరు నాయకులు ఆరోపించారు. టీడీపీ నాయకులపైనే నియోజకవర్గంలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడని, వైసీపీ నాయకులతో కలిసి మట్టి, ఇసుక దందాలు చేయిస్తున్నాడని కొందరు మిగతా 6లో..

## దళిత రామం

- నాలుగు చోట్ల దళిత రామాలయాలు ● చిన్న భద్రాచలం కొటికలపూడి
- పూజారులు దళితులే ● రాములోరి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

8లో

# కుమ్మేసిన వాన

## తడిసి ముద్దయిన ధాన్యం ● నేలకూలిన అరటి.. రాలిన మామిడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/రూరల్) అకాల వర్షం కుమ్మేసింది. గాలి చుట్టేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు విజయవాడతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసింది. దీంతో విజయవాడ నగరంలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోయింది. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. ఉష్ణోగ్రతలు మండుతున్న సమయంలో ఒక్కసారి వర్షాలు కురవడంతో భూమి నుంచి ఉష్ణతాపం పైకి వస్తోంది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఉక్కపోతలు ఉండగా, ఉష్ణతాపం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. గడచిన కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో వాతావరణంలో థండర్‌స్ట్రామ్ ఏర్పడడం వల్ల ఈ అకాల వర్షాలు కురుస్తున్నట్టు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. వరుసగా నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకుతున్నప్పుడు సాధారణంగా థండర్‌స్ట్రామ్ ఏర్పడుతుందని స్పష్టం చేస్తున్నారు. ఈ కారణంగానే వర్షాలు కురుస్తున్నాయని అంటున్నారు. ఈ వర్షాలు మరో రెండు రోజులపాటు కురిసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వర్షం కురిసింది. వీరులపాడు మండలంలో వర్షం కురవలేదు. విస్సన్నపేట మండలంలోను ఇదే పరిస్థితి ఉంది. వత్సవాయి మండలంలో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. తిరువూరులో చిరుజల్లులు కురిశాయి. ఏ.కొండూరు మండలంలో ఓ మోస్తారు వర్షం కురిసింది.

### పంటలకు నష్టం

అకాల వర్షం నగరాన్ని ముద్ద చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో పంటలకు నష్టం తెచ్చింది. వాన ఒకరకంగాను, గాలి మరోరకంగాను రైతులకు నష్టాన్ని కలిగించాయి. ఈ నష్టం ఎక్కువగా విజయవాడ రూరల్ మండలంలో జరిగింది.



పాతపాడు వద్ద పశ్చిమ బైపాస్‌పై ఆరబోస్తున్న ధాన్యం

అసలే పూతలు ఆలస్యం కావడంతో మామిడి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడిప్పుడే కాయలు దశకు తోటలు చేరుకున్నాయి. ఈ ఆనందాన్ని గాలివాన మింగేసింది. రూరల్ మండలంలో 2వేల ఎకరాల్లో మామిడితోటలు ఉన్నాయి. అందులో 50 ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానవన శాఖ అధికారులు నిర్ధారించారు. పది శాతం మామిడి కాయలు ఈ గాలివానకు రాలిపోయాయి. జిల్లాలో అరటి పంట 350 ఎకరాల్లో ఉంటే, రూరల్ మండలంలో నాలుగు ఎకరాల్లో ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో అరటితోటలు నేలకొరిగాయి. గెలలు ఉన్న చెట్లు నేలను తాకడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలులో మిగతా 6లో..

# ట్రస్టు భూములపై వెలంపల్లి కన్నేశారు!

వందల కోట్ల రూపాయల విలువైన గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్టు భూములను చేజిక్కించుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వంలో దేవదాయశాఖ మంత్రిగా పనిచేసిన వెలంపల్లి శ్రీనివాసరావు విశ్వప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి లీజుదారులకు అండగా తెర వెనుక పావులు కదిపారని విమర్శలు ఉన్నాయి. ఇదే సమయంలో ట్రస్టీ వారసులకు అండగా ఉన్నట్టు డబుల్ గేమ్ ఆడినట్లు సమాచారం. విచారణ అధికారి నివేదికను సైతం బయటకు రానీయకుండా తొక్కిపట్టడంలో కీలక పాత్ర వహించినట్లు తెలిసింది.





పటమటలోని గోవిందరాజులు ట్రస్ట్ భూములు

## గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్టు భూములు కొట్టేసేందుకు నాడే ప్రణాళిక!

### మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి తెర వెనుక పావులు!

- లీజుదారులకు అండగా వ్యవహారాలు
- ట్రస్టీ వారసులతోనూ కలిసి డబుల్ గేమ్
- వైసీపీ ప్రభుత్వంలో నివేదికను తొక్కిపట్టడంలో కీలకపాత్ర
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న నిగూఢ అంశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వెలంపల్లి శ్రీనివాసరావు దేవదాయశాఖ మంత్రిగా పనిచే శారు. అప్పుడే ఈ భూములపై కన్నేసినట్టు సమాచారం. గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములను లీజుకు తీసుకున్న వారికి అండదండలు అందిస్తూ ఆ భూములను తమ నియంత్రణలోకి తీసుకునేందుకు పథకం వేశారని సమాచారం. అయితే ఆయన మంత్రిగా ఉన్నంతకాలం ఈ భూములను చేజిక్కించుకోలేకపోయారు. రెండున్నర సంవత్సరాల పాటు వెలంపల్లి దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశాక, కొట్టు సత్యనారాయణను మంత్రిగా నియమించారు. గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములకు సంబంధించి లీజుదారులకు అండగా మాజీ మంత్రి వెలంపల్లితో పాటు సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి.

### భూముల ధరలు పెరగడంతో..

పటమటలోని సర్వే నంబర్ 91/2లోని 5.92 ఎకరాల గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్టు భూములు అనేవి 1947లో వారి కుటుంబీకులు డాక్యుమెంట్ నంబర్ 949 ద్వారా ట్రస్ట్ డీడ్ చేశారు. 1966 దేవదాయశాఖ చట్టం సెక్షన్ 38లోని 17 భాగం మేరకు ఆర్‌డీఎస్ నంబర్ ఏ1/14572/81 ప్రకారం మిగతా 6లో..

### గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే వెలుగులోకి..

ఈ భూములపై లీజుదారులు ఒక వైపు, ట్రస్టీ వారసులు మరోవైపు కన్నేశారు. లీజుదారులలో ఒకరు అయితే ఏకంగా ఓ జాతీయ బ్యాంకు దగ్గర ఈ భూములు తనఖా పెట్టి రూ.100 కోట్లకు రుణం తీసుకున్నారు. ఈనాం భూములుగా కాకుండా సర్వే నంబర్ గ్యాంబ్లింగ్‌తో దొంగ రిజిస్ట్రేషన్ చేసి దానిపై రుణాన్ని పొందినట్టు సమాచారం. ఈ రుణం ఎంతకూ తీర్చకపోవటంతో బ్యాంకులు నోటీసులు ఇవ్వటం ప్రారంభించాయి. దాదాపుగా బ్యాంకుకు రూ. 200 కోట్ల మేర వడ్డీతో సహా చెల్లించాల్సి ఉందని తెలిసింది. ఈ వ్యవహారం కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే వెలుగులోకి వచ్చింది.

# నలుగురిని కాపాడి..

## ఇనుప గడ్డర్ల కిందపడి కాంక్రీట్ మేస్త్రీ మృతి

కృష్ణాజిల్లా మాదలవారిగూడెంలో ఘటన » మృతుడిది ఏలూరు జిల్లా ఆగిరిపల్లి



కొండలు (ఫైల్)

గన్నవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నలుగురు మహిళలను కాపాడి.. ఇనుప గడ్డర్ల కిందపడి కాంక్రీట్ మేస్త్రీ మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా గన్నవరం మండలం మాదలవారిగూడెంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లికి చెందిన పిల్లిబోయిన కొండలు(35) కాంక్రీట్ మేస్త్రీగా పని చేస్తున్నారు. మాదలవారిగూడెంలో ఓ ఇంటికి స్లాబు వేసేందుకు కూలీలను తీసుకువచ్చారు. కాంక్రీట్‌ను పైకి తీసుకువెళ్లేందుకు లిఫ్ట్‌ను బిగిస్తున్నారు. ఈ క్రమంలో ఇనుప గడ్డర్‌లకు ఉన్న క్లాంపులు విరిగిపోయాయి. ఆ గడ్డర్‌లు నలుగురు మహిళలపై పడిపోతుండగా.. గమనించిన కొండలు వెంటనే అక్కడకు వెళ్లి వారిని పక్కకు నెట్టివేశాడు. ఈ క్రమంలో ఆ గడ్డర్‌లు కొండలు తలమీద పడటంతో బలమైన గాయాలు అయ్యాయి. రక్త స్రావంతో ఉన్న కొండలును విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### తీరప్రాంత రక్షణ ప్రశ్నార్థకం! 8లో

- మెరైన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత

### సైఫన్ పరేషాన్! 6లో

- 400 ఎకరాల ఆయకట్టుకు ఇవే ఆధారం

# మార్కెట్ యార్డు ఛైర్మన్లుగా నలుగురు నియామకం



రేగళ్ల లక్ష్మి



రవికుమార్



శివశంకర్



భీముని అనంతలక్ష్మి

## టీడీపీకి తిరువూరు, గుడివాడ, జనసేనకు గన్నవరం, పెడన

- ఛైర్మన్‌లుగా రేగళ్ల లక్ష్మి, చాట్రగడ్డ రవికుమార్, గరికపాటి శివశంకర్, భీముని అనంతలక్ష్మి

గంపలగూడెం/గుడివాడ/హనుమాన్‌జంక్షన్/పెడన, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నాలుగు మార్కెట్ యార్డులకు ఛైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. టీడీపీకి తిరువూరు, గుడివాడ, జనసేనకు గన్నవరం, పెడన దక్కాయి. తిరువూరు ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా గంపలగూడెం మండల టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి భార్య, మాజీ ఎంపీటీసీ రేగళ్ల లక్ష్మీఅనిత, గుడివాడ ఛైర్మన్‌గా నందివాడ మాజీ ఎంపీపీ చాట్రగడ్డ రవికుమార్, గన్నవరం ఛైర్మన్‌గా హనుమాన్‌జంక్షన్‌కు చెందిన జనసేన పార్టీ యువనేత గరికపాటి శివశంకర్, పెడన ఛైర్మన్‌గా పెడన మండలం ఉరిమి గ్రామానికి చెందిన భీముని అనంతలక్ష్మి నియమితులయ్యారు.



# జగన్మాత శరణు..

» జాజులు, కాగడామల్లెలు, మరువంతో పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్రమాస నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా జరుగుతున్న ప్రత్యేక పుష్ప అర్చనల క్రమంలో ఆరో రోజైన శుక్రవారం జాజులు, కాగడా మల్లెలు, మరువంతో కనకదుర్గమ్మను అర్చించారు.



అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన జాజులు, మరువంతో అర్చిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దుర్గమ్మను నవరాత్రుల్లో మల్లెలు, జాజులు, సంపెంగలు, తామర, కలువ పూలతో అర్చిస్తారు. అలాగే మరువం, ధవనం, తులసి, మారేడుదళాలతో విశేషంగా అర్చిస్తారు. శుక్రవారం తెల్లని కాగడా మల్లెలు, జాజులు, మరువంతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహించారు. పుష్పార్చనలో ఆలయ అధికారులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి వివిధ రకాలు పుష్పాలను సమర్పించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

## దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకోవటానికి శుక్రవారం ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో క్యూలు బారులు రి కొండపైన, దిగువన భక్తులు కిటకిటలాడారు. దేవస్థానం అధికారులు దుర్గాఘాట్ వద్ద నుంచి కొండపైకి, మహామండపం సమీపం వరకు భక్తుల సౌకర్యం నిమిత్తం ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఈవో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఆలయ ఉద్యోగులు రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టారు. చలివేంద్రాల ద్వారా భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఉచిత ప్రసాద వితరణ నిర్వహించారు.



### దుర్గామల్లేశ్వరులకు విశేష నిత్య పూజలు..

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరులు, పరివార దేవతలకు శుక్రవారం విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. చైత్ర మాసం, వసంత నవ రాత్రులను పురస్కరించుకుని ఆది దంపతుల సన్నిధిలో వివిధ ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కళ్యాణం పూజల్లో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పల్లకీ సేవలో ఆదిదంపతులను దర్శించుకున్నారు. సాయంత్రం దర్బార్ సేవ జరిగింది. ఆనవాయితీ ప్రకారం ఇంద్రకీలాద్రి అధిష్టాన దేవత కనకదుర్గమ్మ వారికి ఆలయ జమా, ఖర్చులను పండితులు నివేదించారు.

## దుర్గమ్మకు వెండి నివేదన పాత్ర కానుక

ఇంద్రకీలాద్రి : కృష్ణా జిల్లా పూర్వ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం కుటుంబసభ్యులతో శుక్రవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసి దుర్గామల్లేశ్వరుల సేవలో వినియోగించడానికి గాను 2కిలోల 10గ్రాముల ఐదు గిన్నెల నివేదన పాత్ర సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు దాత, కుటుంబీకులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు ఆశీస్సులు అందచేశారు. అనంతరం అధికారులు వీరికి ప్రసాదం, శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటం అందచేశారు.



వెండి నివేదన పాత్రను అందజేస్తున్న లక్ష్మీకాంతం దంపతులు

## జనగణనతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలి

నామినేటెడ్ పోస్టుల్లో 34 % ఓబీసీలకు కేటాయించాలి: కేసన

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం తీర్మానించింది. గుంటూరులో శుక్రవారం జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో పూలే విగ్రహాన్ని నిర్మించాలన్నారు. ఓబీసీలకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, పనుల్లో 34% ఓబీసీలకు కేటాయించాలన్నారు. చట్టసభల్లో 33% ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.

## కొలికపూడిపై తిరుగుబాటు

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తలు ఆరోపించారు. పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేపై సరైన చర్యలు తీసుకోకపోతే నియోజకవర్గంలో టీడీపీ తీవ్రంగా నష్టపోతుందని, తామంత పార్టీని రక్షించుకునేందుకు సమిష్టిగా కృషిచేస్తామని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అర్హులకు అందేలా చూడటంతో పాటుగా, పార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారం కార్యక్రమాల అమలుకు కష్టపడి పనిచేస్తామని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో నినదించారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, పార్టీకి జరుగుతున్న నష్టాన్ని వివరించేందుకు అధిష్టానం వద్దకు వెళ్ళేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు శావల దేవదత్, చెరుకూరి రాజేశ్వరరావు, వెదురు వెంకటనర్సిరెడ్డి, తాళ్లూరి రామారావు, బొమ్మసాని మహేష్, ఆలవాల రమేష్‌రెడ్డి, మాదల హరిచరణ్(కిట్టు), గద్దె వెంకటేశ్వరరావు, నెక్కడపు వెంకటేశ్వరరావు, బడా శ్రీను, రేగళ్ళ వీరారెడ్డి, నాలుగు మండల నాయకులు గ్రామ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

# సైఫన్ పరేషాన్!

## 400 ఎకరాల ఆయకట్టుకు ఇవే ఆధారం

- 50 ఏళ్ల క్రితం స్వచ్ఛందంగా నిర్మించుకున్న రైతులు
- శిథిలావస్థకు చేరి మూడేళ్లయినా పట్టని పాలకులు, అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- 1, 2 బ్రాంచ్‌ల పరిధిలో ప్రశ్నార్థకంగా సాగు

సాగునీరందించేందుకు రైతులు స్వచ్ఛందంగా విరాళాలు వేసుకుని 50 సంవత్సరాల క్రితం నిర్మించిన సైఫన్ విరిగి మూడేళ్లయినా గత వైసీపీ పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు పట్టించుకోకపోవటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా సైఫన్ల పునర్నిర్మాణాలు చేపట్టి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

(మోపిదేవి, ఆంధ్రజ్యోతి)



శిథిల సైఫన్ చూపుతున్న ఆయకట్టు రైతులు




9/2 బ్రాంచ్ వద్ద శిథిలమైన సైఫన్ స్థానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పీవీసీ పైపు

మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి గ్రామంలో 9వ నెంబర్ పంట కాలువ పరిధిలోని 1, 2 బ్రాంచ్ ఆయకట్టులో 50 సంవత్సరాల క్రితం రైతులు స్వచ్ఛందంగా సైఫన్ నిర్మించుకున్నారు. సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవటంతో రూ.2 లక్షల విరాళాలు సేకరించి రెండు బ్రాంచ్‌ల పైన సైఫన్‌లను నిర్మించారు. నాటినుంచి 400 ఎకరాల ఆయకట్టు 9 నెంబర్ సాగునీటి కాలువ ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల మూడేళ్ల క్రితం రెండు సైఫన్‌లు పూర్తిగా శిథిలమై విరిగిపోయాయి. నాటి నుంచి అధికారులకు తెలియజేసినా పునర్నిర్మాణానికి నిధులు లేవంటూ దాట వేశారు. దీంతో రైతులు తాత్కాలికంగా ప్లాస్టిక్ పైపులను ఏర్పాటు చేసుకుని అంతంత మాత్రంగా వస్తున్న నీటితో ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగుకే ఆర్థిక భారం కాగా, ఆయిల్ ఇంజన్లు మరింత ఖర్చవుతోందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1, 2 బ్రాంచ్‌ల పరిధిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సైఫన్‌లు అరకొరగా నీరు వస్తున్నాయని, రూ.15 లక్షల వ్యయంతో అంచనాలు వేసి అధికారులు, ప్రజాప్రతినిధులకు నివేదించినట్టు రైతులు తెలిపారు. దీనికి డ్రెయినేజీ శాఖ తమకు సంబంధం లేదని చెప్పగా, ఇరిగేషన్ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవటం లేదన్నారు. 9/1, 9/2 బ్రాంచ్ కాలువల నుంచి మంగళవాని శింకు డ్రెయిన్ మీదుగా సైఫన్ నిర్మించాల్సి ఉంది. ఈ వేసవిలోనైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సైఫన్లు పునర్నిర్మించాల్సిందిగా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### నిర్మాణాలు సత్వరం చేపట్టాలి

\- వేములపల్లి సుభాష్ చంద్రబోస్



9/1, 9/2 బ్రాంచ్ కాలువల నుంచి మంగళవాని శింకు మీదుగా ఉన్న సైఫన్లు శిథిలమై మూడేళ్ల గడిచింది. నాడు వైసీపీ ప్రభుత్వం దృష్టికి సైఫన్ల నిర్మాణ విషయం ఆయకట్టు రైతులు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. మూడేళ్లుగా పంటలు సాగు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోగా శిథిలమైన సైఫన్లు స్థానంలో కొత్తవి నిర్మించాల్సిందిగా కోరుతున్నాం.

### సైఫన్లు లేకుంటే సాగు కష్టమే

\- కూరపాటి నరేష్



పెదకళ్లేపల్లిలో 9వ నెంబర్ కాలువ నుంచి మంగళవానిశింకు డ్రెయిన్ మీదుగా ఉన్న సైఫన్లు నూతనంగా నిర్మించని పక్షంలో సాగు చేయటం కష్టమే అవుతుంది. ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడుకుని పంటలు పండిస్తున్నాం. ఆయిల్ ఇంజన్ల ద్వారా రైతులు తీవ్ర భారాన్ని మోయాల్సి వస్తున్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సైఫన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

- పర్యవేక్షించిన కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు సౌమ్య, తాతయ్య

చందర్లపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు సీఎం హాజరవుతున్న సంగతి విదితమే. ఈమేరకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది శుక్రవారం ఉదయం గ్రామంలో హెలిప్యాడ్, అక్కడి నుంచి ప్రజావేదిక స్థలం, గురుకుల పాఠశాల వరకూ ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాదర్బార్‌తో పాటు పీ4 కార్యక్రమం, కార్యకర్తల సమావేశాల కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. రహదారుల వెంట పారిశుధ్య పనులు పూర్తిచేశారు. కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు గ్రామాన్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే తక్షణం వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ నందిగామ ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిని ఆదేశించారు.



సిద్ధమైన సభా వేదిక



ముప్పాళ్ల గ్రామంలోఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సౌమ్య, తాతయ్య

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

శనివారం ఉ.10.15లకు సీఎం చంద్రబాబు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో ముప్పాళ్ల చేరుకుంటారు. 11 గంటల వరకు ముఖ్యనేతలతో చర్చల అనంతరం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో 30 నిముషాల పాటు ముఖాముఖి నిర్వహిస్తారు. 11.46కు ప్రజావేదికకు చేరుకుని 1.34 గంటల వరకూ కార్యక్రమాలలో పాల్గొంటారు. తొలుత జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పించి అనంతరం విద్యార్థులకు లాప్‌ట్యాప్‌ల పంపిణీ, చెప్పుల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన, తర్వాత ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగిస్తారు. అనంతరం విశ్రాంతి తీసుకుని తిరిగి 3.34 గంటల వరకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 4.20కి హెలిప్యాడ్ నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

### ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ సీపీ రాజేంద్రబాబు ఆధ్వర్యంలో ముప్పాళ్ల గ్రామంలో పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పలు ఆంక్షలు విధించారు. నందిగామ నుంచి చందర్లపాడు వెళ్లే వాహనాలను డీవీఆర్ కాలనీ, అడవిరావులపాడు, కోనాయపాలెం, బొబ్బిళ్లపాడు మీదగా చందర్లపాడు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఏటూరు, చింతలపాడు, తోటరావులపాడు, తుర్లపాడుల నుంచి నందిగామ, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి కంచల, కీసర మీదగా ఏర్పాట్లు చేశారు. నందిగామ నుంచి చింతలపాడు, ఏటూరు, తుర్లపాడు వెళ్లే వారు కేతవీరునిపాడు మీదగా తుర్లపాడు వైపు వెళ్లాలని సూచించారు. రోడ్డు పక్కన ఇళ్లలోని ప్రజల కదలికలపై నిఘా పెట్టారు. రోడ్డును పూర్తిగా బ్లాక్ చేశారు.

# ట్రస్టు భూములపై..

(5వ పేజీ తరువాయి)

జనవరి 22, 1982లో రిజిస్టర్ అయి ఉంది. కాబట్టి ఈ పబ్లిక్ ట్రస్ట్ అనేది దేవదాయ శాఖ పరిధిలోకి రావటం జరిగింది. ఈ ట్రస్ట్‌కు సంబంధించిన భూములను అంతకు పూర్వమే అప్పటి ట్రస్టీలుగా వ్యవహరించిన వారు లీజులకు ఇచ్చారు. పటమట ప్రాంతం ఒక గ్రామంగా ఉన్న రోజుల్లో ఈ లీజు వ్యవహారం జరిగింది. గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు చెందిన భూములకు సంబంధించి ఒక ఎకరం ఒకరికి లీజుకు ఇవ్వగా, మరో 3.92 ఎకరాల భూమిని ఆంధ్రా ఆయిల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, సురేంద్ర కాటన్ ఆయిల్ మిల్స్ సంస్థలకు లీజుకు ఇచ్చారు. అప్పట్లో వీటిని కారుచౌకగా లీజులకు ఇవ్వటం జరిగింది. కాలక్రమంలో పటమట కాస్తా విజయవాడ నగరంలో అత్యంత ధనికమైన ప్రాంతంగా అభివృద్ధి చెందింది. దీంతో గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములకు కూడా విలువ పెరిగింది. రూ.250 కోట్ల పైబడి ఈ భూములకు ధర పలుకుతోందంటే అర్థం చేసుకోవచ్చు.

### దేవదాయశాఖ అధికారులపై ఒత్తిడి

దేవదాయశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఈ భూములు దేవదాయ శాఖ పరిధిలోకే రావన్న వాదనలను నాడు తెరమీదకు తీసుకువచ్చినట్టు సమాచారం. ఈ వాదనలు తీసుకురావటం వెనుక మాజీ మంత్రి వెలంపల్లి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం అప్పటి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు తెలియటంతో ఆయన ఆదేశాల మేరకు దేవదాయశాఖ అధికారులు విజయవాడ నగర పరిధిలోని సత్రాలు, చారిటబుల్ ట్రస్టులు వంటి వాటికి సంబంధించి తగిన నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించటం జరిగింది. ఈ క్రమంలో మచిలీపట్నం రాబర్ట్‌సన్ పేటలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం ఈవో సుబ్బారెడ్డి గోవింద రాజులు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములకు సంబంధించి లోతుగా అధ్యయనం చేసి అప్పటి ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ అధికారికి సవివరమైన నివేదికను అందించారు. ఈ నివేదికపై స్థానిక దేవదాయ శాఖ అధికారులను తదుపరి చర్యలు తీసుకోకుండా మాజీ మంత్రి వెలంపల్లి ఒత్తిడి తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. దేవదాయ శాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ రాకపోయి ఉంటే ఈ భూములు ఎప్పుడో అన్యాక్రాంతమైపోయి ఉండేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్టు వ్యవహారంలో మాజీ మంత్రి వెలంపల్లి డబుల్ గేమ్ కూడా ఆడినట్టుగా తెలుస్తోంది. ఇటు లీజుదారులతో పాటు అటు వారసులకు కూడా సహాయ సహకారాలు అందించినట్టుగా విమర్శలు ఉన్నాయి.

### 'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారుల్లో కదలిక

ట్రస్టీ వారసులు కూడా ఈ భూములను అమ్ముకునేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాల్సిందిగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పబ్లిక్ ట్రస్ట్‌గా ఉన్న భూములను అమ్ముకోవటానికి అవకాశం లేదని విచారణాధికారి స్పష్టం చేశారు. దీంతో పాటు గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు చెందిన ట్రస్టీ దేవదాయ చట్టం 30/87లోని సెక్షన్ 28(1)లో ఏ ప్రకారం సంస్థ ఆస్తులను కాపాడలేకపోయారని, ట్రస్టు ఆశయాలను నెరవేర్చలేదని, చట్టవిరుద్ధంగా నష్టం కలిగించే చర్యలు తీసుకున్నారని తన రిపోర్టులో పొందుపరుస్తూ ట్రస్టీకి సెక్షన్ 28(2) ప్రకారం ముందుగా నోటీసు ఇచ్చి వారి నుంచి సరైన సమాచారాన్ని తీసుకున్న తర్వాత దేవదాయ చట్టం 28(3) ప్రకారం ఆ ట్రస్టీని తాత్కాలికంగా తొలగించి వేరే ట్రస్టీని నియమించాల్సిన అవసరం ఉందని తన నివేదికలో పేర్కొన్నారు.

అలాగే ట్రస్టు ఆస్తులను అమ్మకానికి సంబంధించిన చర్యలను కూడా రద్దు చేసి, తిరిగి రాబట్టాల్సిన అవసరాన్ని కూడా వివరించారు. కానీ ఈ నివేదిక ప్రకారం దేవదాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి మాజీ మంత్రి ఒత్తిడే ప్రధాన కారణమని తెలుస్తోంది. గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల 'రూ.250 కోట్ల పబ్లిక్ ట్రస్ట్ భూమి గోవిందా!' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై దేవదాయ శాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. అంతకు ముందు వరకు దేవదాయశాఖ ఉన్నతాధికారులు కూడా ఈ ట్రస్ట్ దేవదాయశాఖకు సంబంధం లేదన్న వాదనలు తెర మీదకు తీసుకువచ్చారు. 2023లో ఈ భూములకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారికి ఇది దేవదాయచట్టం పరిధిలోకి వస్తుందని, పబ్లిక్ ట్రస్టు అని నివేదిక ఇవ్వటం జరిగింది. ఈ నివేదిక బయటకు రావటంతో దేవదాయ శాఖ అధికారులు విచారణకు ఆదేశించారు.



బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన వారికోసం ఏర్పాటు చేసిన బెడ్స్

### ప్రభుత్వాసుపత్రిలో 10 పడకలతో

## బర్డ్ ఫ్లూ ఐసోలేషన్ వార్డు

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈమధ్య కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న వ్యాధి బర్డ్ ఫ్లూ. వ్యాధి తీవ్రతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో 10 పడకల స్పెషల్ ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేసినట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏవీ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను ప్రభుత్వం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి, స్పెషల్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీఎంఈ ఆదేశాల మేరకు 10 పడకలకు సంబంధించి వెంటిలేటర్లు మల్టీపారామానిటర్లు ఏర్పాటు చేశారన్నారు. అంతేకాక ఈ విభాగానికి పల్మనాలజీ డాక్టర్ సుధీనాను హెచ్‌వోడీగా నియమించి తక్షణ బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఉన్నట్టు అనుమానం ఉంటే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విజయవాడ జీజీహెచ్ ప్రత్యేక వార్డు, మంచాలు, వైద్యసేవలు అందుతున్న విషయాన్ని తెలియజేయాలని ఆయన కోరారు.



స్వరపేటిక ఆపరేషన్ చేసిన రోగితో వైద్యులు

### విజయవంతంగా స్వరపేటిక శస్త్రచికిత్స

ప్రభుత్వాసుపత్రి : ప్రభుత్వాసుపత్రిలో రోగికి స్వర పేటిక శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. భీమడోలు మండలం ఆగడాలకు చెందిన ఎస్.పవన్ కల్యాణ్ (35) ప్రమాదంలో స్వరపేటిక దెబ్బతిని పూర్తిగా మూసుకుపోయింది. బాధితునికి ఆరోగ్యశ్రీ కార్డు లేనందున ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు రూ.50 వేల విలువ చేసే టి.ట్యూబ్‌ను ముంబాయి నుంచి శస్త్రచికిత్స నిమిత్తం తెప్పించారు. శుక్రవారం ప్రొఫెసర్, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కొణిదె రవి ఆధ్వర్యంలో రోగికి షియన్ - యానల్ టెక్నిక్ ద్వారా టి.ట్యూబ్ (స్టెంట్)ని అమర్చి స్వరపేటిక ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అనంతరం రోగి మాట్లాడుతున్నాడని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ విజయవంతం చేసినందుకు సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావులు వైద్య బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### మహిళా సాధికారత కేంద్రాలకు నిధులివ్వలేదు

- లోక్‌సభలో కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : మిషన్ శక్తి పథకం కింద ఏపీలోని రాష్ట్ర మహిళ సాధికారత(మహిళా శక్తి) కేంద్రాలకు గత రెండేళ్లుగా నిధులు విడుదల చేయలేదని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. శుక్రవారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ..ఏపీకి 2022-23లో రూ.2.12 కోట్లు విడుదల చేయగా, 2023-24, 2024-25లో నిధులు విడుదల చేయలేదని తెలిపారు.

# 'ఎత్తి' పోతున్నాయి!

(5వ పేజీ తరువాయి)

జలాలు పంట పొలాలకు పారించారు. ఇది ఒక ఇంజనీరింగ్ అద్భుతంగా అందరూ కొనియాడారు. రెండు విడతలుగా జరిగిన ఈ పథకం నిర్మాణం ద్వారా 17 వేల ఎకరాలు స్థిరీకరించబడింది. 2300 అశ్వసామర్థ్యం గల మోటార్ల ద్వారా సుమారు 350 క్యూసెక్కు నీటిని నిరంతరం అందించారు. అటువంటి మహోన్నతమైన ఈ పథకాన్ని వైసీపీ పాలకులు నాశనం చేశారని విమర్శలు ఉన్నాయి. మోటార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో 17 వేల ఎకరాలు బీడు వారుతున్నాయి.

### సీఎం చంద్రబాబు పర్యటనపై రైతుల ఆశలు

జిల్లా వ్యాప్తంగా వేదాద్రితో పాటు జిల్లాలో మొత్తం 74 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి ఆయకట్టులో సుమారు 70 వేల ఎకరాల భూమి సాగవుతోంది. ఈ పథకాల్లో చాలా వరకూ మరమ్మతులకు గురై ఉన్నాయి. కొన్ని పథకాలను రైతులు అతికష్టం మీద నడుపుతుండగా, కొన్ని పథకాలు పూర్తిగా పాడయ్యాయి. ఇటీవల ఐడీసీ అధికారులు నిర్వహించిన సర్వేలో ఈ పథకాలన్నీ మరమ్మతులు చేయించాలంటే వంద కోట్ల వరకూ అవసరం ఉంటుందని అంచనా వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. నిధుల కోసం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఇప్పటికే పలు మార్లు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తులు చేశారు. ఈ నేపథ్యంలో నందిగామ పర్యటనకు సీఎం చంద్రబాబు వస్తున్నారని తెలిసి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాలకు నిధులు ఇచ్చి ఆదుకుంటారని ఆశిస్తున్నారు.

### సుబాబుల్ రైతులకు చేయూత అవసరం

నందిగామ నియోజకవర్గంలో యాభైశాతానికిపైగా రైతులు సుబాబుల్ సాగు చేస్తున్నారు. పేపర్ కంపెనీలు, దళారులు దశాబ్దాలుగా రైతులను దోచుకుంటున్నారు. ఇటీవల విస్తీర్ణం తగ్గడంతో కంపెనీలు ధర పెంచాయి. ఖర్చులు పోను ఏడు వేల రూపాయలు రైతులకు అందాయి. ఆశించిన ధర వస్తుండటంతో రైతులు తిరిగి సాగు ప్రారంభించారు. విస్తీర్ణం పెరగడంతో కంపెనీలు ధర తగ్గించాయి. కేవలం 4,500 మాత్రమే ఇస్తున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. ధర స్థిరీకరణతో పాటు గత టీడీపీ హయాంలో ప్రకాశం జిల్లాలో నిర్మించ తలపెట్టిన ఏషియన్ పేపర్ మిల్లు నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# కుమ్మేసిన వాన

(5వ పేజీ తరువాయి)

ధాన్యం కొంతమేర తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలు లేకపోవడంతో చాలావరకు కల్లాల్లోనే ఉంచాల్సి వచ్చింది. రూరల్ మండలంలో ఆరబెట్టిన 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసి ముద్దయింది. జి.కొండూరు మండలంలో మిర్చి రైతులకు స్వల్ప నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల మిర్చి కల్లాల్లో తడిసిపోయింది. కొన్నిచోట్ల రైతులు పట్టాలు కప్పుకుని పంటను కాపాడుకోగలిగారు. రెండేళ్ల నుంచి గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న మిర్చి రైతులకు అకాల వర్షం నష్టాన్ని మిగిల్చింది. రూరల్ మండలంలోని పలు గ్రామాలను ఆనుకుని ఉన్న పశ్చిమ బైపాస్‌పై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఈ ధాన్యమంతా పూర్తిగా తడిపోయింది. ఎండాకాలం కావడంతో వర్షం వస్తుందని భావించని రైతులు బైపాస్‌పై పోసి ఆరబెట్టుకుంటున్న పంట వర్షంపాలు కావడంతో శుక్రవారం ఉదయం ధాన్యాన్ని చూసి కంటతడిపెట్టారు. చేసేదేమి లేక తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టుకుంటున్నారు. మైలవరం మండలంలో బాడవ టోలుప్లాజా వద్ద, చంద్రగూడెం సమీపంలో జాతీయ రహదారి పై రైతులు మొక్కజొన్నలు నిల్వ చేశారు. మొక్కజొన్నల పై రైతులు పట్టాలు కప్పి ఉంచడంతో ఎటువంటి నష్టం జరగలేదు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 145,154, 165 |
| చికెన్ విత్ స్కిన్ | 280 |
| చికెన్ స్కిన్‌లెస్ | 290 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450



### కాళీమాతకు గులాబీలతో పుష్పార్చన

కృష్ణలంక:వసంత నవరాత్రుల ఆరవ రోజైన శుక్రవారం త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారి ఉత్సవ మూర్తులకు వేదపండితులు గులాబీపూలతో పుష్పార్చన చేశారు. కాళీమాతను లక్ష్మీదేవిగా అలంకరించారు. శ్రీ మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ దంపతులు ఇచ్చిన పట్టుచీరతో పండితులు కాళీమాతను లక్ష్మీదేవిగా అలంకరించారు.



అకాల వర్షంతో నాల్గో డివిజన్‌లో

## లోతట్టు ప్రాంతాలు జలమయం





గురునానక్ కాలనీ మెయిన్‌రోడ్డులో , గమేళా బజార్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

భారతీనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కురిసిన అకాల వర్షానికి నాల్గో డివిజన్లలోని పలు ప్రధాన రహదారుల అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా నాల్గవ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన ఏపీఐఐసీ కాలనీ సమీపంలోనిగమేళా బజార్ రోడ్డు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు, భారతీనగర్ మెయిన్‌రోడ్డు, పలు కాలనీ అంతర్గత రోడ్లు వర్షపు నీటికి జలమయమయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

# పారిశుధ్యం అధ్వానం

- చెత్తా చెదారంతో నిండిన డ్రెయినేజీలు
- చినుకు పడితే రోడ్డుపైనే మురుగు
- ఆటోనగర్‌వాసుల ఆందోళన

ఆటోనగర్,ఆంధ్రజ్యోతి: పారిశ్రామికవాడలో చినుకు పడితే చాలు బురద చేరి చిత్తడిగా మారిపోతుంది. ఆటోనగర్ పారిశుధ్యం అధ్వానంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. చిన్నపాటి వర్షానికే రహదారిపై మురుగునీరు పొంగి పొర్లుతున్నాయని, సైడ్ డ్రెయినేజీలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో వర్షం నీరు పారే అవకాశం లేకుండా పోయిందంటున్నారు. వర్షం నీటితోపాటు మురుగునీరు రహదారిపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన చెందుతున్నారు.. ఆటోనగర్‌లోని కాటా రోడ్డు, ఫైర్ స్టేషన్ రోడ్డు వద్ద తేలికపాటి వర్షానికే నీరు రహదారిపైకి వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సైడ్ డ్రెయినేజీలో చెత్త చెదారం చేరి నీరు నిలుస్తున్నాయని చెబుతున్నారు. నెల నెలా ఐలాకు పన్నులు చెల్లిస్తున్నా పారిశుధ్యాన్ని పట్టించుకోవడం లేదని ఆటోనగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. పారిశ్రామికవాడలో సౌకర్యాలు పెంపొందించాలని కోరుతున్నారు.



ఫైర్‌స్టేషన్ రోడ్డులో మురుగునీరు



కాటా రోడ్డు వద్ద సైడ్ డ్రెయిన్‌లో పేరుకున్న చెత్తా చెదారం



ఫైర్ స్టేషన్ రోడ్డులో మురుగునీటితో నిండిన సైడ్ డ్రెయిన్

## పేదలకు అందుబాటులోకి కమ్యూనిటీ హాల్

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వివరాలతో బోర్డు

పటమట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): 11వ డివిజన్ తంగెళ్లమూడి వారి వీధిలో శ్రీ కనకమేడల రవీంద్రకుమార్ కమ్యూనిటీ హాల్‌ను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏప్రిల్ 2న ఆంధ్రజ్యోతిలో నిరుపయోగంగా కమ్యూనిటీ హాల్ అనే శీర్షికన కథనం ప్రచురిత కావడంతో అధికారులు స్పందించి దాన్ని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకుచ్చారు. కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన అద్దె, సెల్‌ఫోన్ నంబర్లతో వివరాలతో బోర్డు ఏర్పాటు చేశారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భరత్ గుప్తా

### రాష్ట్రస్థాయి కామర్స్ కాన్‌క్లేవ్ నేడు

బ్రోచర్ ఆవిష్కరణ

గుణదల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కామర్స్ కాన్‌క్లేవ్ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.భరత్ గుప్తా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్‌క్లేవ్ ముఖ్య ఉద్దేశం ఎన్ఈపీ - 2020కి అనుగుణంగా బీకామ్ విద్య పాఠ్యాంశాలను రూపుదిద్దడం అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ప్రోగ్రామ్ కన్వీనర్ సీహెచ్ కొండలరావు, కామర్స్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

- రంగులు, విద్యుత్ అలంకరణ, చలువపందిరితో ఏర్పాట్లు పూర్తి
- తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు - ఆలయ కమిటీ

రాణిగారితోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోటలోని రామాలయంలో రాములోరి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిరి, నూతనంగా రంగులు, విద్యుత్ అలంకరణ తదితర ఏర్పాట్లతో ఆలయం పండుగ శోభ సంతరించుకుంది. 40సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయం ఈ ప్రాంత వాసులకు ఎంతో ఇష్టమైన ఆలయం. ఈ నెల 6న శ్రీరామనవమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి కల్యాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గత నెల 31 మంచి రోజు కావడంతో ఆలయ ప్రాంగణలో స్వామి సన్నిధిలో పసుపు కొట్టడంతో కల్యాణానికి శ్రీకారం చుట్టామని, అప్పటి నుంచి ఆలయంలో పెళ్లి ఏర్పాట్లు ప్రారంభించి శుక్రవారం నాటికి పనులను పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 6న ఉదయం 11.52 నిమిషాలకు సీతారామ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభంగా నిర్వహిసున్నామని, తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు పలు సేవలతో స్వామి వారి నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానించామని తెలిపారు.





విద్యుత్ అలంకరణతో ఆలయం, రంగులు వేస్తున్న కార్మికులు



**అందరూ ఆహ్వానితులే : కమిటీ అధ్యక్షురాలు రాయి రంగమ్మ**

రాములోరి కల్యాణానికి అందరూ ఆహ్వానితులేనని, ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నాం. ఉత్సవాల్లో భాగంగా 13న అన్నసంతర్పణ నిర్వహించడంతో పాటు 14న చివరిరోజు సాయంత్రం స్వామి వారి ఊరేగింపు, అనంతరం పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.





అప్పుడు, ఇప్పుడు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం

### జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మెరుగులు

- గద్దెకు విగ్రహ కమిటీ ధన్యవాదాలు

మొగల్రాజపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు జంక్షన్‌లో ఉన్న ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ అధికారులు శుక్రవారం మరమ్మతులు పూర్తి చేశారు. ఫిబ్రవరి 6న జగ్జీవన్‌రాం విగ్రహ కమిటీ సభ్యులు ఎం.పరమేశ్వర రావు, పొలిమెట్ల విజయ్‌కుమార్, 8వ డివిజన్ టీడీపీ ప్రధానకార్యదర్శి మల్లెల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. 1994లో ఆవిష్కరించిన ఈ విగ్రహం తరువాత నిర్వహణ లేకపాడైనట్లు పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే గద్దె విగ్రహం మరమ్మతులు చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు పనులు పూర్తయ్యాయి. విగ్రహ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

**ప్రకటన**

మా క్లయింటు కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, నందమూరు గ్రామ కాపురస్తులు బొల్లిగర్ల ప్రసాద్ గారి కుమారుడు నవీన్ కుమార్ మాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారము యావన్మందికి తెలియచేయునది ఏమనగా:

మా క్లయింటు యీ దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తి కొనుగోలు చేయుటకు ప్రస్తుతం హైదరాబాదు సిటీ తుమ్మలూరు కాపురస్తులు ఉప్పలపాటి హేమంత్ గారి భార్య కావ్య మరియు పిన్నమనేని పేర్నీడు గారి కుమార్తు సతీష్ గార్ల వద్ద నుండి తన పేరగాని వారి కుటుంబ సభ్యుల లేదా ఏజంట్ పేరగాని దస్తావేజు పొందు ఉద్దేశ్యముతో విక్రయ ఎగ్రిమెంటు చేసుకొని వున్నారు. సదరు ఆస్తిని గురించి ఎవరికైనా, ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి వారం రోజులలోపు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసినిదిగా కోరబడుచున్నారు. లేని యెడల సదరు ఆస్తి నిష్పేచి ఆస్తిగా ఎంచుకొని జరుగు దర్శిలా గ్రంథమును బైండు చేయజాలవని తెలియచేయడమైనది.

**షెడ్యూలు:** కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రీలో చేరి వున్న ఉంగుటూరు మండలం, మధిరపాడు గ్రామ పంచాయతీ మధిరపాడు గ్రామ రీసర్వే నెం. 43/2 లోని యల్.పి. నెం. 295 లో భాగమైన య.4.04ట్లు స్థిరాస్తి శేరీపల్లం భూమికి **హద్దులు:** తూర్పు : రోడ్డు, దక్షిణం : మల్లెల కన్నయ్య, పాలడుగు కావ్య, పాలడుగు కోటేశ్వరరావు, పాలడుగు రాంబాబు గార్ల భూములు, పడమర : చలసాని శ్రీరామారావు, మారిశెట్టి కనకదుర్గ గారి భూమి, ఉత్తరం : చలసాని శ్రీరామారావు, అనగాని సంపూర్ణ గార్ల భూమి.

గుడివాడ (జి.యల్.యన్.వి.అప్పాజి)
ది. 4-4-2025 (జి.యస్.ఆర్. అరవింద్)
న్యాయవాదులు
చిరునామా
డోర్ నెం. 16/134, శ్రీ లలితా నిలయము,
సత్యనారాయణపురం, గుడివాడ-521301
సెల్ : 98491 84283

## ప్రజలకు పథకాలు అందించే బాధ్యత సారథులదే

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గత వైపీసీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకుంటూనే అలాంటి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రజలను కాపాడుకుంటూ సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. శుక్రవారం అశోక్ నగర్ పార్టీ కార్యాలయంలో కుటుంబ సాధికార సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథుల ప్రతి 30 మంది ఓటర్లకు బాధ్యులుగా ఉంటారని, వారికి అవసరమైన అన్ని ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత సారథులదే అన్నారు. ఇప్పటికే తూర్పులో 60 శాతం సారథుల నియామకం పూర్తయ్యిందని, మిగిలిన 40 శాతం త్వరగా పూర్తి చేయాలన్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు, సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిపారు. వారంలో ఒక రోజు సారథుల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, సీహెచ్ క్రాంతిశ్రీ, ఆర్.రమేష్, పి.సతీష్‌చంద్ర, టి.బాబురావు, కె.రాజేష్, గాబ్రియేలు, ఎన్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్



### వెయిటేజ్ మార్కుల కోసం వ్యాయామ టీచర్ల ధర్నా 7న

గాంధీనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయులకు 2025మెగా డీఎస్సీలో ఈవెంట్స్‌కు వెయిటేజ్ మార్కులు కలపాలని డిమాండ్ చేస్తూ 7న ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్టు నిరుద్యోగ సాధన సమితి (ఏఐవైఎఫ్ అనుబంధం)రాష్ట్ర కన్వీనర్ లంకా గోవిందరాజులు తెలిపారు. హనుమాన్ పేటలోని దాసరిభవన్‌లో శుక్రవారం ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ క్రీడలపై ఎటువంటి అవగాహన లేకుండా క్రీడాకారులు కానీవారు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందేందుకు కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. నిజమైన క్రీడాకారులకు అర్హత కలిగించే ఈవెంట్స్‌కు మార్కులు కల్పించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు కె.కార్తీక్, నిరుద్యోగ సాధన సమితి నగర నాయకురాలు షైనీ పాల్గొన్నారు.



ఆటోనగర్ బస్‌స్టేషన్ సమీపంలో ధర్మశాస్త్ర సేవా సంస్థ సౌజన్యంతో చలివేంద్రాన్ని ఆటోనగర్ డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలింగ్ ఫ్రిడ్జ్‌ని ధర్మశాస్త్ర సేవా సంస్థ అధ్యక్షుడు కె వేణుగోపాల్ గురుస్వామి అందించారని తెలిపారు. ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీదేవి, ప్రసాద్, ఏడీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు. - ఆటోనగర్



## పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై అధికారుల ఉక్కుపాదం

కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు దళారులను పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు పట్టుకొని వారిపై కేసులు నమోదు చేశారు. 'పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఏప్రిల్ ఒకటిన ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించి నిఘా పెట్టారు. కృష్ణలంక రామాలయం వీధిలో షాపు నెం.310 నుంచి పీడీఎస్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేసేందుకు వెళ్తున్న ఎండీయూ వాహనాన్ని అధికారులు అనుసరించారు. ఎండీయూ హెల్పర్ పి.రూప్‌శంకర్ వాహనాన్ని రణదీవెనగర్‌లోని పీడీఎస్ బియ్యం నిల్వ చేసే ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. అతనిని అనుసరిస్తున్న అధికారులు దాడి చేసి గోడౌన్‌లో, వాహనంలో వున్న 160 సంచుల పీడీఎస్ (50 కిలోల) బియ్యాన్ని పట్టుకొన్నారు. రామలింగేశ్వరనగర్‌లో ఎ.చిన్నారి అనే దళారి నుంచి 4.35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. పట్టుకొన్న రేషన్ బియ్యాన్ని గొల్లపూడిలోని సివిల్ సప్లైస్ గోడౌన్‌కు తరలించి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో విజిలెన్స్ సీఐ ఉమర్, ఏఎస్‌వో శ్రీనివాసులు, ఆర్ఐ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం స్వాధీనం, ఇద్దరిపై కేసు నమోదు



ఇద్దరు దళారులను పట్టుకున్న విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ఉండాలి




వన్‌టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులకు చిన్నతనంలోనే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, అందులో భాగంగా వివిధ వ్యాసరచన, వక్తృత్వ, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించినట్లు వీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన తెలిపారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వీటిపై చిన్న పిల్లలకు చైతన్యపరచవలసిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉందన్నారు. వీఎంసీ అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు అధికారులు బహుమతులను అందచేసి అభినందించారు. న్యాయ నిర్ణేతగా డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రవాణా ఆటో, ట్యాక్సీ కార్మికులకు సంక్షేమ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని ది.విజయా ట్యాక్సీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. యూనియన్ జనరల్ బాడీ సమావేశం గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా వీరి సమస్యలు పరిష్కారం కావడంలేదని విమర్శించారు. ఇన్సూరెన్స్, పీఎఫ్, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు వీరికి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి అబ్దుల్ కుదూస్ నివేదికను ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. వజ్జే పద్మలత యూనియన్ గౌరవాధ్యక్షురాలిగా, శంకర్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### క్యాబ్ డ్రైవర్ల పోరాటానికి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ మద్దతు

సత్యనారాయణపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, విజయవాడలో ఓలా, ఉబర్ సర్వీసులను నిలిపి వేస్తూ పోరుబాట పట్టిన క్యాబ్ డ్రైవర్లకు ఆలిండియా రోడ్‌ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్)రాష్ట్రకోశాధికారి కె.దుర్గారావు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ సంపూర్ణ మద్దతు తెలిపారు. దుర్గాపురం సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్లను ప్రైవేటు సంస్థలు నిలువుగా దోచుకుంటున్నారన్నారు. తక్షణమే సమస్య పరిష్కార దిశగా ఓలా, ఉబర్ సంస్థలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ కోశాధికారి కె.దుర్గారావు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ ఆటోవర్కర్స్‌యూనిన్ ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ బిల్లు వల్ల ముస్లింలకు నష్టం లేదు

వన్‌టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు సవరణ చట్టం ఆమోదించినందుకు ఎన్డీయే ప్రభుత్వానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఫిరోజ్, మైనార్టీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎస్.కె.ఫైజాన్ ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో కాంగ్రెస్, వైసీపీ పార్టీలు ముస్లింలను ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని ముస్లిం సమాజాన్ని కోరారు. వక్ఫ్‌బిల్లు వల్ల ముస్లిం సమాజానికి ఎటువంటి నష్టం జరగదని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు పట్టించుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అఫ్సర్, ఎండీ హాఫీజ్, రహిమాన్, పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేసిన క్రెడాయ్ కార్యవర్గ సభ్యులు

## క్రెడాయ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : క్రెడాయ్ నూతన కార్యవర్గసభ్యులు గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణమండపంలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇన్స్టలేషన్ ఆఫీసర్ ఎ.నాగమల్లేశ్వరరావు ఆఫీసు బేరర్లతో ప్రమాణస్వీకారం చేయించారు.

క్రెడాయ్ ఏపీ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు బాయన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు, కోశాధికారి కె.గోపీనాథ్, పూర్వ అధ్యక్షుడు వై.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు. క్రెడాయ్ విజయవాడ చాప్టర్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన జి.రామ్మోహనరావు మాట్లాడుతూ క్రెడాయ్ విజయవాడకు అధ్యక్షుడిగా పనిచేసే అవకాశాన్ని ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. క్రెడాయ్ విజయవాడ సభ్యుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడానికి, క్రెడాయ్ నేషనల్, క్రెడాయ్ ఏపీతో కలిసి పనిచేస్తామన్నారు. యూత్ వింగ్, విమెన్స్ వింగ్, అందరి సభ్యుల సహకారంతో క్రెడాయ్ విజయవాడ చాప్టర్‌కు మరింత మంచి పేరు తేవడానికి కృషి చేస్తామన్నారు.

# తీరప్రాంత రక్షణ ప్రశ్నార్థకం!

● గిలకలదిండి మెరైన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ● పెరిగిన పనిభారం ● మూలనపడ్డ గస్తీ బోట్లు

సముద్రం మీదుగా తీవ్రవాదులు, విదేశీ చొరబాటుదారులు దేశంలోకి రాకుండా తీరంలో ఎంతో కీలకంగా వ్యవహరించే మెరైన్ పోలీస్ వ్యవస్థ సమస్యలతో సతమతవుతోంది. గిలకలదిండి పోలీస్‌స్టేషన్‌లో తగినంత మంది సిబ్బంది లేరు. గస్తీ బోట్లు మూలనపడ్డాయి. నిరంతరం గస్తీ తిరిగే మెరైన్ పోలీసులకు పని భారం ఎక్కువయింది. మెరైన్ పోలీసు స్టేషన్‌కు సమస్యలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి.



గిలకలదిండిలోని మెరైన్ పోలీస్ స్టేషన్


మరమ్మతులకు గురైన మెరైన్ గస్తీ బోట్లు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్) : గిలకలదిండిలోని మెరైన్ పోలీసుస్టేషన్‌లో గతంలో 43 మంది కానిస్టేబుళ్లు ఉండేవారు. ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. ఆరుగురు హెడ్ కానిస్టేబుల్స్‌కు ముగ్గురే ఉన్నారు. ముగ్గురు ఏఎస్సైలకు ఒకరే ఉన్నారు. గిలకలదిండితో పాటు మంగినపూడి బీచ్‌ను మెరైన్ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు ఉన్నారు. మంగినపూడి బీచ్‌లో ఇటీవల పర్యాటకుల సంఖ్య పెరగడంతో బీచ్ వద్దే ఎక్కువ మెరైన్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.

గిలకలదిండి హార్బర్‌లో ఉండే మెరైన్ పోలీసు స్టేషన్ హార్బర్ నుంచి సముద్ర తీరంలో గస్తీ తిరిగేందుకు గతంలో మూడు మెరైన్ బోట్లను వినియోగించేవారు. ఆరేళ్లుగా మెరైన్ బోట్లు మూలనపడ్డాయి. మరమ్మతులు చేయడం లేదు. డ్రైవర్లను పంపిం చేశారు. బోట్లు తుప్పు పడుతున్నాయి. బోట్లు మూలనపడటంతో సముద్ర తీరంలో గస్తీ లేకుండా పోయింది. గిలకలదిండి హార్బర్ వద్ద అభివృద్ధి పనులు పెద్ద స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హార్బర్‌ను పర్యవేక్షించేందుకు తగినంత పోలీసు బలగాలు లేవు.

గిరిపురంలో రిడ్లే తాబేలు సంరక్షణ కేంద్రాన్ని పర్యవేక్షించే బాధ్యత కూడా మెరైన్ పోలీసులకు అప్పగించారు. తాబేలు జాతి అంతరించపోకుం డా గిరిపురంలోని తాబేలు సంరక్షణ కేంద్రానికి అటవీశాఖతో పాటు మెరైన్ పోలీసులు సేవలందిస్తున్నారు. 2018 నుంచి పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో సముద్ర తీరాన్ని కాపలా కాసే మెరైన్ పోలీసు స్టేషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వంశీ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 7కు వాయిదా

గన్నవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయి ల్ పిటిషన్ తీర్పును 7వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. తేలప్రోలుకు చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతు వంశీ తరఫున న్యాయవాది పిటిషన్ వేశారు. దీనిపై ఇరుపక్షాల వా దనలు జరిగాయి. వంశీని మరోసారి ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఆత్కూరు పోలీసులు గన్నవరం కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. పోలీస్ కస్టడీకి అవసరం లేదని వంశీ న్యాయవాది, మ రింత సమాచారం రాబట్టాల్సి ఉందని ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు. దీనిపై కూడా తీర్పును 7వ తేదీకి న్యాయధికారి వాయిదా వేసినట్లు పోలీసులు తెలిపారు.

## రంగా పీటీ వారెంట్‌పై తీర్పు రిజర్వు

విజయవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ముదునూరి సత్య వర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో ఐదో నిందితుడిగా ఉన్న ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగా పీటీ వారంట్‌పై విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్యాణి వాదనలు వినిపించారు. అనంతరం ఈనెల ఏడో తేదీన తీర్పును వెలువరిస్తామని న్యాయా ధికారి హిమబిందు వెల్లడించారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వంశీతోపాటు మరో నలుగురు అరెస్టయి రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేయడంలో స్కెచ్‌ను రూపొందించిన రంగాను కోర్టులో హాజరుపరచడానికి పటమట పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గన్నవరంలోని పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో రంగా ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కొద్దిరోజుల క్రితం సీఐడీ పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

# వణికించిన అకాల వర్షం

● ఆందోళనలో అన్నదాత
● మిర్చి రైతుకు స్వల్ప నష్టం


పట్టాలపై నిలిచిన నీటిని బయటకు పంపుతున్న మిర్చి రైతులు

జి.కొండూరు / ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం మిర్చి రైతు లకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం పడటంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. గురువారం పగలే కొందరు రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంటపై పట్టాలు కప్పి పంటను కాపాడుకున్నారు. కొందరు రైతులు పట్టాలు కప్పకపోవడంతో కొన్ని చోట్ల మిర్చి తడిచిపోయింది. వర్షం పెద్దగా నష్టం చేయకపోయినా మిర్చి రైతులు మాత్రం ఆందోళన చెందారు. ఈదురు గాలులు ఎక్కువైతే మాత్రం కాయలపై కప్పిన పట్టాలు సైతం ఎగిరిపోయి మరిన్ని కాయలు తడిసేవని వాపోయారు. రెడ్డిగూడెం మండలంలో గురువారం రాత్రి వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. నాగులూరు, పాతనాగులూరులో ధాన్యం రాశులపై పరదాలు కప్పి రైతులు జాగ్రత్త చేసుకునేందుకు నానా పాట్లు పడ్డారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు తదితర గ్రామాల్లో కోత కోసి ఆరబెట్టిన ధాన్యంపై రైతులు పట్టాలు కప్పి పంటలు కాపాడుకోగలిగారు. ధాన్యం తక్షణం కొనుగోలు చేయాలని, తేమ శాతం అడ్డుపెట్టి తక్కువ ధరకు అడుగుతున్నారని ఈలప్రోలు గ్రామానికి చెదిన వల్లూరు కిషోర్ కుమార్ అనే రైతు వాపోయాడు.

### ప్రభుత్వం ఆదుకోవాలి



అసలే మిర్చికి ధర లేక ఇబ్బందులు పడుతున్నాం. అకాల వర్షం పంటను తడిపేసింది. గత రెండేళ్లుగా వరుస నష్టాలతో అల్లాడుతున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి మిర్చిని కొనుగోలు చేయాలి.
- కొండ్రు బాబు, జి.కొండూరు

# తారాస్థాయికి సీఎస్ఐ చర్చి వివాదం

● కొత్తూరు తాడేపల్లిలో కొట్టుకున్న కమిటీ నాయకులు

విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి సీఎస్ చర్చి వివాదాలు తారాస్థాయికి చేరాయి. రెండు వర్గాలుగా విడిపోయిన చర్చి కమిటీ నాయకులు ఒకరిపై ఒకరు గురువారం రాత్రి దాడులుచేసుకున్నారు. ఇరువర్గాలు దూషించుకుంటూ కొట్లాటకు దిగడంతో పలువురికి గాయాలయ్యాయి.


కొట్లాటలో గాయపడిన వారు

(ఆంధ్రజ్యోతి - చిట్టినగర్)

కొత్తూరు తాడేపల్లి సీఎస్ఐ చర్చి కమిటీ ప్రతి ఏటా చందాలు వసూలు చేసి క్రిస్మస్, నూతన సంవత్సర వేడుక ఘనంగా చేస్తారు. తరువాత లెక్కలు అప్పజెప్పి ఆ కమిటీ దిగిపోతే కొత్త కమిటీని ఎన్నుకుంటారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం మార్చి 17న లెక్కలు అప్పజెప్పి పాత కమిటీ దిగిపోయింది. కొత్త కమిటీ సమావేశం ఏప్రిల్ 3వ తేదీ రాత్రి నిర్వహించేందుకు చర్చి పెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో కమిటీకి సంబంధించిన రెండు వర్గాలు గొడవకు దిగాయి. ఒక వర్గం చర్చికి తాళం వేయగా, మరొవర్గం ఎందుకు తాళం వేశారని ప్రశ్నించడంతో వివాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గొడవలో గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. శుక్రవారం ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మూడో తేదీ రాత్రి 8 గంటలకు భోజనం చేసిన తరువాత సీఎస్ఐ చర్చిలో సమావేశం ఉందని చెప్పగా అన్నయ్య కె.సువర్ణరాజు, గొడవర్తి స్వామితో కలసి చర్చి వద్దకు కె.సుందరబాబు వెళ్లాడు. చర్చికి తాళం వేసి ఉండటంతో ప్రశ్నించగా దొండపాటి వంశీ, కిషోర్, కళ్యాణ్, రాంబాబు, శేఖర్, చిన్నబ్బాయి, ఎల్.కళ్యాణ్, సురేష్ మరికొందరు దూషించి, దాడి చేశారని తనతోపాటు అన్నయ్య సువర్ణరాజు, అడ్డువచ్చిన కుమార్తె రోజాకు తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు సుందరబాబు ఫిర్యాదు చేశాడు, చర్చి సమావేశానికి వెళ్ళిన తమను సువర్ణరాజు, స్వామి, రమేష్ మరికొందరు అసభ్యపదజాలాలతో దూషించి దాడులకు పాల్పడ్డారని మానికొండ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఎన్టీఆర్ జిల్లాలో నిషేధాజ్ఞలు అమలు : సీపీ

గుణదల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ. రాజశేఖర్ బాబు తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు సెక్షన్ భారతీయ నాగరిక సురక్ష సహిత-2023 కింద నిషేదాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజా జీవనానికి ఇబ్బంది లేకుండా శాంతి భద్రతలకు విఘా తం కల్గకుండా ఉండాలన్న ఆలోచనతో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

## ఎస్ఆర్ఎం విద్యార్థిని సయ్యద్ హఫ్సాకు అవార్డు



వన్‌టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్ఎం యూనివర్శిటీ రెండో సంవత్సరం పీహెచ్‌డీ విద్యార్థిని సయ్యద్ హఫ్సా బిట్స్ పిలానీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎవిడెన్స్ బేసిక్ మేనేజ్‌మెంట్ - 2025 అంశంలో ఉత్తమ అవార్డు అందుకుంది. ఈ ఏడాది మార్చి 21వ తేదీన ఆమె బియాండ్ ది డెస్క్ ఫ్యూయలింగ్ డిజిటల్ ఇ న్నోవేషన్ త్రూ వర్క్ ప్లేస్ ఫ్లెక్సిబిలిటీ అంశంపై పత్రాన్ని సమర్పించగా అవార్డును ప్రదానం చేశారు. యూనివర్శిటీ డీన్ (ఆంధ్రప్రదేశ్) డాక్టర్ జమాన్ ఇక్బాల్ ఆమెను అభినందించారు హఫ్సా భర్త ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. హ ఫ్సా అవార్డు అందుకున్నందుకు ఆమె భర్త షేక్ సలీం, సోదరుడు చిత్తూరు జిల్లా నగరి డీఎస్పీ అహ్మద్ అజీజ్ అభినందించారు.

## గొల్లపూడిలో కామన్‌సైట్ ఆక్రమణదారులపై చర్యలు శూన్యం

గొల్లపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గొల్లపూడిలో కామన్ సైట్ ఆక్రమించి దర్జాగా గ్రూప్ హౌస్ నిర్మాణం చేపట్టిన సాయితేజ రెసిడెన్సీ భవన నిర్మాణం చేపట్టిన వారిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. సాయిపురం కాలనీలో సాయితేజ రెసిడెన్సీ నిర్మించిన నిర్వాహకుడు పట్టా పొందిన 400 గజాలతో పాటు పక్కనే ఉన్న పంచాయతీ కామన్ సైట్ 80 సెంట్ల స్థలంలో నుంచి 200 గజాల స్థలాన్ని కలుపుకొని ప్రహరీ నిర్మించాడు. గేట్లు పెట్టి పొడవుగా షెడ్ల నిర్మాణం చేపట్టాడు. దీనిపై పలుమార్లు పంచాయతీకి ఫిర్యాదులు అందినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఆక్రమించిన 200 గజాల స్థలాన్ని పంచాయతీ స్వాధీనం చేసుకోకుం డా నోటీస్ ఇచ్చి చేతులు దులుపుకుంది. పంచాయతీ కార్యదర్శి స్వరూపరాణిని వివరణ కోరగా, ఆక్రమణదారునికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# రాజధానిలో కాంట్రాక్టు సంస్థల సన్నాహాలు

రాజధాని నిర్మాణ పనులకు సామాగ్రి తరలి వస్తోంది. అమరావతిలో ఎటు చూసి నా నిర్మాణ సామగ్రి మెటీరియల్ దిగుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థలు తాము దక్కించుకున్న ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ఒక్కొక్కటిగా క్షేత్ర స్థాయిలో పనులు ముమ్మరం చేశాయి. ఎక్కవేటర్లు, ప్రొక్లెయిన్లను తీసుకొచ్చి, కార్మికులు ఉండటానికి వీలుగా తాత్కాలిక షెల్టర్లు, మరుగుదొడ్లు నిర్మాణ పనులు చేపడుతున్నారు.


నిర్మాణ పనులు చేపట్టేందుకు మెటీరియల్‌ను దించుతున్న కాంట్రాక్టు సంస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రాజధానిలో ప్రస్తుతం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ఆర్కిటెక్చర్ ఎలివేషన్ పనులు, లోపల ఇంటీరియర్ ఫినిషింగ్ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా హ్యాపీనెస్ట్ పనులు ప్రారంభించేందుకు వీలుగా ఎన్‌సీసీ క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చేసుకుంటోంది. నేలపాడులో తమకు కేటాయించిన స్థలంలో జీ+18 విధానంలో 12 టవర్లతో కూడిన మొత్తం 1200 అపార్ట్‌మెంట్ యూనిట్స్ ఏర్పాటుకు పెగ్‌మార్కింగ్ పనులు చేపడుతోంది. మంత్రులు, జడ్జిల బంగళాల నిర్మాణ పనులు దక్కించుకున్న బీఎస్ఆర్ ఇన్ఫ్రా రంగంలోకి దిగింది. మెటీరి యల్‌ను దించింది. ఇంజనీరింగ్ సిబ్బంది, పైస్థాయి ఉద్యోగుల కోసం భారీ షెడ్ పనులను కాంట్రాక్టు సంస్థ పూర్తి చేసింది. పక్షం రోజులలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనుంది. ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీల భవన సముదాయాల ఇంటీరియర్ ఫినిషింగ్ పనులను కొంత మంది సిబ్బందితో పనిచేయిస్తున్నారు. ఇక్కడ కూడా ఇంజనీరింగ్ ఉద్యోగులు, కార్మికుల కోసం షెల్టర్ల పనులు సాగిస్తున్నారు. భవన నిర్మాణ పనులకు సంబంధించిన కాంట్రాక్టు సంస్థలు పని ప్రదేశాలలో బోర్లు, షెల్టర్స్ కోసం తాత్కాలిక పిల్లర్ల నిర్మాణ పనులు చేపడుతున్నాయి. నిర్మాణ ప్రాంతాలలో నీటి అవసరాలతో పాటు, కార్మికులకు మంచినీరు, ఇతర అవసరాల కోసం బోర్లను వేయిస్తున్నాయి. ఎల్‌పీఎస్ జోన్లలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి కాంట్రాక్టు సంస్థలు ఇంకా రంగంలోకిదిగలేదు. అతి త్వరలోనే అవి కూడా రంగంలోకి దిగే అవకాశం ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎన్జీవో అఖిల భారత సర్వీసు అధికారుల భవనాల పనులకు ఇంకా శ్రీకారం చుట్టాల్సి ఉంది.


ఆర్యవైశ్య సమ్మేళనంలో ఎంపీ శివనాథ్, డూండీ రాకేష్ తదితరుల సంఘీభావం

## టీడీపీ ప్రభుత్వంలోనే ఆర్యవైశ్యులకు భద్రత

విద్యాధరపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ఆర్యవైశ్యులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, భద్రత ఉంటుం దని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఎస్.కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ టీడీపీ ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులను చూసే తెలుసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ భారీ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులుగా పుట్టటం మనందరికీ గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్య వైశ్యులకు అండగా ఉండి న్యాయం చేస్తున్నారని తెలిపారు. డూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి చేపట్టిన తరువాత వాసవి మాత అమ్మవారి కార్యక్రమం, పొట్టిశ్రీరాములుకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించటం అదృష్టమన్నారు ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గడ్డం రవికుమార్, వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వి.వి.కె.నరసింహారావు, వాసవి సత్రం ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఇంటర్ కాలేజీల్లో పోస్టుల సర్దుబాటు

### 84 కాలేజీలకు రెగ్యులర్ జూనియర్ లెక్చరర్లు

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లతో నెట్టుకొస్తున్న 84 కాలేజీలకు ఇంటర్ విద్యామండలి రెగ్యులర్ సిబ్బందిని కేటాయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో 455 పోస్టులు మిగులు ఉన్నట్లు గుర్తించింది. వాటిలో 214 పోస్టులను కాంట్రాక్టు సిబ్బందితో పనిచేస్తున్న 84 జూనియర్ కాలేజీలకు కేటాయించింది. మరో 241 పోస్టులను సబ్జెక్టు కన్వర్షన్ చేసింది. జూన్ నాటికి పోస్టుల మార్పిడీ, బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది.

# దళిత రామం

● నాలుగు చోట్ల దళిత రామాలయాలు ● చిన్న భద్రాచలం కొటికలపూడి
● పూజారులు దళితులే ● రాములోరి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు


కొటికలపూడి గ్రామంలోని రామాలయం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

మైలవరం నియోజకవర్గంలో నాలుగు చోట్ల దళితులకు ప్రత్యేక రామాలయాలు ఉన్నాయి. వాటి నిర్వహణ, ఉత్సవాలు, రాము లోరి కల్యాణం మొత్తం దళితులే నిర్వహించడం ఆచారం. చిన్న భద్రాచలంగా కొటికలపూడికి పేరుంది. ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా దళిత రామాలయాలు స్వామి కల్యాణానికి సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

### జి.కొండూరు మండలంలో మూడు దళిత రామాలయాలు

జి.కొండూరు మండలంలోను ఆత్కూరు,హెచ్.ముత్యాలంపాడు, కవులూరు గ్రామాల్లో మూడు చోట్ల రామాలయాలు ఉన్నాయి. ఈ మూడ చోట్ల కూడా దళితులే ఆలయాలను నడుపుతుంటారు. ఆలయ పూజారులు దళితులే. పెద్ద ఆలయాల్లో మాదిరిగా అన్ని పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ.

### కొటికలపూడి ప్రాముఖ్యత ఇదే

కొటికలపూడి గ్రామాన్ని చిన్న భద్రాచలంగా పిలుస్తారు. కొటికలపూడిలో సుమారు 80 ఏళ్ల నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుపుతూ వస్తున్నారు. ఆది ఆంధ్రా లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ తరఫున అధ్యక్షుడు నంబూరి అంజనేయులు, కార్యదర్శి వెంటపల్లి పిన్నయ్య ఆధ్వర్యంలో నవమి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయానికి లంక భూములు సుమారు 40 ఎకరాల వరకు ఉన్నాయి. వాటి కౌలు ఆదాయంతో పెద్ద ఎత్తున నవమి వేడుకలు నిర్వహిస్తారు. ఆలయ నిర్వహణతో పాటు పూజారిగా దళితులే వ్యవహరిస్తుంటారు. రామ, కృష్ణ, కేశవ బృందాలతో సుమారు 300 మంది భజనతో అలరిస్తారు. కోలాటం, సాంఘిక నాటకాలతో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. పెద్ద ఎత్తున అన్నదానం చేస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి 30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతిగా రూ.10 వేలు అందించనున్నారు.


పూజల్లో దళితులు (ఫైల్)

### ఆ నాలుగు గ్రామాలకు అవినాభావ సంబంధాలు :

ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి గ్రామానికి, జి.కొండూరు మండలంలోని ఆత్కూరు, హెచ్. ముత్యాలంపాడు, కవులూరు గ్రామాలకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ నాలుగు గ్రామాలల్లో శ్రీరామనవమి చేసే వారంతా దగ్గర బంధువులే పిల్లల పెళ్లిళ్లతో నాలుగు చోట్ల బంధుత్వాలు ఏర్పడ్డాయి. నవమి వేడుకలు అత్యం త భక్తిశ్రద్ధలతో జరగడానికి కూడా ఇదో కారణం.

### రాములోరి కల్యాణం తర్వాతే పెళ్లిళ్లు!

శ్రీరామనవమి రోజు రాములోరి కల్యాణం అయిన తర్వాతే ఆయా గ్రామాల్లో ఉన్న జంటలకు పెళ్లిళ్లు చేయడం అనవాయితీగా వస్తుంది. స్వామి తలపై అక్షింతలు పడకుండా పెళ్లిళ్లు చేసుకుంటే అశుభం అని భావించి పెద్దలు పిల్లలకు స్వామి కల్యాణం అయిన తర్వాతే పెళ్లిళ్లు చేస్తుంటారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ ఉంటారు.

### శ్రీరామ నవమికి ప్రతి ఆడపిల్ల వస్తుంది



భజనకు, కోలాటానికి మా గ్రామం పెట్టింది పేరు. భజన పాటలు, కోలాట విన్యాసాలు చూడాల్సిందే. గ్రామంలోని ఆడపిల్లలు ప్రతి శ్రీరామ నవమికి తప్పనిసరిగా వస్తారు. ఇతర దేశాల్లో స్థిరపడినా, ఆర్మీలో ఉన్నా పండగకు వస్తుంటారు. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తాం.
- కె.కోటేశ్వరరావు, భజన మాస్టర్

### దళితులే పూజారులు



రామాలయానికి పూజారులు దళితులే. తొలి పూజారి రెంటపల్లి సుబ్బయ్య మా తాత. ఇప్పటికీ దళితులే పూజారిగా కొన సాగుతుంటారు. శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తూ ఉంటాం. వేల సంఖ్యలో భక్తులు వస్తారు. పెద్ద ఎత్తున అన్నదానం చేస్తారు.
- రెంటపల్లి మల్లి

## కేజీబీవీ ప్రిన్సిపాళ్ల ద్వారా దరఖాస్తులు

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవడంపై అవగాహన లేనివారు సమీప కేజీబీవీ ప్రిన్సిపల్‌ను సంప్రదించి, వారి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తు తర్వాత సందేహాలుంటే జుజుఖి.ట్వర్ఘుజుష్టః ఖుఝజీజూ.ఛిౌఝుకు మెయిల్ చేయాలని సూచించారు. 7075159996, 7075039990 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, 7-10 తరగతులు, ఇంటర్ సెకండియర్‌లో మిగిలిన సీట్లనూ భర్తీ చేస్తామని వివరించారు.

## ఆరోపణలు అర్థరహితం

● ఐనంపూడి సర్పంచ్

పామర్రు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న తనపై టీడీపీ నేత చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని ఐనంపూడి గ్రామ సర్పంచ్ బట్టు పరంజ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గ్రామానికి కేంద్రం మంజూరు చేసిన రూ20లక్షలతో అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధమౌతున్న తరుణంలో ఐనంపూడి టీడీపీ నేత అడ్డుపడుతున్నారని ఆరోపించారు. దీనిని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా దృష్టికి తీసుకెళ్లామన్నారు. తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు. ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ మా ట్లాడుతూ, వెంటనే పరంజ్యోతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు బట్టురాఘవులు పాల్గొన్నారు.



# నోరూరించే పనస రుచులు!

వంటిల్లు

**పనస తొనలను ఇష్టంగా తినని వారు ఉండరు. ఇవి వేసవి తాపాన్ని హరిస్తాయి. వడదెబ్బ నుంచి కాపాడతాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే పనసతో రుచికరమైన వంటకాలు కూడా చేసుకోవచ్చు. వాటిలో కొన్ని విభిన్న రుచులను మీకోసం అందిస్తున్నాం...**

## పనసకాయ దమ్ బిర్యానీ

### కావాల్సిన పదార్థాలు

• లేత పనసకాయ- అర కేజీ, బాస్మతీ బియ్యం- అర కేజీ, బంగాళ దుంపలు- రెండు, టమాటాలు- నాలుగు, ఉల్లిపాయలు- రెండు, పచ్చి మిర్చి- ఎనిమిది, పెరుగు- రెండు కప్పులు, పసుపు- పావు చెంచా, లవంగాలు- ఆరు, యాలకులు- రెండు, జాపత్రి- ఒక పెద్ద ముక్క, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, మరాఠీ మొగ్గ- ఒకటి, అనాస పువ్వు- ఒకటి, బిర్యానీ ఆకులు- రెండు, రాతిపువ్వు- కొద్దిగా, షాజీరా- కొద్దిగా, అల్లం వెల్లుల్లి పేస్టు- రెండున్నర చెంచాలు, నూనె- అయిదు చెంచాలు, నెయ్యి- అయిదు చెంచాలు, ఉప్పు- రెండున్నర చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, కుంకుమ పువ్వు- అర చెంచా, పుదీనా- రెండు రెమ్మలు, కొత్తిమీర- ఒక కట్ట, కారం- మూడు చెంచాలు, నిమ్మకాయ- సగం చెక్క, నీళ్లు- తగినన్ని

### తయారీ విధానం

• బాస్మతీ బియ్యాన్ని కడిగి నీళ్లు పోసి నానబెట్టాలి. ఆలుగడ్డలను పెద్ద ముక్కలుగా కోయాలి. టమాటాలను సన్నగా తరగాలి. ఉల్లిపాయలు, పచ్చి మిర్చిలను చీలికల మాదిరి కోయాలి. కొత్తిమీరను కూడా శుభ్రంగా కడిగి సన్నగా తరగాలి. కుంకుమపువ్వును రెండు చెంచాల పాలలో నానబెట్టాలి. ముప్పావు వంతు ఉల్లిపాయ చీలికలను నూనెలో ఎర్రగా వేపి ఉంచుకోవాలి.

• చేతులకు ఆముదం లేదా కొబ్బరినూనె రాసుకోవాలి. చాకుతో పనసకాయ తొక్కు తీయాలి. కాయను నీళ్లతో



కడిగి పెద్ద ముక్కలుగా కోసి గింజలు తీయాలి.

• వెడల్పాటి గిన్నెలో పనసకాయ ముక్కలు, ఆలుగడ్డ ముక్కలు, టమాటా ముక్కలు, పచ్చి మిర్చి చీలికలు, ఉల్లి పాయ చీలికలు కొన్ని, పెరుగు, రెండు చెంచాల అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, ఒకటిన్నర చెంచా ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి, పుదీనా ఆకులు, కారం, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని దగ్గరకు ఒత్తిపెట్టి రెండు గంటలు నాననివ్వాలి.

• స్టవ్ మీద పెద్ద గిన్నె పెట్టి నిండుగా నీళ్లు పోసి లవంగాలు, యాలకులు, జాపత్రి, దాల్చిన చెక్క, అనాస పువ్వు, మరాఠీ మొగ్గ, బిర్యానీ ఆకులు, రాతి పువ్వు, షాజీరా, అర చెంచా అల్లం వెల్లుల్లి పేస్టు, ఒక చెంచా నూనె, ఒక చెంచా నెయ్యి, ఒక చెంచా ఉప్పు వేసి బాగా మరగనివ్వాలి. అరగంట తరవాత ఇందులో నానబెట్టిన బాస్మతీ బియ్యం వేసి మెల్లగా కలపాలి. పెద్ద మంట మీద ఉడకనివ్వాలి.

• మరో స్టవ్ మీద మందపాటి పెద్ద గిన్నె పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె, నాలుగు చెంచాల నెయ్యి వేసి అవి వేడెక్కాక నానబెట్టిన పనసకాయ ముక్కల మిశ్రమం వేసి బాగా కలిపి మూత పెట్టి చిన్న మంట మీద మూడు నిమిషాలు మగ్గనివ్వాలి. తరవాత మూత తీసి ఈ మిశ్రమం మీద సగానికి పైగా ఉడికిన బాస్మతీ బియ్యాన్ని స్ట్రయినర్ సహాయంతో తీసుకుని ఒక పొరలా పరచాలి. దీని మీద వేయించిన ఉల్లిపాయ చీలికలు, కొత్తిమీర తరుగు చల్లి మూత పెట్టి మూడు నిమిషాలు మగ్గించాలి. తరవాత మూత తీసి ముప్పావు వంతు ఉడికిన బాస్మతీ బియ్యాన్ని పొరలా పరచాలి. దీని మీద కూడా వేయించిన ఉల్లిపాయ చీలికలు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత పూర్తిగా ఉడికిన బాస్మతీ అన్నాన్ని పైన పొరలా వేసి మరుగుతున్న నీళ్లు మూడు గంటెలు పోయాలి. దీనిపైన మరికొన్ని వేయించిన ఉల్లిపాయ చీలికలు, కొత్తిమీర తరుగు చల్లి వెంటనే కుంకుమ పువ్వు నానబెట్టిన పాలు చిలకరించాలి. మూతపెట్టి ఆవిరి బయటికి వెళ్లకుండా నీళ్లలో తడిపిన వస్త్రాన్ని కప్పి ముప్పావు గంటసేపు మగ్గించాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి మూత తీసి అక్కడక్కడా చెంచాతో రంధ్రాలు చేసి వాటిలో బిరియానీ నీళ్ల చుక్కలు, గులాబీ నీళ్ల చుక్కలు వేయాలి. అయిదు నిమిషాల తరవాత వేరే గిన్నె లోకి బోర్లించి వేడిగా సర్వ్ చేసుకోవచ్చు.

### జాగ్రత్తలు

• **బిర్యానీ వండడానికి మందంగా ఉన్న గిన్నెను మాత్రమే ఉపయోగించాలి. లేదంటే అడుగు భాగం మాడిపోతుంది.**

• **బిర్యానీని ఓ పక్కనుంచి తీస్తూ వడ్డించాలి. అప్పుడే పనసకాయ ముక్కలు, కలర్ రైస్, వైట్ రైస్ పొరలుగా కనిపిస్తాయి.**

• **పనసకాయను కోసిన తరవాత లోపలి భాగం గట్టిగా అనిపిస్తే దాన్ని తీసివేయడం మంచిది.**

## పనస తొనల హల్వా



### కావాల్సిన పదార్థాలు

• పనస తొనలు- ఒక కప్పు, బెల్లం- పావు కప్పు, నెయ్యి- రెండు చెంచాలు, పచ్చి కోవా- రెండు చెంచాలు, యాలకుల పొడి- చిటికెడు, బాదం- ఎనిమిది, జీడిపప్పు- పది, పిస్తా- పన్నెండు

### తయారీ విధానం

• గింజలు తీసేసిన పనస తొనలను మిక్సీలో వేసి మెత్తని పేస్టులా చేయాలి.

• స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అర కప్పు నీళ్లు పోసి బెల్లం వేసి కరిగించాలి. తరవాత ఈ బెల్లం నీళ్లను ఒక గిన్నెలోకి వడబోయాలి.

• స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో బాదం, జీడిపప్పు, పిస్తా వేసి దోరగా వేపి ఒక పళ్లెంలోకి తీయాలి. తరవాత పాన్‌లో పనస తొనల పేస్టు వేసి బాగా కలపాలి. పచ్చివాసన పోయేవరకూ వేగనివ్వాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం పాన్ నుంచి విడిపోతున్నప్పుడు పచ్చికోవా, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత వేయించిన బాదం, జీడిపప్పు, పిస్తా వేసి కలిపి దించాలి. ఈ హల్వాని వేడిగా లేదంటే చల్లగా కూడా సర్వ్ చేసుకోవచ్చు.

### జాగ్రత్తలు

• **ఈ హల్వాని చిన్న మంట మీదనే తయారు చేసుకోవాలి.**

• **పనస తొనలు తియ్యగానే ఉంటాయి కాబట్టి అంతగా తీపి తినని వాళ్లు ఒక చెంచా బెల్లం తగ్గించి వేసుకోవచ్చు.**

• **ఒక చెంచా కార్న్‌ఫ్లోర్‌ని పావు కప్పు నీళ్లలో కలిపి ఈ మిశ్రమాన్ని పచ్చికోవాకు బదులు వేసుకోవచ్చు.**

## పనస చిప్స్



### కావాల్సిన పదార్థాలు

• పనస తొనలు- 12, పల్లీలు- అర కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, కారం- కొద్దిగా, నూనె- తగినంత

### తయారీ విధానం

• పనస తొనల నుంచి గింజలు వేరుచేయాలి. తొనలను సన్నని చీలికల మాదిరి కోసి కొద్దిసేపు ఆరబెట్టాలి.

• స్టవ్ మీద మూకుడు పెట్టి డీప్ ఫ్రైకి కావాల్సినంత నూనె పోసి వేడి చేయాలి. ఇందులో పల్లీలు, కరివేపాకు వేసి దోరగా వేయించి గిన్నెలోకి తీయాలి. తరవాత నూనెలో చిటికెడు పసుపు, ఉప్పు వేయాలి. వెంటనే పనస చీలికలు కూడా వేసి అవి బంగారు రంగులోకి మారి గలగలలాడే వరకు వేయించి ఓ పళ్లెంలోకి తీయాలి. వీటిలో వేయించిన పల్లీలు, కరివేపాకు, ఉప్పు, కారం కలిపి సర్వ్ చేయాలి.

### జాగ్రత్తలు

• **పచ్చి పనసకాయ తొనలు తీసుకుంటే చిప్స్ రుచిగా ఉంటాయి.**

• **పల్లీలు, కరివేపాకులను జల్లి మూకుడులో వేసి వేడినూనెలో ముంచితే అవి మాడకుండా వేగుతాయి.**

---

# యవ్వనంగా కనిపించాలంటే...

మేకప్

మేకప్‌తో వయసును కొంతమేరకే కప్పిపుచ్చగలం. అందుకోసం తెలివైన మెలకువలు పాటించాలి. లేదంటే వయసు దాచలేకపోగా, వృద్ధాప్య ఛాయలు స్పష్టంగా బహిర్గతమయ్యే ప్రమాదం ఉంటుంది. మేకప్ మాటున ముడతలను దాచడం కోసం ఇవిగో ఈ చిట్కాలు ప్రయోగించండి. కనురెప్పలు, దవడలు, మెడ.. ఇలా కొన్ని చోట్ల చర్మం సాగిపోయి వృద్ధాప్య ఛాయలు బయల్పడుతూ ఉంటాయి.

ఇలాంటప్పుడు...

• **సిలికాన్ ప్రైమర్:** మేకప్‌కు ముందు సిలికాన్ ప్రైమర్ పూసుకోవాలి. దీంతో చర్మం పైని సన్నని గీతలు చర్మంలో కలిసిపోతాయి. టింటెడ్ ప్రైమర్ ఎంచుకుంటే చర్మ రంధ్రాలను కూడా దాచేయవచ్చు. ఇందుకోసం ముఖం, మెడ మీది ముదురు రంగు ప్రదేశాల్లో ప్రైమర్ పూసి, తడి స్పాంజ్‌తో అద్దుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను నేరుగా ఉపయోగించకుండా, అంతకంటే ముందు కలర్ కరెక్టర్‌ను కూడా ఉపయోగించవచ్చు.



• **మాయిశ్చరైజర్:** మెడ మీద ముడతలు ఏర్పడకుండా ఉండాలంటే, తప్పనిసరిగా మెడకూ మాయిశ్చరైజర్ పూసుకుంటూ ఉండాలి. అప్పుడే మెడ మీద గీతలు, మచ్చలు, ముడతలు ఏర్పడకుండా ఉంటాయి.

• **ఫౌండేషన్:** లిక్విడ్ లేదా క్రీమ్ ఎలాంటి ఫౌండేషన్‌ను ఎంచుకున్నా, ముఖం, మెడ మీద సమానంగా పరుచుకునేలా తడిపిన స్పాంజీతో అద్దుకోవాలి. అలాగే, ఫౌండేషన్‌ను పరిమితంగానే పూసుకోవాలి. లేదంటే ముడతల్లో ఇరుక్కుపోయి, వృద్ధాప్య ఛాయలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి.

• **బ్లష్:** చెక్కిళ్ల మీద అద్దుకునే బ్లష్‌ను కొద్ది పరిమాణంలో మెడ మీద అద్దుకోవడం వల్ల, ముఖం, మెడా రెండూ సమంగా కనిపించే అవకాశం ఉంటుంది.

• **విటమిన్ సి సీరమ్:** విటమిన్ సితో కూడిన సీరమ్ లేదా మాయిశ్చరైజర్ ఉపయోగించడం వల్ల అతినీలలోహిత కిరణాల నుంచి మెడ చర్మానికి రక్షణ దక్కుతుంది.

• **హైలైటర్:** మెడ మీద నుంచి ఇతరుల చూపులను పక్కకు తప్పించి, చెక్కిళ్ల మీద నిలపడం కోసం హైలైటర్ అద్దుకోవాలి. అయితే ఇందుకోసం లిక్విడ్ హైలైటర్‌ను ఉపయోగించాలి.

• **పౌడర్:** మెడతో పాటు ముంజేతులకు కూడా ఫౌండేషన్ అద్దుకుని, ముఖం, మెడలతో సరిపోలేలా చూసుకోవాలి. తర్వాత పౌడర్ అద్దుకుని, అదనపు పౌడర్‌ను టిష్యూ పేపర్‌తో తొలగించాలి.

---

# దివ్య ఔషధం... మునగాకు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనం ఆరోగ్యంగా ఉండటం కోసం ప్రకృతి అనేక రకాల ఔషధాలను ఆహార రూపంలో అందించింది. అలాంటి వాటిలో మునగ చెట్టు కూడా ఒకటి. ఈ చెట్టుకు కాసే మునక్కాయలను పులుసు, కూర, సాంబారు వంటి వాటిలో వాడుతూ ఉంటారు. ఈ కాయల కన్నా మునగ ఆకులకు అనేక విశిష్టతలు ఉన్నాయి. మునగాకుల్లో ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఐరన్, పొటాషియం కూడా ఎక్కువే. దీనివల్ల ప్రతి రోజూ మునగాకు తినేవారిలో రోగనిరోధకశక్తి మెండుగా ఉంటుంది. అయితే ముదురు ఆకుల కన్నా లేత ఆకులోనే పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. లేత ఆకులను ఎండబెట్టి పౌడర్‌గా చేసి కూడా వాడుకోవచ్చు. దీనివల్ల పోషక విలువలు తగ్గవు. ఈ ఆకుల గురించి 'భోజన కుతూహలం' గ్రంథంలో సవివరమైన వర్ణన ఉంది. మునగాకు లక్షణాలను గమనిస్తే...

• ఈ ఆకులు వాతాన్ని హరిస్తాయి. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయే కఫాన్ని తొలగిస్తాయి. క్రమం తప్పకుండా తింటే కఫం ఏర్పడకుండా నివారిస్తాయి.

• కీళ్ల నొప్పులను, వాపులను తగ్గిస్తుంది. కీళ్లవాతంతో బాధపడేవారికి ఇది చాలా ఉపయోగకరం.

• ఇది జీర్ణశక్తిని పెంపొందించటమే కాకుండా.. కడుపులో ఉన్న నులి పురుగులను చంపుతుంది. విరోచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది. కడుపు నొప్పి, అజీర్తి సమస్యలు ఉన్నవారు 15 రోజులు తింటే, ఆ సమస్యలు తొలగిపోతాయి.

• మునగాకులో పురుష బీజకణాలను పెంచే శక్తి ఉంది. లైంగిక పటుత్వాన్ని కూడా మెరుగుపరుస్తుంది. అందుకే మన దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రతి రోజూ మునగాకును వంటల్లో తప్పనిసరిగా వాడతారు.

• మూత్రపిండాల సమస్య ఉన్నవారికి మునగాకు మంచి ఫలితాలు ఇస్తుంది. మూత్రపిండాల పని తీరు మెరుగుపడుతుంది.

• మునగాకుతో చేసే వంటకాలు తింటే శరీరంలోని నీరు లాగేస్తుంది.

• మునగాకును తినటంవల్ల గుండె పనితీరు బాగుపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీనివల్ల గుండె పనితీరు మెరుగుపడటమే కాకుండా స్థూలకాయ నివారణ సులభమవుతుంది.



మునగాకు కేవలం మనకే కాదు... మన పర్యావరణానికి కూడా ఎంతో ఉపకరిస్తుంది. అలాంటి ప్రయోజనాలేమిటో చూద్దాం..

• మునగాకు పొడిని నీటిలో కలిపితే సూక్ష్మజీవులు నశిస్తాయి. నీరు శుభ్రం అవుతుంది.

• మునగాకును సేంద్రియ ఎరువుగా కూడా ఉపయోగించవచ్చు.

• ఈ ఆకులను పశువుల దాణాలో కలిపితే పాల ఉత్పత్తి పెరుగుతుంది. కోళ్ల మేతలో కలిపితే గుడ్ల ఉత్పత్తి పెరిగే అవకాశముంది.

• ఈమధ్యకాలంలో మునగాకుతో ఎనర్జీ డ్రింక్స్ కూడా తయారు చేస్తున్నారు.

• **గంగరాజు అరుణాదేవి**

---

# మీది నిజమైన ఆకలేనా..?



టీవీలోనో, బయట రెస్టారెంట్‌లోనో... రకరకాల ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. చూడగానే మన ఆలోచనలు తినటం వైపు మళ్లుతాయి. ఇలా చూడగానే పదే పదే ఆహారాన్ని తినాలనిపించటాన్ని మానసిక నిపుణులు 'ఫుడ్ నాయిస్' అంటారు. మన మెదడులో ఆహారానికి సంబంధించిన ఆలోచనలు చేసే రణగొణ ధ్వని ఇది. దీనివల్ల బరువు తగ్గాలనుకున్నవారు తగ్గరు. పెరగాలని లేకపోయినా బరువు పెరుగుతారు. ఈ ఫుడ్ నాయిస్‌ను ఎదుర్కోవటానికి మానసిక నిపుణులు కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు.

• కొన్నిసార్లు శరీరంలోని బ్లడ్ షుగర్ విలువలు పెరుగుతూ... పడిపోతూ ఉంటాయి. దీనికి కారణం సమతుల ఆహారం తినకపోవటం. అలాంటి సమయంలో మన మెదడు ఆహారం గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అందువల్ల ప్రతి రోజూ ప్రొటీన్, ఫైబర్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తినాలి.

• ఉదయాన్నే ఎక్కువ ప్రొటీన్ ఉన్న అల్పాహారం తినాలి. చీజ్, గుడ్లు, ప్రొటీన్ షేక్‌లు బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవటంవల్ల రోజంతా శరీరంలో బ్లడ్ షుగర్ విలువలు తగ్గవు. అందువల్ల ఉదయాన్నే ఈ తరహా బ్రేక్‌ఫాస్ట్ చేయటం మంచిది.

• కొందరు ఆకలి వేసిన వెంటనే చిప్స్ వంటివి తింటారు. దీనివల్ల ఆకలి తగ్గిన భావన కలుగుతుంది. వాస్తవానికి ఇది తాత్కాలికమే. కొద్ది సేపు అయిన వెంటనే మళ్లీ ఆకలి వేస్తుంది. ఆలోచనలన్నీ ఆహారం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అందువల్ల ఆకలి అనిపించినప్పుడు కార్బోహైడ్రేట్స్, కొవ్వు లేదా ప్రొటీన్ ఉన్న ఆహారాన్నే తినాలి. ప్రమాదకరమైన రసాయనాలు కలిపిన ప్రాసెస్డ్ ఫుడ్ తినకూడదు.

• మన పేగుల్లో ఆరోగ్యవంతమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది ఎక్కువగా లేకపోతే ఆకలి వేస్తున్నట్లు అనిపిస్తుంది. అందువల్ల ఈ బ్యాక్టీరియాను పెంపొందించే పెరుగు వంటివాటిని ఎక్కువగా తీసుకోవాలి.

• మెగ్నీషియం తక్కువ అయితే ఎక్కువగా చక్కెర తినాలనిపిస్తుంది. అందువల్ల మెగ్నీషియం ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవటం మంచిది.

---

అభిరుచి

# నాకు నేనే బాస్

**కపూర్‌లు... ఖాన్‌లు... ఖన్నాలు... బాలీవుడ్‌లో వారసుల జోరు ఇవాల్టిది కాదు. అగ్ర తారల పిల్లలు తల్లిదండ్రులను అనుసరించడం దశాబ్దాలుగా చూస్తున్నాం. కానీ కృష్ణా ష్రాఫ్ సగటు సినీ వారసులకు భిన్నం. నాన్న జాకీ ష్రాఫ్... అన్న టైగర్ ష్రాఫ్... ఇద్దరూ వెండితెర వేల్పులే. అయినా 32 ఏళ్ల కృష్ణా మాత్రం వారిలా నటనలోకి రావాలని అనుకోలేదు. తనకంటూ ఒక అభిరుచి... దాని కోసం శ్రమించి సాధించే పట్టుదల... ఇవే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి.**

"అందరు నటుల పిల్లల్లా నేను కూడా నాన్న వేసిన మార్గంలో నడవవచ్చు. కానీ అలా చేస్తే ఇక నాకంటూ చెప్పుకోవడానికి, కొత్తగా సాధించడానికి ఏముంటుంది? మొదటి నుంచీ నాకు సవాళ్లంటే ఇష్టం. వాటిని అధిగమించి అందుకున్న విజయంలో సంతోషం, సంతృప్తి ఉంటాయి. జాకీ ష్రాఫ్ కూతురుగానో, టైగర్ ష్రాఫ్ సోదరిగానో నన్ను గుర్తు పెట్టుకొంటానంటే... అందుకు నేను ఇష్టపడను. నన్ను నన్నుగా గుర్తించాలని కోరుకొంటాను. నటన నా ఒంటికి పడదనుకున్నాను. పారిశ్రామికవేత్తగా ఎదగాలనుకున్నాను. ఆ క్రమంలోనే మా అమ్మ ఆయేషాతో కలిసి 'ఎంఎంఎ మ్యాట్రిక్స్' (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ స్టూడియో) నెలకొల్పాను. మా కుటుంబానికి చిత్ర పరిశ్రమలో, ప్రజల్లో ఉన్న ఆదరణ నా వ్యాపారానికి బాగా కలిసొచ్చింది. కొత్తగా నా గురించి, నా స్టూడియో గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. అదీకాకుండా... ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకకు నాకు నచ్చింది నేను చేసుకొనే స్వేచ్ఛ ఇంట్లో నాకు ఉంది. ఇలాంటి స్వేచ్ఛ అందరికీ లభించదు కదా.

### అమ్మానాన్నలు గర్వపడేలా...

ఏం చేసినా ఇంట్లోవాళ్లు ఎదురు చెప్పరు. నిజమే... అలాగని వారు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగపరచకుండా సరైన దారిలో నడవాల్సిన బాధ్యత నాపై ఉంటుంది కదా. అందుకే నన్ను చూసి అమ్మానాన్నలు గర్వపడేలా ఎదగాలనుకున్నాను. ఆ ఆలోచనతోనే 'ఎంఎంఎ' ప్రారంభించాను. ఇది మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో పాటు ఫిట్‌నెస్ లక్ష్యాలను అందుకొనేందుకు ఉద్దేశించింది. ఇక్కడ నాకు నేనే బాస్. వేరొకరికి జవాబుదారీ కాదు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవచ్చు. దీంతోపాటు పలు రియాలిటీ షోస్‌లో కూడా పాల్గొన్నాను. ఎందుకంటే అక్కడ నిజమైన సవాళ్లు ఎదురవుతాయి. సవాళ్లు, సమస్యలు వచ్చినప్పుడే కదా... మన నైపుణ్యం, మన సామర్థ్యం ఏంటో మనకు తెలిసేది.

### అలా చెప్పుకోవడమే ఇష్టం

నేను ఒక డాక్యుమెంటరీ తీశాను... ట్రాన్స్‌జెండర్స్ స్థితిగతుల మీద. కాలేజీ రోజుల్లో బాస్కెట్‌బాల్ ఆడేదాన్ని. యువ క్రీడాకారులకు కొంతకాలం బాస్కెట్‌బాల్ కోచింగ్ కూడా ఇచ్చాను. ఇక ఫిట్‌నెస్ అనేది నా జీవితంలో ఒక భాగం. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచూ నా వర్కవుట్ వీడియోలు పోస్టు చేస్తుంటాను. అదేదో ప్రచారం కోసం కాదు... నన్ను చూసి కొందరైనా స్ఫూర్తి పొంది, వ్యాయామాలను తమ దినచర్యల్లో చేర్చుకోకపోతారా అనే ఆశ. ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అనుసరించడమే కాదు... సరికొత్త వస్త్ర శ్రేణులను పరిచయం చేయడంలోనూ ముందుంటాను. ఫిట్‌నెస్‌తో పాటు నా ఫ్యాషన్ ట్రెండ్స్ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తుంటాను. అయితే వీటన్నిటి కంటే నన్ను ఒక పారిశ్రామికవేత్తగానే అందరూ గుర్తుపెట్టుకోవాలన్నది నా కోరిక. అలా చెప్పుకోవడానికే నేను ఇష్టపడతాను. మా కుటుంబ వారసత్వానికి భిన్నంగా... ఒక పారిశ్రామికవేత్తగా నాదైన మార్గాన్ని నేను నిర్మించుకున్నాను. ఫిట్‌నెస్ ప్రపంచంలో నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలనేది నా తాపత్రయం.





### వద్దనుకొని వచ్చేశా...

నాన్న, అన్నయ్య హీరోలు. అమ్మ నిర్మాత. సినీ కుటుంబానికి చెందిన అమ్మాయిగా చిన్నప్పటి నుంచీ నా మీద కూడా విపరీతమైన ఒత్తిడి ఉండేది. పరిశ్రమలోని వారు, అభిమానులకు అంతుపట్టని విషయం ఏంటంటే... అసలు నేనెందుకు నటనలోకి రాలేదని! ఇలా అన్ని వైపుల నుంచి ఒత్తిడి, ఆకాంక్షల కారణంగా ఒక దశలో నేను కూడా పరిశ్రమ వైపే వెళ్లక తప్పదని అనుకున్నాను. దాంతో దుబాయ్ వెళ్లి అక్కడి 'ఎస్ఏఈ' ఇనిస్టిట్యూట్‌లో ఫిలిమ్ ప్రొడక్షన్‌లో డిగ్రీ పూర్తి చేశాను. భారత్‌కు తిరిగి వచ్చాక అన్నయ్య చిత్రాలు రెండు మూడింటికి అసిస్టెంట్‌గా పని చేశాను. ఆ సమయంలోనే అర్థమైంది... నేను కోరుకున్నది ఇది కాదని. ఇక అక్కడి నుంచి సమయం వృథా చేయదలుచుకోలేదు. పరిశ్ర వద్దనుకుని వచ్చేశాను."

### ఫిట్‌నెస్ మీద దృష్టి

అప్పట్లో బొద్దుగా, కాస్త బరువుగా ఉండేదాన్ని. జిమ్‌కు వెళ్లడానికే ఎంతో ఆలోచించేదాన్ని. నాన్నతో కలిసి ఎప్పుడన్నా బయటకు వెళ్లినప్పుడు నా ఫొటోలు తీసి, పత్రికల్లో ప్రచురించి, నా ఆకారం గురించి రాసేవారు. చిన్న వయసులో ఇవి నన్ను ఎంతో బాధించేవి. క్రమంగా ఆ విమర్శలను సానుకూలంగా తీసుకోవడం మొదలుపెట్టాను. అందుకే సినీ రంగం వద్దనుకుని వచ్చేశాక... ముందు నన్ను నేను మార్చుకోవాలని అనుకున్నాను. ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టాను. కొద్ది రోజుల్లోనే నాజూగ్గా మారాను. నిత్యం వ్యాయామాలవల్ల శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంది. రోజంతా ఎంతో ఉత్సాహంగా, ఏదో శక్తి నాలో ఆవహించినట్టుగా ఉండేది. ఏకాగ్రత కుదిరేది. దానివల్ల ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. అలా చివరకు ఫిట్‌నెస్‌కు సంబంధించిన కంపెనీనే నెలకొల్పాను. ఇప్పుడు నేను గర్వంగా చెప్పుకోగలను... ఒక విజయవంతమైన వ్యాపారవేత్తనని. ఇది నా కష్టం, పట్టుదలతో సాధించిన విజయం. నాన్న డబ్బు కానీ, ఆయన స్టార్‌డమ్ కానీ నాకు ఇంతటి సంతృప్తిని, సంతోషాన్ని ఇవ్వలేవు.

# మార్కెట్ ట్రంఫట్!

## వాణిజ్య యుద్ధం, మాంద్యం భయాలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ 930 పాయింట్లు పతనం
- 76,000 స్థాయిని కోల్పోయిన సూచీ
- 23,000 దిగువకు జారిన నిఫ్టీ
- దాదాపు రూ.10 లక్షల సంపద నష్టం

ముంబై: ట్రంప్ సుంకాలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి దారి తీయవచ్చని, అమెరికాను ఆర్థిక మాంద్యంలోకి నెట్టవచ్చన్న భయాందోళనలతో ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూశాయి. భారత ఈక్విటీ సూచీలూ ఇందుకు అతీతమేమీ కాదు. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 1,054.81 పాయింట్ల మేర క్షీణించి 75,240.55 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 930.67 పాయింట్ల (1.22 శాతం) నష్టంతో 75,364.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.65 పాయింట్లు (1.49 శాతం) కోల్పోయి 22,904.45 వద్దకు జారుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, ఇన్ఫోసిస్ వంటి మార్కెట్ దిగ్గజాలతో పాటు ఐటీ, మెటల్, ఫార్మా రంగ షేర్లలో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటం సూచీల భారీ నష్టాలకు కారణమైంది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.98 లక్షల కోట్లు తగ్గి రూ.403.34 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఈ వారంలో సెన్సెక్స్ 2,050.23 పాయింట్లు (2.64 శాతం), నిఫ్టీ 614.8 పాయింట్లు (2.61 శాతం) కోల్పోయాయి.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి. టాటా స్టీల్ 8.59 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్ 6.15 శాతం పతనమైంది. ఎల్ అండ్ టీ, అదానీ పోర్ట్స్ 4 శాతానికి పైగా.. ఇండస్ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ 3 శాతానికి పైగా తగ్గాయి.
- ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో మధ్యాహ్నం నుంచి అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 3.08 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 3.43 శాతం క్షీణించాయి. రంగాల వారీ సూచీలన్నీ నేలచూపు చూశాయి. అత్యధికంగా మెటల్ 6.34 శాతం నష్టపోగా.. క్యాపిటల్ గూడ్స్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ ఎనర్జీ, రియల్టీ, ఐటీ సూచీలు 3 శాతానికి పైగా తగ్గాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు క్షీణించి రూ.85.44 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల తరలింపు మన కరెన్సీకి గండికొట్టాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా తగ్గాయి. బ్రెంట్ రకం క్రూడాయిల్ పీపా ధర ఒకదశలో 6.62 శాతం తగ్గి 65.50 డాలర్లకు దిగివచ్చింది. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితి నేపథ్యంలో ఇంధన గిరాకీ తగ్గవచ్చన్న అంచనాలు ఇందుకు కారణమయ్యాయి.
- మన విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 5 నెలల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. మార్చి 28తో ముగిసిన వారం నాటికి ఫారెక్స్ నిల్వలు మరో 659.6 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 66,539.6 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ వెల్లడించింది. నిల్వలు పెరుగుతుండటం వరుసగా ఇది నాలుగోవారం.



### ఫార్మా షేర్లు కుదేలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. వారి దేశంలోకి దిగుమతయ్యే ఔషధాల పైనా గతంలో ఎన్నడూ లేని విధంగా సుంకాలను త్వరలోనే విధిస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నెల 2న సుంకాలు ప్రకటించిన సందర్భంలో ఔషధాలు, సెమీకండక్టర్లకు మినహాయింపునిచ్చిన పెద్దన్న.. ఆకస్మికంగా యూటర్న్ తీసుకోవడం ఈ రెండు ఇండస్ట్రీల వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఈ వార్త నేపథ్యంలో ఫార్మా రంగ షేర్లు భారీగా నష్టపోయాయి. మార్క్సన్స్ ఫార్మా షేరు 11.18 శాతం నష్టపోగా.. లారస్ ల్యాబ్స్ 7.40 శాతం, గ్రాన్యూల్స్ ఇండియా 7.01 శాతం, శిల్పా మెడికేర్ 6.56 శాతం, ఇప్కా ల్యాబ్స్ 6.53 శాతం, అరబిందో ఫార్మా 5.96 శాతం, లుపిన్ 5.85 శాతం తగ్గాయి. గ్లాండ్ ఫార్మా 5.51 శాతం, అజంతా ఫార్మా 5.40 శాతం, సిప్లా 5.32 శాతం, బయోకాన్ 5.09 శాతం, వోకార్డ్ 5 శాతం క్షీణించాయి. దివీస్ లేబొరేటరీస్ 4.70 శాతం, నాట్కో ఫార్మా 4.75 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.60 శాతం, సన్‌ఫార్మా 3.43 శాతం పడ్డాయి. బీఎస్ఈలోని హెల్త్‌కేర్ ఇండెక్స్ 3.20 శాతం క్షీణించింది.

## కొత్త రూ.10.. రూ.500 నోట్లు

### నూతన గవర్నర్ సంజయ్ సంతకంతో విడుదల

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొత్తగా రూ.10, రూ.500 కోట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో ఈ కరెన్సీ నోట్లను త్వరలో విడుదల చేయబోతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మహాత్మ గాంధీ సీరిస్‌లోనే వాటి డిజైన్ ఉంటుందని తెలిపింది. గతంలో విడుదల చేసిన రూ.10, రూ.500 నోట్లు యధావిధిగా చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. గవర్నర్ మల్హోత్రా సంతకంతో కూడిన నూతన రూ.100, రూ.200 నోట్లను విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా ఇప్పుడు రూ.10, రూ.500 నోట్లను కూడా విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది.

## నూతన ఎగ్జిమ్ నిబంధనలు

### ప్రకటించిన ఆర్‌బీఐ

ముంబై: వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)-1999 పరిధిలో ఎగుమతి, దిగుమతి లావాదేవీలకు సంబంధించి సవరించిన ముసాయిదా నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. ఈ సవరించిన ముసాయిదా నిబంధనల ప్రకారం ఎగుమతిదారుకు గడువు తేదీ ముగిసిన రెండేళ్ల తర్వాత కూడా బకాయి సొమ్ము అందకపోయినా, అలా తాను అందుకోవాల్సిన సంచిత బకాయి రూ.25 కోట్లు దాటినా సంబంధిత ఎగుమతిదారుడు అడ్వాన్స్‌గా పూర్తి సొమ్ము చెల్లింపు లేదా వెనక్కి తీసుకోవడానికి వీలు లేని లెటర్ ఆఫ్ క్రెడిట్ హామీ పొందిన తర్వాత మాత్రమే మరిన్ని ఎగుమతులను ఆమోదించవచ్చు. అలాగే బంగారం, వెండి దిగుమతుల విషయంలో అధీకృత డీలర్ అడ్వాన్స్ చెల్లింపులు చేయడానికి ఇక ఏ మాత్రం అనుమతించరు. మరింతగా వ్యాపార సౌలభ్యం కల్పించడం లక్ష్యంగానే ఈ ముసాయిదా నిబంధనలు విడుదల చేసినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి

- 10 గ్రాములపై రూ.1,350 తగ్గుదలతో రూ.93,000కు దిగివచ్చిన పసిడి
- కిలో వెండి రూ.5,000 డౌన్

**అంతర్జాతీయ మార్కెట్లో 3,045 డాలర్లకు ఔన్స్ గోల్డ్**

న్యూఢిల్లీ: పసిడి ధరలు ఆల్ టైమ్ రికార్డు స్థాయి నుంచి గణనీయంగా తగ్గాయి. శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.1,350 తగ్గుదలతో రూ.93,000కు దిగివచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో తగ్గి రూ.92,550 ధర పలికింది. దాంతో గోల్డ్ ధరల 5 రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. వెండి విషయానికొస్తే, కిలోపై ఏకంగా రూ.5000 తగ్గి రూ.95,500కు జారుకుంది. వెండికి గత నాలుగు నెలల్లో ఇదే అతిపెద్ద తగ్గుదల. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు బాగా తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు (జూన్ డెలివరీ) ధర ఒక దశలో 2.60 శాతం క్షీణించి 3,042 డాలర్లకు పడిపోయింది. సిల్వర్ 6.75 శాతం పతనమై 29.83 డాలర్లకు దిగివచ్చింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 5వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 400 | విజయవాడ | 430 |
| వరంగల్ | 402 | గోదావరి | 425 |
| చిత్తూరు | 470 | విశాఖపట్నం | 440 |
| | | దజను గుడ్లు రూ. 60 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 120 | విజయవాడ | 130 |
| వరంగల్ | 120 | గుంటూరు | 122 |
| కరీంనగర్ | 120 | ఒంగోలు | 122 |
| మహబూబ్‌నగర్ | 120 | చిత్తూరు | 92 |
| కర్నూలు | 120 | నెల్లూరు | 97 |
| విశాఖపట్నం | 114 | అనంతపురం | 97 |
| గోదావరి | 130 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 91,640 ▼ | 84,000 ▼ | 1,08,000 ▼ |
| విజయవాడ | 93,600 ▼ | 88,000 ▲ | 95,000 ▼ |
| విశాఖపట్నం | 89,330 ▲ | 81,890 ▲ | 91,600 ▼ |
| రాజమండ్రి | 91,640 ▲ | 84,000 ▲ | 95,600 ▼ |
| ప్రొద్దుటూరు | 92,900 ▼ | 85,400 ▼ | 96,000 ▼ |
| ముంబై | 91,014 ▲ | 83,369 ▲ | 92,910 ▼ |

## 2030 నాటికి 100 కొత్త విమానాలు

**క్యాథే పసిఫిక్ రీజినల్ మేనేజర్ రాకేశ్ రాయికర్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్యాథే పసిఫిక్ విమానయాన సంస్థ 100 కొత్త తరం విమానాలు సమకూర్చుకుంటోంది. రాబోయే ఐదు సంవత్సరాల కాలానికి తాము నిర్దేశించుకున్న 10 వేల కోట్ల హాంకాంగ్ డాలర్ల (ప్రస్తుత మారకపు విలువలో 1,286 కోట్ల అమెరికన్ డాలర్లు) పెట్టుబడిలో ఈ విమానాల కొనుగోలు కూడా ఒక భాగమని కంపెనీ రీజినల్ జీఎం రాకేశ్ రాయికర్ తెలిపారు. ఇటీవల దేశంలో యాపిల్ ఉత్పత్తులు ప్రారంభం కావడంతో పాటు ఫార్మా ఎగుమతుల మద్దతుతో ఈ ఏడాది దక్షిణ భారతం నుంచి కార్గో వృద్ధి 25% ఉంటుందని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. గత ఏడాది తాము వివిధ గమ్యాలకు తరలించిన కార్గోలో 43% చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలదేనని ఆయన తెలిపారు. తెలంగాణలో ఫాక్స్‌కాన్ తయారీ కేంద్రం ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి కార్గో రవాణా మరింతగా పెరుగుతుందని భావిస్తున్నట్టు కంపెనీ కార్గో విభాగం రీజినల్ హెడ్ రాజేష్ మీనన్ అన్నారు.

తాము కొత్తగా సమకూర్చుకుంటున్న 100 విమానాల డెలివరీ 2027లో ప్రారంభమై 2030 నాటికి పూర్తవుతుందని రాయికర్ చెప్పారు. హైదరాబాద్ నుంచి హాంకాంగ్‌కు తాము ప్రస్తుతం వారంలో మూడు సర్వీసులు నడుపుతున్నామని, సెప్టెంబరు 1 నుంచి వీటి సంఖ్య 5కి పెంచుతామని రాయికర్ వెల్లడించారు.

## రూ.1,200 కోట్లతో విస్తరణ



**ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ ఎండీ ప్రమోద్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ (ఎంఎస్ఏఎఫ్) రూ.1,200 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ మార్కెట్లోకి ఎంఎస్ లైఫ్ 600+ సీఆర్ఎస్ (కరోజన్ రెసిస్టెన్స్ స్టీల్) టీఎంటీ బార్స్‌ను కంపెనీ ఎండీ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కంపెనీకి చెందిన ప్లాంట్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు వచ్చే 2-3 ఏళ్ల కాలంలో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కంపెనీకి తెలంగాణలోని తూప్రాన్, ఏపీలోని నాయుడుపేట, మంత్రాలయంలో ప్లాంట్లున్నాయి. ఈ ప్లాంట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షల టన్నులుండగా ప్రతిపాదిత పెట్టుబడులతో 1.2 కోట్ల టన్నులకు చేరుకుంటుందని అగర్వాల్ తెలిపారు. అలాగే ఈ విస్తరణ ద్వారా 5,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

## మా ఆత్మస్థైర్యాన్ని నీరుగార్చొద్దు

### పీయూష్ గోయెల్‌కు స్టార్టప్స్ అధినేతల వినతి

న్యూఢిల్లీ: భారత స్టార్టప్ వ్యవస్థలో విలువ, ఇన్నోవేషన్ లోపించాయంటూ కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ చేసిన వ్యాఖ్యలను పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముక్తకంఠంతో ఖండించారు. తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయవద్దని, తమ సామర్థ్యాలు సంపూర్ణంగా ఉపయోగించుకునేలా వెన్నుతట్టి ప్రోత్సహించాలని ఆయనకు సూచించారు. వారిలో క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో సీఈఓ అదిత్ పలీచా, జోహో వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్రీధర్ వెంబు ఉన్నారు. స్టార్టప్ మహాకుంభ్‌లో గురువారం గోయెల్ చేసిన వ్యాఖ్యలపై పెద్దఎత్తున దుమారం రేగుతోంది. ఉద్యోగాలు, ఎఫ్‌డీఐ వంటి విభాగాలకు తమ కంపెనీ అందిస్తున్న వాటా "భారత ఇన్నోవేషన్ వ్యవస్థలోనే ఒక అద్భుతం" అని పలీచా వ్యాఖ్యానించారు. లక్ష్య సాధన దిశగా చురుగ్గా కృషి చేస్తున్న బృందాలను వెనక్కి లాగడం మానుకుని విభిన్న రంగాల్లో "స్థానిక చాంపియన్ల"ను సృష్టించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాలని కోరారు.

## స్పోర్ట్స్

### నేటి మ్యాచ్‌లు

| | | |
|---|---|---|
| మ.3.30 నుంచి | చెన్నై x ఢిల్లీ | వేదిక: చెన్నై |
| రా.7.30 నుంచి | పంజాబ్ x రాజస్థాన్ | వేదిక: చండీగఢ్ |

# విజయాన్ని లాగేశారు

**సత్తా చాటిన లఖ్‌నవూ బౌలర్లు**

- ముంబై పరాజయం
- మార్ష్ మెరుపు ఇన్నింగ్స్
- సూర్య పోరాటం వృథా



హార్దిక్ పాండ్యా (4-0-36-5)

**1** ఐపీఎల్‌లో 5 వికెట్లు తీసిన తొలి కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా. అలాగే అతడి టీ20 కెరీర్‌లోనూ ఈ ఫీట్ సాధించడం ఇదే మొదటిసారి.



మిచెల్ మార్ష్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 60)

లఖ్‌నవూ: సొంత గడ్డపై లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సత్తా చాటుకుంది. బ్యాటింగ్‌లో ఓపెనర్ మిచెల్ మార్ష్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 60) మెరుపు ఆట తీరు కనబర్చగా.. అటు గెలుపు ఖాయమే అనుకున్న వేళ ముంబై ఇండియన్స్‌ను ఆఖర్లో లఖ్‌నవూ బౌలర్లు దెబ్బతీశారు. దీంతో శుక్రవారం ఉత్కంఠ సాగిన ఈ మ్యాచ్‌లో పంత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే ఐపీఎల్‌లో ముంబైతో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో లఖ్‌నవూకిది ఆరో విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లకు 203 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 53) అర్ధసెంచరీ సాధించగా, ఆయుష్ బదోని (19 బంతుల్లో 4 ఫోర్లతో 30), మిల్లర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) సహకరించారు. హార్దిక్‌కు ఐదు వికెట్లు లభించాయి. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడింది. సూర్యకుమార్ (43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 67), నమన్ ధిర్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) పోరాడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా దిగ్వేష్ రాఠి నిలిచాడు.

**నమన్-సూర్య పోరాడినా..**

భారీ ఛేదనలో ముంబై తొలి మూడు ఓవర్లలోనే ఓపెనర్లు జాక్స్ (5), రికెల్టన్ (10) వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 17 పరుగులే. ఈ దశలో వన్‌డౌన్ బ్యాటర్ నమన్ ధిర్-సూర్యకుమార్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఎల్ఎస్‌జీ బౌలర్లపై ఎదురుదాడి ఆరంభించాడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా బౌండరీలు బాదేస్తూ స్కోరును చకచకా పెంచాడు. నాలుగో ఓవర్‌లో 6,6,4,4తో 21 రన్స్ రాబట్టాడు. అతడి ధాటికి పవర్‌ప్లేలో స్కోరు 64/2తో ఛేదన దిశగా సాగింది. అటు సూర్య సహకారం అందించడంతో దాదాపు 11 రన్‌రేట్‌తో ఇన్నింగ్స్ సాగింది. అయితే స్పిన్నర్ దిగ్వేష్ తొమ్మిదో ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చి నమన్‌ను బౌల్డ్ చేయగా మూడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం సూర్య బాధ్యతను తీసుకుని అడపాదడపా బౌండరీలు సాధించాడు. మరో ఎండ్‌లో లఖ్‌నవూ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో తిలక్ వర్మ (25) భారీ షాట్లు ఆడలేకపోయాడు. అటు రన్‌రేట్ కూడా పెరగసాగింది. ఈ స్థితిలో 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్యను పేసర్ అవేశ్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 66 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు ముంబై అవకాశాలు కూడా సన్నగిల్లాయి. 12 బంతుల్లో 29 రన్స్ కావాల్సిన స్థితిలో 19వ ఓవర్‌లో శార్దూల్ ఏడు పరుగులే ఇచ్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అలాగే ఐదో బంతికి తిలక్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో శాంట్నర్ (2 నాటౌట్) క్రీజులోకి వచ్చాడు. ఇక సమీకరణం చివరి ఆరు బంతుల్లో 22 పరుగులకు మారింది. అవేశ్ తొలి బంతిని హార్దిక్ (28 నాటౌట్) సిక్సర్‌గా మలిచినా 9 పరుగులే రావడంతో ముంబై చేసేదేమీ లేకపోయింది.

**మార్ష్ తుఫాన్ ఇన్నింగ్స్:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్ మార్ష్ రూపంలో మెరుపు ఆరంభం లభించింది. బాదడమే లక్ష్యంగా సాగిన అతడి ఎదురుదాడికి పవర్‌ప్లేలోనే 69 పరుగులు సమకూరాయి. ఇందులో మార్ష్ ఒక్కడివే 60 పరుగులు కావడం విశేషం. మరో ఓపెనర్ మార్‌క్రమ్ ఈ దశలో ఆరు బంతులే ఆడాడు. వాస్తవానికి మార్ష్ తొలి ఓవర్‌లోనే అవుట్ కావాలి. అతడి బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతిని కీపర్ రికెల్టన్ అందుకున్నా ఎవరూ అప్పీల్ చేయలేదు. అశ్వని కుమార్ వేసిన ఆరో ఓవర్‌లో మార్ష్ 6,4,4,4తో 23 పరుగులు రాబట్టాడు. 27 బంతుల్లోనే ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు. అయితే తర్వాతి ఓవర్‌లోనే స్పిన్నర్ విఘ్నేష్ అతడిని పెవిలియన్‌కు చేర్చడంతో తొలి వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే హార్దిక్ వరుస ఓవర్లలో ప్రమాదకర పూరన్ (12), కెప్టెన్ పంత్ (2)ను అవుట్ చేయడంతో ముంబైలో జోష్ కనిపించింది. కానీ ఈ దశలో మార్‌క్రమ్ బ్యాట్ ఝుళిపించగా, అతడికి బదోని సహకారం అందించాడు. హార్దిక్, విఘ్నేష్ ఓవర్లలో మార్‌క్రమ్ భారీ సిక్సర్లతో అలరించాడు. అటు బదోని 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో 15 రన్స్ సమకూర్చాడు. నాలుగో వికెట్‌కు 51 పరుగులు జత చేరాక బదోనిని అశ్వని అవుట్ చేశాడు. ఇక 34 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన మార్‌క్రమ్‌ను హార్దిక్ దెబ్బతీశాడు. అబ్దుల్ సమద్ (4) విఫలం కాగా..చివరి ఓవర్‌లో మిల్లర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 27) 6,4 బాది స్కోరును 200 దాటించాడు. అయితే మిల్లర్‌తో పాటు ఆకాశ్‌దీప్(0)ను అవుట్ చేసి హార్దిక్ 5 వికెట్లను పూర్తి చేశాడు.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.ర‌రే |
|---|---|---|---|---|---|---|
| పంజాబ్ | 2 | 2 | 0 | 0 | 4 | 1.485 |
| ఢిల్లీ | 2 | 2 | 0 | 0 | 4 | 1.320 |
| బెంగళూరు | 3 | 2 | 1 | 0 | 4 | 1.149 |
| గుజరాత్ | 3 | 2 | 1 | 0 | 4 | 0.807 |
| కోల్‌కతా | 4 | 2 | 2 | 0 | 4 | 0.070 |
| లఖ్‌నవూ | 4 | 2 | 2 | 0 | 4 | 0.048 |
| ముంబై | 4 | 1 | 3 | 0 | 2 | 0.108 |
| చెన్నై | 3 | 1 | 2 | 0 | 2 | -0.771 |
| రాజస్థాన్ | 3 | 1 | 2 | 0 | 2 | -1.112 |
| హైదరాబాద్ | 4 | 1 | 3 | 0 | 2 | -1.612 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

## చైన్ సింగ్‌కు కాంస్యం



**షూటింగ్ వరల్డ్ కప్**

న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ చైన్ సింగ్ కాంస్య పతకంతో మెరిశాడు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో శుక్రవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో చైన్ సింగ్ మొత్తం 443.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. హంగేరి షూటర్ ఇస్త్వాన్ పెని స్వర్ణం, చైనాకు చెందిన తియాన్ రజతం సాధించారు.

## ఫైనల్‌కు హితేష్

**ప్రపంచ బాక్సింగ్ కప్**



న్యూఢిల్లీ: జాతీయ చాంపియన్ హితేష్ బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 70 కిలోల విభాగం బౌట్‌లో హితేష్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో హితేష్ 5-0తో ఫ్రాన్స్ బాక్సర్ మకాన్ ట్రవోర్‌ను చిత్తు చేశాడు. ఫైనల్ బౌట్‌లో ఇంగ్లండ్‌కు చెందిన ఒడెల్ కమరతో హితేష్ తలపడనున్నాడు. మిగతా బాక్సర్లలో జదుమని సింగ్ (50 కిలోలు), విశాల్ (90 కిలోలు), సచిన్ (60 కిలోలు) సెమీఫైనల్స్‌లో తమ ఓటమి పాలయ్యారు.


## గ్రాండ్‌స్లామ్‌ల ప్రైజ్‌మనీ పెంచాల్సిందే..

**నిర్వాహకులకు లేఖ రాసిన టాప్-10 ఆటగాళ్లు**

న్యూఢిల్లీ: నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల ప్రైజ్‌మనీని పెంచాల్సిందేనని ప్రపంచ టెన్నిస్ పురుషులు, మహిళల టాప్-10 ప్లేయర్లు స్పష్టంజేశారు. ఈమేరకు వారు ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ల నిర్వాహకులకు లేఖ రాశారు. గ్రాండ్‌స్లామ్స్ ద్వారా సమకూరే ఆదాయానికి అనుగుణంగా ఆటగాళ్ల ప్రైజ్‌మనీని కూడా పెంచాలని ఆ లేఖలో కోరారు. అంతే కాదు..ఈ విషయమై ఆటగాళ్లతో చర్చించేందుకు ఈనెల 22 నుంచి మాడ్రిడ్‌లో జరిగే టెన్నిస్ టోర్నీ సందర్భంగా చర్చలకు రావాలని గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులను ఆహ్వానించారు. లేఖపై జొకోవిచ్, జానిక్ సిన్నర్, కొకా గాఫ్, సబలెంకా తదితర టాప్‌స్టార్లు సంతకం చేశారు.

## డ్రగ్స్ కేసులో కెనడా క్రికెట్ కెప్టెన్ అరెస్ట్

**9 కిలోల మారిజువానా స్వాధీనం**



బ్రిడ్జిటౌన్ (బార్బడోస్): కెనడా క్రికెట్ జట్టు కెప్టెన్ నికొలాస్ కిర్టన్‌ను డ్రగ్స్ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టడీలోకి తీసుకున్న పోలీసులు..ఏకంగా తొమ్మిది కిలోల మారిజువానాను కిర్టన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. 26 ఏళ్ల కిర్టన్ గత ఏడాది జూలైలో కెనడా జట్టు అన్ని ఫార్మాట్ల కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. బార్బడోస్‌లో జన్మించిన నికొలాస్ దేశవాళీ అండర్-17, అండర్-19 పోటీలలో ఆ జట్టుకు ఆడాడు. అయితే అతడి తల్లి కెనడా వాసి కావడంతో అక్కడికి వెళ్లి ఆ దేశ జాతీయ జట్టుకు ఆడుతున్నాడు.

## మే 24న స్వదేశంలో 'నీరజ్ చోప్రా' టోర్నీ

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వచ్చే నెలలో స్వదేశీ అభిమానులను అలరించనున్నాడు. మే 24న హరియాణాలోని పంచకులలో అతడి పేరిటే జరిగే నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో పోటీపడనున్నాడు. అటు ప్రపంచ అథ్లెటిక్స్ సంఘం కూడా ఈ ఎన్‌సీ క్లాసిక్‌ను గోల్డ్ కేటగిరీగా పేర్కొంది. దీంతో నీరజ్ ఈవెంట్‌ను సెప్టెంబరులో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత టోర్నీగా భావిస్తున్నారు. ఈ టోర్నీలో నీరజ్‌తో పాటు ఇతర ప్రపంచ జావెలిన్ త్రోయర్లు కూడా పాల్గొననున్నట్టు తెలుస్తోంది.

## నెట్స్‌లో రోహిత్‌కు గాయం



లఖ్‌నవూ: నెట్స్‌లో సాధన చేస్తుండగా మోకాలికి గాయమవడంతో ముంబై ఇండియన్స్ ఓపెనర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ లఖ్‌నవూతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. శుక్రవారం నెట్స్‌లో సాధన చేస్తుండగా రోహిత్ మోకాలికి గాయమైందని, అతడు బరిలోకి దిగడం లేదని టాస్ అనంతరం హార్దిక్ తెలిపాడు. కాగా, ఐపీఎల్‌లో రోహిత్ ఓ మ్యాచ్‌కు దూరమవడం 2021 తర్వాత ఇదే తొలిసారి. ఇక, ముంబై ఇండియన్స్ తరఫున 100వ ఐపీఎల్ మ్యాచ్ బరిలోకి దిగిన సందర్భంగా సూర్యకుమార్‌కు జట్టు యాజమాన్యం ప్రత్యేక జెర్సీని బహూకరించింది.

### స్కోరుబోర్డు

**లఖ్‌నవూ:** మార్ష్ (సి అండ్ బి) విఘ్నేష్ 60, మార్‌క్రమ్ (సి) రాజ్ బవ (బి) హార్దిక్ 53, పూరన్ (సి) చాహర్ (బి) హార్దిక్ 12, పంత్ (సి/సబ్) బాష్ (బి) హార్దిక్ 2, బదోని (సి) రికెల్టన్ (బి) అశ్వని 30, మిల్లర్ (సి) నమన్ (బి) హార్దిక్ 27, అబ్దుల్ సమద్ (సి) నమన్ (బి) బౌల్ట్ 4, శార్దూల్ (నాటౌట్) 5, ఆకాశ్‌దీప్ (సి) శాంట్నర్ (బి) హార్దిక్ 0, అవేశ్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 203/8; వికెట్ల పతనం: 1-76, 2-91, 3-107, 4-158, 5-173, 6-182, 7-200, 8-200; బౌలింగ్: బౌల్ట్ 3-0-28-1, దీపక్ చాహర్ 2-0-23-0, అశ్వని కుమార్ 3-0-39-1, శాంట్నర్ 4-0-46-0, విఘ్నేష్ పుతూర్ 4-0-31-1, హార్దిక్ పాండ్యా 4-0-36-5.

**ముంబై:** విల్ జాక్స్ (సి) బిష్ణోయ్ (బి) ఆకాశ్‌దీప్ 5, రికెల్టన్ (సి) బిష్ణోయ్ (బి) శార్దూల్ 10, నమన్ (బి) దిగ్వేష్ 46, సూర్యకుమార్ (సి) సమద్ (బి) అవేశ్ 67, తిలక్ (రిటైర్డ్ అవుట్) 25, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 28, శాంట్నర్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 191/5; వికెట్ల పతనం: 1-11, 2-17, 3-86, 4-152, 5-180; బౌలింగ్: శార్దూల్ 4-0-40-1, ఆకాశ్‌దీప్ 4-0-46-1, అవేశ్ ఖాన్ 4-0-40-1, దిగ్వేష్ రాఠి 4-0-21-1, రవి బిష్ణోయ్ 4-0-40-0.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దిగ్వేష్ రాఠి (1/21)

## మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

» హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంలో మిథున్‌రెడ్డి పిటిషన్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో మద్యం విక్రయాలు, తయారీలో అవకతవకలు జరిగాయంటూ గతేడాది సెప్టెంబరు 23న సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని మిథున్‌రెడ్డి తొలుత హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ కేసులో మిథున్‌రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, రికార్డులను పరిశీలిస్తే ఈ దశలో ఆయనపై ఎలాంటి ఆరోపణలూ లేవని హైకోర్టు అభిప్రాయ పడింది. ఖజానాకు రూ.వేల కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తు అధికారి కూడా తన ముందున్న సమాచారం సరైందా? కాదా? అని ఇంకా పరిశీలించుకోవాల్సి ఉందని పేర్కొంది. 'అస్పష్టమైన, సాధారణ ఆరోపణల ఆధారంగా ముందస్తు బెయిల్ మంజూరు చేయలేం. ఇలాంటివి అనుమతిస్తే ముందస్తు బెయిల్ పిటిషన్లు వరదలా వచ్చి పడతాయి. పిటిషనర్‌పై నిర్దిష్ట ఆరోపణలు లేవు. నిందితుడిగా కూడా చేర్చలేదు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడు' అని పేర్కొంటూ పిటిషన్‌ను గురువారం హైకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మిథున్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు.

## తెలియదు.. అవగాహన లేదు...

» చివరిరోజూ మారని విజయ్‌కుమార్‌రెడ్డి తీరు

» సిబ్బంది కొరతవల్లే ఔట్ సోర్సింగ్ నియామకం

» గతంలోనూ అదే చేశారంటూ పలు ప్రశ్నలు దాటవేత

» ముగిసిన ఏసీబీ విచారణ




గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : సాక్షి మీడియాకు నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలు ప్రకటనల రూపంలో దోచిపెట్టిన వ్యవహారంపై నమోదైన కేసులో మూడో రోజు కూడా ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ తుమ్మా విజయకుమార్‌రెడ్డి తీరు మారలేదు. తెలియదు.. అవగాహన లేదంటూ చాలా ప్రశ్నలను దాటవేసే ప్రయత్నం చేశారు. ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయనను గుంటూరు ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర నేతృత్వంలోని బృందం విచారించింది. ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా ఉండగా ఆయన ఆనాడు పెద్ద సంఖ్యలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్నారు. ముఖ్యంగా సాక్షి, ఐ ప్యాక్ ఉద్యోగులను ఐఅండ్ పీఆర్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా చూపి జీతాల రూపంలో రూ.కోట్ల ప్రజాధనం చెల్లించారని ఇప్పటికే ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి సంబంధించి జరిగిన అవకతవకలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించగా, ఆయన సూటిగా సమాధానం చెప్పలేదని తెలిసింది. గతంలో పని చేసిన వారు కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్నారని, తాను బాధ్యతలు స్వీకరించే సమయానికి ఉన్న ఖాళీలను తాను భర్తీ చేశానని బదులిచ్చినట్టు తెలిసింది. గతంలో ప్రభుత్వంలో ఉన్నవారు చేసిన మాదిరిగానే నాడు తానూ వ్యవహరించినట్టు చెప్పుకొచ్చారు. అంతకు మించి తనకు ఏమీ తెలియదని, దానికి సంబంధించి తనకు పెద్దగా అవగాహన లేదని చెప్పినట్లు తెలిసింది. కాగా, అవసరమైతే మళ్లీ పిలుస్తామని, అప్పుడు హాజరు కావాలని విజయకుమార్ రెడ్డికి ఏసీబీ అధికారులు చెప్పి, పంపించారు. విజయకుమార్‌రెడ్డిని గుంటూరు ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర తో పాటు పలువురు డీఎస్పీలు, సీఐలు విచారించారు.



కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి

# హైకోర్టు షాక్




» సిట్ నోటీసులలో జోక్యానికి నిరాకరణ

» తెలంగాణలో ఉన్నా విచారణకు రావాల్సిందే

» తగిన సమయంతో మళ్లీ నోటీసులివ్వండి

» దర్యాప్తు సంస్థకు స్పష్టీకరణ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా తమ ముందు విచారణకు హాజరుకావాలంటూ ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. 'సిట్ ఇచ్చిన నోటీసుకు చట్టబద్ధత ఉందని, ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. విచారణకు హాజరైన సమయంలో తొందరపాటు చర్యలు తీసుకోకుండా నిలువరించాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది చేసిన అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. విచారణ ప్రక్రియను వీడియో తీయాలని, న్యాయవాదిని అనుమతించాలన్న వినతినీ తిరస్కరించింది. అలాంటి అభ్యర్థనలు ఏవీ పిటిషన్‌లో కోరలేదని తెలిపింది. విచారణకు హాజరయ్యేందుకు సముచిత సమయం ఇస్తూ తదుపరి నోటీసు జారీ చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా తమ ముందు హాజరుకావాలని గత నెల 25, 28 తేదీల్లో సిట్ ఇచ్చిన నోటీసు(సీఆర్‌పీసీ సెక్షన్ 160)లను కొట్టివేయాలి కోరుతూ వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడని పేరున్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పి. నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. వైసీపీ హయాంలో రెండేళ్లపాటు పిటిషనర్ ఐటీ సలహాదారుగా పనిచేశారన్నారు. మద్యం వ్యవహారంతో ఆయనకు సంబంధం లేదని తెలిపారు. ఐటీ సలహాదారు హోదాలో ఆ శాఖకు సంబంధించిన విషయాల గురించి చర్చించేందుకు మాత్రమే అప్పటి ప్రభుత్వ పెద్దలను కలిశారన్నారు. పిటిషనర్ తెలంగాణలో నివశిస్తున్నారని, నోటీసు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరే అధికార పరిధి ఏపీ సీఐడీకి లేదన్నారు. పిటిషనర్‌ను విచారణ పేరుతో పిలిచి అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందన్నారు. కసిరెడ్డిపై ఆరోపణలు నిరాధారమైనవేనని చెప్పారు. ఈ నేపథ్యంలో సిట్ నోటీసులను కొట్టివేయాలని కోరారు.

### ఆ అధికారం ఉంది: ఏజీ

సిట్ తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణలో ఉంటున్నవారికి సైతం నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరే అధికార పరిధి ఏపీ సీఐడీకి ఉంటుందన్నారు. ఇదే హైకోర్టులో సింగిల్ జడ్జి, ద్విసభ్య ధర్మాసనం ఈ విషయంపై స్పష్టమైన తీర్పులు ఇచ్చాయన్నారు. పిటిషనర్‌ను కేసులో నిందితుడిగా చేర్చలేదని తెలిపారు. అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సాక్షిగా విచారణకు హాజరుకావాలని నిబంధనల ప్రకారమే దర్యాప్తు అధికారి నోటీసులు ఇచ్చారన్నారు. పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి చట్టనిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు కొనసాగాలని పేర్కొన్నారు. తెలంగాణలో ఉంటున్నవారికి నోటీసు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరే అధికారపరిధి ఏపీ సీఐడీకి ఉంటుందని పేర్కొన్నారు. సిట్ నోటీసుల విషయంలో జోక్యానికి నిరాకరించారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది స్పందిస్తూ.. కసిరెడ్డిని ఇంటి వద్దే విచారించేలా ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్‌కు 60 ఏళ్లు పైబడలేదని, అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేశారు.

రజనీ, ఆమె మరిదికి

# పదేళ్లు శిక్ష పడే అవకాశం ఉంది

» హైకోర్టుకు తెలిపిన ఏజీ దమ్మాలపాటి

» బెయిలివ్వండి షరతులకు లోబడతాం

» రజనీ తరఫు న్యాయవాది వాదనలు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.కోట్లు వసూలు చేశారనే ఆరోపణలతో ఏసీబీ నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని, ఆమె మరిది గోపీనాథ్ వేసిన పిటిషన్లపై హైకోర్టులో శుక్రవారం వాదనలు జరిగాయి. అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఏసీబీ అధికారులు నిందితులపై ఐపీసీ సెక్షన్ 386(చంపేస్తామని బెదిరించి బలవంతపు వసూళ్లకు పాల్పడడం) నమోదు చేశారని తెలిపారు. ఈ సెక్షన్ కింద 10 ఏళ్లు శిక్షపడేందుకు వీలుందని చెప్పారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్, న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. కేసు వెనుక రాజకీయ కారణాలున్నాయని తెలిపారు. 41(ఏ) కింద నోటీసులు ఇవ్వకుండా, ఐపీసీ సెక్షన్ 386ను చేర్చారన్నారు. చంపేస్తామని బెదిరించి బలవంతంగా సొమ్ము వసూలు చేసినట్లు ఫిర్యాదులో ఎక్కడా లేదన్నారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటామన్నారు. అయితే, ఏసీబీ తరఫున ఏజీ పూర్తిస్థాయి వాదనల కోసం విచారణను న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు ఈ నెల 8కి వాయిదా వేశారు. వైసీపీ హయాంలో విజిలెన్స్ తనిఖీ పేరుతో తనను బెదిరించి, రూ.2.20 కోట్లు వసూలు చేశారని పల్నాడుజిల్లాలోని లక్ష్మీబాలాజి స్టోన్ క్రషర్స్ మేనేజింగ్ పార్టనర్ నల్లపనేని చలపతిరావు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. కాగా, విడదల రజని పీఏ దొడ్డా రామకృష్ణ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ కూడా ఈ నెల 8కి వాయిదా పడింది.

సీఐని బెదిరించిన కేసులో

# బోరుగడ్డకు రిమాండ్

» తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలింపు


అనంతపురం మొబైల్ కోర్టు వద్ద బోరుగడ్డ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సీఐని బెదిరించిన కేసులో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌కు కోర్టు రిమాండ్ విధించింది. అనంతపురం త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను 2018లో బెదిరించిన ఘటనలో బోరుగడ్డపై కేసు నమోదయింది. ఆ కేసు విచారణ శుక్రవారం అనంతపురం మొబైల్ కోర్టులో సాగింది. అనంతపురం రామచంద్ర నగర్‌లోని ఓ క్రైస్తవ సంస్థ సభ్యుల మధ్య గొడవల నేపథ్యంలో భద్రత కావాలంటూ నాటి సీఐ మురళీకృష్ణను 2018, జూలై 21 కోరారు. వారి అభ్యర్థన మేరకు అప్పటి ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బందిని సీఐ పంపించారు. అదే రోజు సాయంత్రం ఆయనకు రెండు బెదిరింపు ఫోన్లు వచ్చాయి. అసభ్యకరంగా మాట్లాడారు. ఒక వర్గానికి మద్దతు ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. పోలీసుల విచారణలో తాతోటి జాకోబ్ స్వరూప్ కుమార్ పేరు మీద బోరుగడ్డ అమృతవల్లి సిమ్ కార్డులు తీసుకున్నట్లు రుజువయింది. దీనిపై సీఐ మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదే ఏడాది జూలై 26న కేసు నమోదైంది. ఈ కేసులో బోరుగడ్డ అనిల్‌ను రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటకు వచ్చాక బోరుగడ్డ ఇప్పటి వరకు వాయిదాలకు హాజరు కాలేదు. దీంతో అనంతపురం మొబైల్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం పోలీసులు రాజమహేంద్రవరం జైలు నుంచి అతన్ని పీటీ వారెంట్‌పై తీసుకొచ్చారు. శుక్రవారం 11 గంటల సమయంలో మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి అతనికి రిమాండ్ విధించారు. విచారణను 10వ తేదీకి వాయిదా వేశారు. ఏ జైలుకు వెళతావు? అని న్యాయాధికారి ప్రశ్నించగా..'రాజమహేంద్రవరం జైలుకే పంపండి' అని అనిల్ కోరారు. దీంతో బోరుగడ్డను ఆ జైలుకు తరలించారు.

### సెషన్స్ కోర్టుకు బదిలీ...

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దూషించిన ఘటనపై అనంతపురం 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బోరుగడ్డ అనిల్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇదివరకు బెయిల్ ఇవ్వకూడదని పోలీసులు కోర్టును కోరారు. శుక్రవారం మరోసారి ఎక్సైజ్ కోర్టులో బోరుగడ్డను హాజరు పరిచారు. ఈ కేసును న్యాయాధికారి సెషన్స్ (మహిళా) కోర్టుకు బదిలీ చేశారు.

## నాపై కేసును కొట్టివేయండి: కాంతిరాణా తాతా

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విచారణకు హాజరుకావాలని తరచూ నోటీసులు ఇస్తూ పిటిషనర్‌ను వేధిస్తున్నారని తెలిపారు. కేసులో నిందితుడిగా ఉన్న ఓ న్యాయవాదిపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ ఇదే కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తనను వేధించారని పోలీసులకు జత్వాని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఐపీఎస్ అధికారులు, పోలీసులపై కేసు నమోదయింది.

# చిత్రజ్యోతి


SINCE 1965

## ఆగస్టులో మామ



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 14న కూలీ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఈ సందర్భంగా విజిల్ వేస్తున్న రజనీకాంత్ పోస్టర్‌ను యూనిట్ షేర్ చేసింది. బంగారం అక్రమ రవాణా నేపథ్యంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్, ఉపేంద్ర, నాగార్జున కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్, హృతిక్‌రోషన్ నటించిన 'వార్ 2' చిత్రం కూడా ఆగస్టు 14న విడుదలవుతోంది.

## మేలో లెవెన్




నవీన్‌చంద్ర కథానాయకుడిగా మర్డర్ మిస్టరీ కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రం 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మే 16న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా పోలీసాఫీసర్ పాత్రలో ఉన్న నవీన్‌చంద్ర లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నవీన్‌చంద్రకు జోడీగా రేయాహరి నటించారు. డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కార్తీక్ అశోకన్.

## మంచి చిత్రాలతో మీ ముందుకొస్తా

- సంపూర్ణేశ్‌బాబు



'తెలుగుచిత్ర పరిశ్రమలో నటుడిగా 11 ఏళ్ల కెరీర్ నాది. ఎంతోమందికి రాని అవకాశం నాకు లభించినందుకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరించడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను' అని సంపూర్ణేశ్‌బాబు అన్నారు. ఆయన హీరోగా నటించిన 'సోదరా' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంపూర్ణేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ 'ఒక చిన్న పల్లెటూరి వచ్చిన నరసింహాచారి అనే వ్యక్తి ఈ రోజు సంపూర్ణేశ్‌బాబుగా మీ ముందున్నాడు అంటే దానికి కారణం 'హృదయ కాలేయం' చిత్రం. ఇకపై ప్రేక్షకులు మెచ్చే మంచి చిత్రాలు చేయాలనుకుంటున్నాను. త్వరలో 'సోదరా' చిత్రంతో మీ ముందుకు వస్తున్నాను. మరో రెండు సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి' అని చెప్పారు.




కమర్షియల్ సినిమాలు చేస్తూనే, నటనా ప్రాధాన్య పాత్రలతో మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు ధనుష్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). నిత్యామీనన్ కథానాయిక. ఆకాశ్ భాస్కర్ నిర్మిస్తున్నారు. సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, షాలిని పాండే కీలకపాత్రలు పోషిస్తున్నారు. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈనెల 10న విడుదలవ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడు కొత్త తేదీకి మారింది. అక్టోబర్ 1న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ధనుష్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వేడుకల్లో స్టెప్పులేస్తున్న ధనుష్ లుక్‌ను చిత్రబృందం షేర్ చేసింది. ఈ చిత్రంలో గ్రామీణ యువకుడి పాత్రలో ధనుష్ కనిపించనున్నారు.

## అక్టోబర్‌లో అల్లుడు

## చంద్రుడిపై అవతార్ యుద్ధం



ప్రపంచ సినీ ప్రేక్షకుల మెప్పు పొందిన హాలీవుడ్ చిత్రం 'అవతార్'. ఇప్పటికే విడుదలైన రెండు భాగాలు బాక్సాఫీసు దగ్గర ఘన విజయం అందుకున్నాయి. త్వరలో మూడో భాగం 'అవతార్: ది ఫైర్ అండ్ యాష్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుందని దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన 'అవతార్ 3' విశేషాలను మీడియాతో పంచుకున్నారు. మూడో భాగంలో కథానాయకుడు జేక్, ఆయన కుటుంబం కొత్త ప్రతినాయకులతో పోరాడతారని చెప్పారు. గతంలో పండోరా గ్రహంపైన, సముద్రంలో వారు చేసిన పోరాటాలు ప్రేక్షకులను మెప్పించగా, ఈ సారి చంద్రుడిపై జరిగే యుద్ధాన్ని చూపించబోతున్నామన్నారు. ఈ సిరీస్‌లోని గత చిత్రాలతో పోల్చితే మూడో భాగం ప్రేక్షకలను అమితంగా అలరిస్తుందని తెలిపారు. డిసెంబర్ 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఒక్కసారిగా మొదలైంది



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న కామెడీ థ్రిల్లర్ 'చౌర్యపాఠం'. దర్శకుడు నక్కిన త్రినాథరావు నిర్మిస్తున్నారు. నిఖిల్ గొల్లమారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటిస్తున్నారు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'ఒక్కసారిగా మొదలైంది కలవరం' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం వరుణ్‌తేజ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. దావ్‌జాండ్ స్వరకల్పనలో అనురాగ్ కులకర్ణి ఆలపించారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. రాజీవ్ కనకాల, అలీ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, సినిమాటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటర్: ఉత్తర



తెరపై చెరగని

# దేశభక్తి సంతకం



బాలీవుడ్ ఐకాన్.. భరత మాత ప్రేమికుడు.. మనోజ్ కుమార్ (87) ఇకలేరు. దేశభక్తి, సామాజిక సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకొని సినిమాలు తీసిన ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ముంబైలోని కోకిలాబెన్ ధీరూబాయ్ అంబానీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. దేశభక్తి ప్రధానాంశంగా ఉండే సినిమాలకు ఆయన ప్రసిద్ధి చెందడంతో ఆయనను 'భరత్ కుమార్' అని పిలిచేవారు. ఆయన నటించిన అధిక శాతం సినిమాల్లోనూ ఆయన పేరు భరత్‌కుమారే కావడం గమనార్హం. దేశభక్తి నేపథ్యంలో ఆయన చేసినన్ని సినిమాలు ఎవరూ చేయలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1960, 70వ దశకాల్లో ఆయన చేసిన సినిమాలు వెండితెరను ఏలాయి.




### దిలీప్ కుమార్ స్ఫూర్తితో



1937లో హరికృష్ణ గిరి గోస్వామి పేరుతో పంజాబీ హిందూ కుటుంబంలో అవిభక్త పాకిస్థాన్‌లో జన్మించారు ఆయన. బాలీవుడ్ దిగ్గజ నటుడు దిలీప్‌కుమార్ మీద ఉన్న అమితమైన అభిమానం ఆయనను సినిమాలవైపు నడిపించింది. 'షబ్నమ్' సినిమాలో దిలీప్‌కుమార్ పాత్ర పేరు మనోజ్‌కుమార్. ఆ పేరునే తన స్ర్కీన్‌నేమ్‌గా పెట్టుకున్నారు. 1957లో 'ఫ్యాషన్' అనే చిత్రంతో నటుడిగా కెరీర్‌ను మొదలుపెట్టారు ఆయన. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినా అంతగా గుర్తింపు రాలేదు. 1961లో విడుదలైన 'కాంచ్ కీ గుడియా' చిత్రంలో తొలిసారి లీడ్ రోల్‌లో నటించారు. 1962లో విడుదలైన 'హరియాలీ ఔర్ రాస్తా' సినిమా ఆయనకు నటుడిగా మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది.

### 'షాహిద్'తో మొదలు

మనోజ్‌కుమార్ దేశభక్తి ప్రధానంగా చేసిన చిత్రాలలో మొదటి చిత్రం 'షాహిద్'. 1965లో విడుదలైంది. స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి మన్ననలు పొందింది. ఆ తర్వాత 1967లో విడుదలైన 'ఉప్‌కార్' అనే సినిమాతో ఆయన దర్శకుడిగా మారారు. ఈ సినిమాలో రైతుగా, సైనికుడిగా రెండు పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. 'పురబ్ ఔర్ పశ్చిమ్', 'రోటి కపడా మకాన్', 'క్రాంతి' వంటి సందేశాత్మక చిత్రాలతో మరింత స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు. ఆయన చేసిన పలు సినిమాలు ఇతర భాషల్లో రీమేకై ప్రజాదారణ పొందాయి. తెలుగులో టాప్ స్టార్స్ అయిన ఎన్టీఆర్ (ఒకే కుటుంబం), కృష్ణ (పాడిపంటలు), శోభన్‌బాబు (జీవన పోరాటం) ఆయన సినిమాలను రీమేక్ చేయడం విశేషం. 1972లో తండ్రీ కొడుకుల అనుబంధం ఆధారంగా తెరకెక్కిన 'షోర్' చిత్రం ఆయన దర్శకత్వం వహించిన చిత్రాల్లో అత్యుత్తమైనదని చాలామంది అభిప్రాయపడతారు. ఆయన నటించిన, దర్శకత్వం వహించిన చిత్రాలన్నింటిలోనూ ప్రేక్షకులను విశేషంగా అలరించిన హిట్ సాంగ్స్ ఉండడం విశేషం. 'ఓ కౌన్ థీ' చిత్రంలోని పాపులర్ మెలోడీ 'లగ్ జా గలే' పాటను ఇటీవలే విడుదలైన సల్మాన్‌ఖాన్ 'సికందర్'లోనూ రీమిక్స్ చేశారు.

### బాల్యంలో సినిమా కష్టాలు

అగ్ర శ్రేణి నటుడు, దర్శకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన మనోజ్‌కుమార్‌కు చలన చిత్ర రంగ ప్రవేశం, గుర్తింపు అంత సులభంగా దక్కలేదు. దేశ విభజన జరిగిన సమయంలో ఎన్నో కష్టాలను ప్రత్యక్షంగా ఎదుర్కొన్నారు ఆయన. తన కుటుంబంతో కలసి తొమ్మిదేళ్ల వయసులో ఢిల్లీ శివార్లలో శరణార్థ శిబిరాల్లో గడిపారు. ఆ సమయంలో చూసిన సంఘటనలే ఆయనలో బలంగా నాటుకుపోయి ఆ తర్వాత దేశ భక్తి నేపథ్యంలో సినిమాలు చేయడానికి ప్రేరణనిచ్చాయి.



నటుడిగా, దర్శకుడిగా, స్ర్కీన్‌ప్లే రచయితగా ఓ వెలుగు వెలిగిన ఆయన్ను ఎన్నో పురస్కారాలు వరించాయి. 1992లో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 2015లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకున్నారు. సినిమాల నుంచి విరామం తీసుకున్నాక బీజేపీలో చేరిన ఆయన.. ఎటువంటి పదవీ లేకుండానే కొనసాగారు.

### తరతరాలకూ ఆదర్శం

మనోజ్‌కుమార్ మృతిపట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. "బాలీవుడ్ ఐకాన్ మనోజ్‌కుమార్ మరణం బాధాకరం. దేశభక్తి ప్రధానంగా ఆయన చేసిన సినిమాలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి" అని ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "వెండితెరపై ఆయన పోషించిన పాత్రలు ఎప్పటికీ మన మనసుల్లో నిలిచిపోతాయి" అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. "జాతీయ భావాలు గల మహోన్నత వ్యక్తి మనోజ్ కుమార్. దేశ భక్తి నేపథ్యంలో ఆయన చేసిన పలు సినిమాలు ఎంతో స్ఫూర్తిని అందిస్తాయి. 'ఉప్‌కార్' సినిమాను ఇప్పుడు చూసినా, ఆనాటి 'జై జవాన్ జై కిసాన్' నినాద నేపథ్యాన్ని, ప్రభావాన్ని గుర్తుకుతెస్తాయి" అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన మృతి బాలీవుడ్‌కు తీరని లోటు అని.. దర్శకులు మధుర్ బండార్కర్, జోయా అక్తర్, వివేక్ అగ్నిహోత్రి, హన్సల్ మెహతా, హీరోలు ఆమిర్ ఖాన్, సల్మాన్‌ఖాన్, అక్షయ్‌కుమార్, అజయ్ దేవగణ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. నేటి ఉదయం ముంబైలో మనోజ్ కుమార్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



కోనసీమ జిల్లాకు చెందిన ప్రముఖ శిల్పి రాజ్‌కుమార్ చేతిలో ప్రాణం పోసుకున్న ప్రముఖుల విగ్రహాలు



సీఎం చంద్రబాబు తుది మెరుగులు దిద్దిన బుద్ధుని చిత్రపటాన్ని రూ.1,01,116కు కొనుగోలు చేసిన రఘురామకృష్ణరాజు


‘అమరావతి చిత్రకళా వీధి’

# అబ్బురం.. అద్భుతం

## కళాకారుల సృజనాత్మకత భేష్ .. ప్రదర్శన ప్రారంభోత్సవంలో రఘురామ

## సాంస్కృతిక వైభవాన్ని ముందుకు తీసుకెళ్తాం: కందుల దుర్గేశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి అయిన రాజమహేంద్రవరంలో ‘అమరావతి చిత్ర కళా వీధి’ ప్రదర్శనను అద్భుతంగా ఏర్పాటు చేశారని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ప్రశంసించారు. కళాకారుల సృజనాత్మకత అబ్బురమనిపిస్తోందన్నారు. శుక్రవారం మంత్రి కందుల దుర్గేశ్‌తో కలిసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఏర్పాటు చేసిన పెయింటింగ్స్, చెక్క బొమ్మలు, విగ్రహాలు, వస్తువులను ఆసక్తిగా తిలకించారు. రఘురామ మాట్లాడుతూ.. సాంస్కృతిక శాఖ మంత్రిగా దుర్గేశ్‌ను, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్‌గా తేజస్వి పొడపాటిని నియమించిన రోజునే రాష్ట్రంలో కళలు, సంస్కృతికి మంచిరోజులు వచ్చాయనే నమ్మకం కలిగిందని, ఈ రోజు నిజమైందని అన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. ఇదే ఉత్సాహంతో రాష్ట్రంలో కళలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం రావాలని అనుకున్నారని, అనివార్య కారణాల వల్ల రాలేకపోయారని తెలిపారు. గత ప్రభుత్వంలో సంస్కృతి, అభివృద్ధిపరంగా పూర్తిగా నిర్లక్ష్యం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మరోవైపు బీజేపీ నాయకత్వం కలిసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తేజస్వి పొడపాటి పేర్కొన్నారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్, వివిధ ఆకృతులను తిలకించిన రఘురామకృష్ణరాజు.. సీఎం చంద్రబాబు తుది మెరుగులు దిద్దిన బుద్ధుని చిత్రపటాన్ని రూ.1,01,116కు కొనుగోలు చేశారు.



రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనలో ఆకట్టుకున్న ఓ చిత్రం

### పులకించిన గోదావరి తీరం

అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనతో గోదావరి తీరం పులకించింది. సెంట్రల్ జైలు రోడ్డు వందలాది చిత్రపటాలతో పాటు మట్టి, ఫైబర్, కాగితం తదితర వస్తువులతో చేసిన ఆకృతులు, చెక్క శిల్పాలతో నిండిపోయింది. కాంచీపురం వాటర్ కలర్ పెయింటింగ్స్, ఫ్యాబ్రిక్ రద్దు నుంచి చేసిన ఉపకరణాలు, ఇసుక, చిరుధాన్యాలతో చేసిన ఆకృతులు, రావి ఆకులపై చరిత్రకారుల చిత్రాలు, నిర్మల్ పెయింటింగ్స్ ప్రదర్శించారు.

## ఏపీలో ఉండాల్సిందే

- వాణీ ప్రసాద్‌కు క్యాట్‌లో చుక్కెదురు
- స్థానికత ఆంధ్ర... కాబట్టి ఆ రాష్ట్ర కేడర్‌లోనే ఉండాలి



అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఏపీ కేడర్‌కు వచ్చిన ఐఏఎస్ అధికారిణి వాణీప్రసాద్‌కు మరోసారి క్యాట్‌లో చుక్కెదురయింది. తనను తెలంగాణ కేడర్‌కు పంపాలంటూ ఆమె మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌ను ట్రిబ్యునల్ కొట్టేసింది. ఆమె స్థానికత ఆధారంగా ఏపీలోనే పనిచేయాలని స్పష్టం చేసింది. వాణీ ప్రసాద్ రెండోసారి దాఖలు చేసిన పిటిషన్‌లో... ‘నేను చిన్నతనం నుంచి తెలంగాణలోనే పెరిగాను. అక్కడే చదువుకున్నా. కాబట్టి నన్ను తెలంగాణ కేడర్‌కు కేటాయించండి’ అని విజ్ఞప్తి చేశారు. ఆమె పిటిషన్‌ను పరిశీలించిన ట్రిబ్యునల్... ‘రాష్ట్ర విభజన అనంతరం, ఆ తర్వాత వివిధ కమిటీలు, డీవోపీటీ జారీ చేసిన ఉత్తర్వులను పాటించాలి. మీ తండ్రి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి. కాబట్టి మీ స్థానికత ఏపీనే. అందుకనే మీరు అక్కడే విధులు నిర్వహించాలి. పీయూష్ సిన్హా కమిటీ, ఖండేకర్ కమిటీ రికమండేషన్‌ను పాటించాలి’ అని పేర్కొంది.

### ఐఎఫ్ఎస్ కల్లోల్ బిస్వాస్‌పై అభియోగాలు ఉపసంహరణ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విశ్రాంత డివిజినల్ అటవీ అధికారి కల్లోల్ బిస్వాస్‌పై ఉన్న అభియోగాలను ప్రభుత్వం ఉపసంహరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గాలి జనార్దన్ రెడ్డి మైనింగ్ వ్యవహారంలో ఈయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో బిస్వాస్ అప్పట్లో వార్తల్లోకి ఎక్కారు. ఆ తర్వాత నర్సీపట్నం డీఎఫ్ఓగా విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం ఆయనపై అభియోగాలు నమోదు చేసింది. విచారణాధికారిని నియమించింది. అయితే అభియోగాలేవీ నిరూపణ కాకపోవడంతో ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

### జగన్ బాటలోనే చంద్రబాబు

- అధిక ధరలకు విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలకు సిద్ధం
- యాక్సిస్‌తో అగ్రిమెంట్లను రద్దు చేయాలి: సీహెచ్ బాబూరావు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ బాటలోనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నడుస్తోందని సీపీఎం ఆరోపించింది. కర్నూలులో శుక్రవారం యాక్సిస్ పవర్‌తో డిస్కమ్‌లు కొనుగోలు ఒప్పందాన్ని చేసుకుంటున్న తరుణంలో ప్రజాభిప్రాయ సేకరణను ఏపీఈఆర్‌సీ చేపట్టింది. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పంద ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించాలని కోరారు. అదేవిధంగా రూ.15,485 కోట్ల ఇంధన సర్దుబాటు భారాన్ని రద్దు చేయాలని ఈఆర్‌సీని కోరారు. సెకీ, అదానీ ఒప్పందాలను రద్దు చేసే చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం ప్రదర్శించాలని డిమాండ్ చేశారు.

### మాజీ ఎంపీ హర్షకుమార్‌పై కేసు

- పాస్టర్ మృతిపై నిరాధార ఆరోపణలు

రాజానగరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. రాజానగరం ఎస్ఐ నాగార్జున కేసు వివరాలను విలేకరులకు తెలియజేశారు. ‘పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై హర్షకుమార్ ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. వాటికి తగ్గ ఆధారాలు చూపించాలని అడిగితే ఇంతవరకు చూపించలేదు. దీంతో 196, 197 సెక్షన్ల కింద హర్షకుమార్‌పై కేసు నమోదు చేశాం’ అని ఎస్ఐ చెప్పారు.

### కందుకూరి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- కళా, నాటక రంగాలకు ప్రాధాన్యం: దుర్గేష్

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కళా, నాటక రంగాలకు కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యతనిస్తున్నామని, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరి అవార్డుల అంశాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు, నాటక రంగంలో కృషి చేసిన వారికి రాష్ట్రస్థాయిలో కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగ స్థల పురస్కారం, జిల్లాస్థాయిలో కందుకూరి విశిష్ట పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అవార్డులకు అర్హులైన రచయితలు, దర్శకులు, కళాకారులు సాంకేతిక నిపుణులు ఏప్రిల్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో జిల్లాస్థాయిలో అవార్డులు అందుకున్న వారు ఇప్పుడు రాష్ట్రస్థాయిలో అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. త్వరలో నంది నాటకోత్సవాల నిర్వహణకు విధివిధానాలను ఖరారు చేస్తామని మంత్రి తెలిపారు.

### 3రోజుల పర్యటనకు శ్రీలంక చేరుకున్న మోదీ

కొలంబో, ఏప్రిల్ 4: ప్రధాని మోదీ శ్రీలంక చేరుకున్నారు. బ్యాంకాక్‌లో బిమ్‌స్టెక్ సదస్సు పూర్తి చేసుకుని కొలంబో చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో శ్రీలంక మంత్రులు ఘన స్వాగతం పలికారు. 3రోజుల పర్యటనలో భాగంగా మోదీ శ్రీలంక అధ్యక్షుడు అనురతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. రక్షణ, డిజిటల్, ఇంధన భద్రత తదితర రంగాల్లో రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. పర్యటనలో భాగంగా భారత సహకారంతో నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులను మోదీ ప్రారంభిస్తారు. శాంపూర్ సౌరశక్తి ప్రాజెక్టు స్థలాన్ని సందర్శిస్తారు. 6న మోదీ దిస్సనాయకేతో కలిసి అనురాధపురాలోని మహాబోధి ఆలయాన్ని సందర్శిస్తారు.

# పెద్దల సభలోనూ అలవోకగా..!

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. 128-95 ఓట్ల తేడాతో విజయం

- అర్ధరాత్రి 2 గంటలకు ఓటింగ్
- మద్దతిచ్చిన ఐదుగురు బీజేడీ ఎంపీలు
- వైసీపీ సభ్యుడు నత్వానీ కూడా!
- శరద్ పవార్, శిబూ సోరెన్ గైర్హాజరు
- విదేశాంగ మంత్రి జైశంకర్, మ్యాస్ట్రో ఇళయరాజా కూడా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై రాజ్యసభలో బీజేపీకి కష్టాలు తప్పవన్నారు.. ఎన్డీయేకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉందని.. నామినేటెడ్, స్వతంత్ర సభ్యుల మద్దతుతో బొటాబొటీ ఆధిక్యంతో విజయం సాధించవచ్చని అంచనా వేశారు. అయితే ఈ అంచనాలను బీజేపీ తలకిందులు చేసింది. బిల్లుకు 128 మంది సభ్యుల మద్దతును కూడగట్టుకుంది. వీరిలో ఐదుగురు బీజేడీ ఎంపీలు, వైసీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ కూడా ఉన్నారు. ఇంకోవైపు.. ప్రతిపక్షాలకు 33 ఓట్లు తక్కువగా కేవలం 95 ఓట్లే వచ్చాయి. అయితే తాము విప్ జారీ చేశామని, తమ పార్టీ ఎంపీలంతా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారని వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి చెప్పుకొంటున్నప్పటికీ.. నత్వానీ మద్దతుగా ఓటేసినట్లు విస్పష్టంగా తెలిసింది. ఆయన బటన్ నొక్కి వేసిన ఓటు తొలుత నమోదు కాలేదని.. తర్వాత కాగితం తెప్పించుకుని ఓటు వేశారని కొందరు ఎంపీలు చెప్పారు. బీజేపీ వర్గాలు కూడా ఆయన బిల్లుకు మద్దతిచ్చారని చెప్పడం గమనార్హం. బిజూ జనతాదళ్(బీజేడీ) రాజ్యసభా పక్ష నేత సస్మిత్ పాత్రా సభలో స్వయంగా బిల్లుకు మద్దతు ప్రకటించడం, తమ సభ్యులకు విప్ జారీచేయకపోవడం విశేషం. ఆయనతోపాటు ఐదుగురు బీజేడీ ఎంపీలు ఓటేశారు. ఒకరు మాత్రం గైర్హాజరయ్యారు. ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, జేఎంఎం అగ్రనేత శిబూ సోరెన్ అనారోగ్య కారణాలతో సభకు రాలేదు (పవార్ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలు లోక్‌సభలోనూ ఓటింగ్‌లో పాల్గొనలేదు. జేపీసీ సభ్యుడిగా ఉన్న ఆ పార్టీ ఎంపీ సురేశ్ మాత్రే కమిటీ సమావేశాలకే హాజరు కాలేదు). రాజ్యసభలో ఏ కూటమికీ చెందని ఎంపీలు 23 మంది ఉండగా.. వారిలో అత్యధికులు ఓటింగ్‌లో పాల్గొనలేదు. కేవలం ఏడుగురే బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసినట్లు తెలుస్తోంది. రాజ్యసభలో 9 ఖాళీలు ఉండగా.. సభలో 236 మంది మిగిలారు. వీరిలో 128 మంది బిల్లుకు మద్దతుగా ఓటు వేయడం.. 13 మంది గైర్హాజరు కావడం బీజేపీ ఎన్నికల నిర్వహణ చాతుర్యాన్ని తెలియజేస్తోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రత్యర్థి పార్టీల ఎంపీలతో పలు సార్లు మంతనాలు జరిపినట్లు సమాచారం.

### ఎన్డీయే ఓటింగ్ ఇలా..

గురువారం అర్ధరాత్రి దాటాక 2 గంటలకు సభలో ఓటింగ్ జరిగింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. బీజేపీకి రాజ్యసభలో 98 మంది సభ్యులుండగా.. 97 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విదేశీ పర్యటనలో ఉన్నందున సభకు రాలేదు. జేడీయూ-4, ఎన్సీపీ(అజిత్ పవార్)-3, టీడీపీ-2.. ఏజీపీ, ఎంఎన్ఎఫ్, ఎన్‌పీపీ, యూపీపీఎల్, జేడీఎస్, ఆర్ఎల్‌డీ, ఆర్‌పీఐ (అథావలే), శివసేన (షిండే), ఆర్ఎల్ఎం పార్టీలకు చెందిన ఒక్కో ఎంపీ బిల్లుకు మద్దతిచ్చారు. ఆరుగురు నామినేటెడ్ సభ్యుల్లో ఐదుగురు అనుకూలంగా ఓటేయగా.. ప్రముఖ సంగీత దర్శకుడు ‘మ్యాస్ట్రో’ ఇళయరాజా గైర్హాజరయ్యారు. ఓ స్వతంత్ర సభ్యుడు కూడా అధికార కూటమికి మద్దతు పలికారు. వక్ఫ్ బిల్లుకు బిహార్ సీఎం నితీశ్‌కుమార్ మద్దతివ్వడం ఆయన పార్టీ జేడీయూలో తీవ్ర విభేదాలకు దారితీసినా.. ఎంపీలంతా ఆయన మాటకే కట్టుబడి అనుకూలంగా ఓటేశారు. ప్రభుత్వం తమ సందేహాలను నివృత్తి చేసిందని, తాము ప్రతిపాదించిన సవరణలను ఆమోదించిందని రాజ్యసభలో ఆ పార్టీ నేత సంజయ్ ఝా చెప్పారు.



రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుక్ చేసుకోవడంపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని, ఉన్నతాధికారులు

## 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్

- స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించిన మంత్రి అనగాని
- 26 జిల్లా ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి
- స్లాట్ లేకపోతే... సాయంత్రం 5 గంటలు తరువాతే అవకాశం
- 2 నెలల్లో రాజముద్రతో రైతుకు పాసు పుస్తకాలు: సత్యప్రసాద్
- ఫేస్, పేపర్, క్యాష్ లెస్ రిజిస్ట్రేషన్లే లక్ష్యం: సిసోడియా

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్ సేవలను శుక్రవారం సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. స్లాట్ బుకింగ్ అవగాహన కరపత్రాన్ని, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ‘ప్రజలకు సౌకర్యవంతంగా, సులభతరంగా సేవలు అందించాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించాం. రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఇందుకోసం ప్రత్యేక మాడ్యూల్‌ను ఏర్పాటు చేశాం. దీంతో వినియోగదారులు తమకు వీలున్న రోజు, వీలైన సమయాన్ని ఎంచుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఈరోజు నుంచి మొత్తం 26 జిల్లా ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. మొత్తం 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ పద్ధతి దశలవారీగా అమలులోకి వస్తుంది. ఇప్పటికే గాంధీనగర్, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశాం. ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. డాక్యుమెంటు తయారు చేసుకోవడం, దానిని అప్‌లోడ్ చేసుకోవడం, తప్పులు ఉంటే వెరిఫై చేసుకోవడం, చలానా కట్టడం... అన్నీ స్వయంగా ఆన్‌లైన్‌లో వినియోగదారుడే చేసుకోవచ్చు. పై పనులన్నీ పూర్తి చేసుకున్న తరువాత స్లాట్ బుక్ చేసుకుంటే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ చేసుకోలేక పోయిన వారు సాయంత్రం 5 గంటల తరువాత నేరుగా కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్ చేస్తాం. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక ఫీజు రూ.5,000 తీసుకొని రిజిస్ట్రేషన్ చేస్తాం. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా 3 రోజులు సెలవులు వచ్చాయి. ఆ రోజుల్లో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.74 కోట్లు ఆదాయం వచ్చింది. ఆటోమ్యూటేషన్‌ను సులభతరం చేయడానికి రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌ను రెవెన్యూ డేటాబేస్‌తో అనుసంధానం చేశాం. పురపాలక, పట్టణాభివృద్ధి(ఎంఏయూడీ), డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) తదితర శాఖలతోనూ అనుసంధానం ప్రారంభించాం. ఈ ప్రక్రియ 2025, ఏప్రిల్ 15 నాటికి పూర్తవుతుంది. దీంతో డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్ల సృష్టి లాంటి రియల్ ఎస్టేట్ మోసాలను నివారించేందుకు వీలవుతుంది. అభివృద్ధికి ఆటంకంగా, భూ యజమానులకు ఇబ్బందిగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేస్తున్నాం. 2024-25 ఏడాదికి రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గిందని జగన్ అవినీతి పత్రిక వార్తలు రాసింది. డబ్బు కోసం గడ్డితినే ప్రభుత్వం మాది కాదు. రెండు నెలల్లో రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తాం’ అని మంత్రి అనగాని చెప్పారు. రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా మాట్లాడుతూ... ‘రిజిస్ట్రేషన్ల శాఖలో వరుసగా తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా అవినీతి తగ్గి, పారదర్శకత పెరుగుతుంది. రానున్న రోజుల్లో ఫేస్ లెస్, పేపర్ లెస్, క్యాష్ లెస్‌గా రిజిస్ట్రేషన్లు జరపాలనేది మా లక్ష్యం’ అని తెలిపారు.

# వంద శాతం కచ్చితత్వం

## సర్కాడియాన్ ఏఐ యాప్‌తో గుండె జబ్బుల పరీక్షలు

- గుంటూరు, విజయవాడ ప్రభుత్వాస్పత్రుల్లో పైలట్ ప్రాజెక్ట్
- యాప్‌తో వ్యాధి గుర్తించిన వారికి సంప్రదాయ పరీక్షల్లోనూ నిర్ధారణ



సిద్ధార్థ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల నిర్ధారణకు ఓ బాలుడు రూపొందించిన సర్కాడియాన్ యాప్‌పై సంశయాలు తొలగిపోయాయి. ఆ యాప్ వంద శాతం కచ్చితత్వంతో పని చేస్తోందని స్పష్టమైంది. ఇటీవల ఏఐ నిపుణుడు సిద్ధార్థ్ నంద్యాల అనే ఎన్నారై విద్యార్థి 7 సెకన్లలో గుండె జబ్బును నిర్ధారించే ఏఐ ఆధారిత సర్కాడియాన్ యాప్‌తో గుండె పరీక్షలు నిర్వహించి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ యాప్ పనితీరు తెలుగురాష్ట్రాల్లో చర్చనీయాంశం అయింది. వైద్య వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య విద్యా శాఖ అనుమతితో గుంటూరు, విజయవాడ ప్రభుత్వాస్పత్రుల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద కార్డియాలజీ ఓపీ విభాగాలకు వచ్చే రోగులకు ఈ యాప్‌తో గుండె స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మార్చి 29 నుంచి 31 వరకు, గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఏప్రిల్ 1 నుంచి 3 వరకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. విజయవాడలో 992 మంది రోగులను పరీక్షించగా వీరిలో 19 మందికి గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు యాప్ నిర్ధారించింది. ఈ 19 మంది రోగులను కార్డియాలజీ వైద్య బృందం ఈసీజీ, 2డి ఎకో పరీక్షలతో మరోసారి వార్డులో పరీక్షలు జరిపింది. ఆశ్చర్యకరంగా మొత్తం 19 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు తేలింది. గుంటూరు జీజీహెచ్‌లో 863 మందికి స్క్రీనింగ్ చేయగా, వీరిలో 16 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు సర్కాడియాన్ యాప్ తేల్చింది. అయితే అందులో నలుగురు వైద్య బృందం పరీక్షలకు హాజరుకాకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు. మిగిలిన 12మందికి కార్డియాలజిస్టుల ఆధ్వర్యంలో ఈసీజీ, ఎకో పరీక్షలు చేయగా, ఆ 12 మందికి జబ్బు నిర్ధారణ అయ్యింది.

### స్క్రీనింగ్ పరీక్షలకు ఎంతో ఉపయోగం

- ఆరు రోజుల్లో గుంటూరు, విజయవాడ ప్రభుత్వాస్పత్రుల్లో మొత్తం 1,855 మంది ఓపీ రోగులకు సర్కాడియాన్ యాప్‌తో స్క్రీనింగ్ నిర్వహించారు. 35 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు యాప్ తేల్చింది. తదుపరి వైద్య పరీక్షలకు హాజరైన 31 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ అయింది.
- వంద శాతం కచ్చితత్వంతో సర్కాడియాన్ ఏఐ యాప్ పని చేస్తోందని, ఈ టూల్ గుండెజబ్బుల స్క్రీనింగ్ పరీక్షలకు చక్కగా సరిపోతుందని విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎ.వి.రావు ప్రశంసించారు.
- యాప్‌పై సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసిన గుంటూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి శుక్రవారం సర్కాడియాన్ యాప్ రూపకర్త, ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ఏఐ నిపుణుడు సిద్ధార్థ్ నంద్యాలను సన్మానించారు.
- ఈ రెండు ఆసుపత్రుల్లోని పైలట్ ప్రాజెక్ట్ నివేదికను ఆరోగ్య శాఖకు అందజేస్తామని సిద్ధార్థ్ తండ్రి మహేశ్ తెలిపారు.

# ప్రధాన అర్చకుడిగా నియమించాలని ఆదేశించలేం

- ఫలానా ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని హక్కుగా కోరలేరు
- బదిలీచేసే అధికారం టీటీడీదే
- అర్చకుడు శ్రీనివాస దీక్షితులు పిటిషన్‌పై హైకోర్టు వ్యాఖ్యలు
- వ్యాజ్యాన్ని కొట్టేసిన న్యాయమూర్తి



అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో శ్రీవారి ప్రధాన అర్చకుడిగా తనను నియమించేలా టీటీడీ ఈవోను ఆదేశించాలని కోరుతూ అర్చకుడు శ్రీనివాస దీక్షితులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం చేసే బదిలీలకు సంబంధించిన కేసులలో న్యాయస్థానాల సమీక్ష పరిధి పరిమితమని స్పష్టం చేసింది. ఫలానా ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని పిటిషనర్ హక్కుగా కోరలేరని తేల్చి చెప్పింది. పరిపాలన అవసరాలకు అనుగుణంగా బదిలీలపై నిర్ణయం తీసుకొనే అధికారం యజమానికే ఉంటుందని తెలిపింది. బదిలీని దురుద్దేశంతో ఏకపక్షంగా చేసినట్లు నిరూపించకపోతే న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని పేర్కొంది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి ఇటీవల తీర్పు ఇచ్చారు. తనను శ్రీవారి ప్రధాన అర్చకుడిగా నియమించాలని కోరుతూ ఇచ్చిన వినతిని ఈవో తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ శ్రీనివాస దీక్షితులు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈయన తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా ఉన్నారు. అయితే.. తాను పెద్దింటి కుటుంబానికి చెందిన అర్చకుడినని, తమ కుటుంబానికి చెందినవారికి ఐదేళ్లుగా శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా చేసేందుకు అవకాశం లభించలేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. టీటీడీ ఈవో కౌంటర్ దాఖలు చేస్తూ.. ఫలానా చోట పోస్టింగ్ ఇవ్వాలని కోరే హక్కు పిటిషనర్ కోరలేరని తెలిపారు. తిరుమలలో అర్చకుడిగా చేస్తున్న పిటిషనర్‌కు తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ ప్రధాన అర్చకుడిగా నియమించామన్నారు. మూడు నెలల్లోనే శ్రీవారి దేవస్థానంలో పోస్టింగ్ కోరుతూ వినతిపత్రం సమర్పించారని, అర్చకులకు ఉన్న అనుభవం, దేవస్థానాలలో అవసరాలకు అనుగుణంగా పెద్దింటివారి, తిరుపతమ్మవారి, గొల్లపల్లివారి, పైడిపల్లివారి కుటుంబాలకు చెందిన అర్చకులను ఆయా దేవాలయాల్లో నియమిస్తామని వివరించారు. ఈ వివరాలను న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకుని.. వ్యాజ్యాన్ని కొట్టివేశారు.




### పబ్లిక్‌గా బెట్టింగ్ యాప్ ప్రచారం!

పౌరుల ప్రాణాలు బలి తీసుకుంటున్న బెట్టింగ్ యాప్‌లపై పొరుగు రాష్ట్రం తెలంగాణలో యుద్ధం ప్రకటించారు. బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై అక్కడి సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. అయితే, ఇదే సమయంలో మన రాష్ట్రంలో మాత్రం బెట్టింగ్ యాప్‌ల ప్రచారం బహిరంగంగానే సాగుతోంది. ఇందుకు నిదర్శనమే ఈ హోర్డింగ్. విజయవాడ నడిబొడ్డులో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద భారీ స్థాయిలో ఉన్న బెట్టింగ్ యాప్ హోర్డింగ్.



### నేటి నుంచి కోదండరామయ్య బ్రహ్మోత్సవాలు

రాజంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా భద్రాద్రి ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జరగనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. 6వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం, 11 గంటలకు పోతన జయంతి సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సీతారాముల కల్యాణం 11వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 14వ తేదీ ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 15వ తేదీ సాయంత్రం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ కాంతులలో వెలుగులీనుతున్న ఒంటిమిట్టలోని కోదండ రామాలయం



కాకినాడ జిల్లా గొల్లప్రోలులో ఎమ్మెల్సీ నాగబాబు తన కాన్వాయ్‌లో అన్నాక్యాంటీన్ ప్రారంభానికి వెళ్లే సమయంలో పోటాపోటీ నినాదాలు చేస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

## పిఠాపురంలో నాగబాబు పర్యటన

**అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన జనసేన ఎమ్మెల్సీ**



గొల్లప్రోలులో అన్నక్యాంటీన్ ప్రారంభించి భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు శుక్రవారం పర్యటించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి ఆయన నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా గొల్లప్రోలులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. గొల్లప్రోలులోని మెయిన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం పలువురికి మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నాగబాబు పర్యటనలో టీడీపీ, జనసేన కార్యకర్తలు పోటా పోటీ నినాదాలు చేశారు. టీడీపీ శ్రేణులు 'జై వర్మ' అని నినదించడంతో జనసేన కార్యకర్తలు 'జై జనసేన, జై పవన్‌కల్యాణ్' నినాదాలు చేశారు. 150 మందికిపైగా పోలీసులతో అధికారులు భద్రత కల్పించారు.

## 'వైసీపీ' ఆఫీసుకు టూలెట్ బోర్డు!







ఇది ఒకప్పటి వైసీపీ ప్రధాన కార్యాలయం. తాడేపల్లిలో ఉండే ఈ బహుళ అంతస్తుల భవంతి జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కళకళలాడింది. వైసీపీ అధికారం కోల్పోగానే ఈ భవంతిని ఖాళీ చేసిన ఆ పార్టీ నేతలు తమ ప్రధాన కార్యాలయాన్ని జగన్ నివాసం ప్రాంగణంలోకి మార్చివేశారు. ఈ క్రమంలో తాజాగా ఈ భవంతికి టూలెట్ బోర్డు పెట్టేశారు.

## ప్రతి నియోజకవర్గానికీ

# మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

(మొదటి పేజీ తరువాయి)



సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయన్నారు. మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని సూచించారు. ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలన్నారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. విద్య, వైద్య రంగాలు తమ ప్రాధాన్యాలని, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలందేలా చూడాలన్నారు. క్యాన్సర్ స్ర్కీనింగ్ ప్రక్రియపైనా సీఎం సమీక్షించారు. రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడం, కొత్తగా మరో 13 డ్రగ్ డీ-ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీల్లో వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. విజయనగరంలో కొత్తగా 8 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయాలసిస్ మెషిన్లు పెంచాలని, కొవ్వూరు-నిడదవోలు సీహెచ్‌సీలు అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు.

### కుప్పంలో డిజిటల్ సర్వేపై ఆరా

కుప్పంలో అమలు చేస్తున్న డిజిటల్ సర్వే సెంటర్ పురోగతిని సీఎం అడిగి తెలుసుకున్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ఇది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ సర్వే సెంటర్ దోహదపడతుందని చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యధికంగా 4.47 కోట్ల మందికి రాష్ట్రంలో అభా కార్డులు జారీ అయ్యాయని, టీబీ ఎలిమినేషన్ కింద 82,693 మంది గిరిజనులకు ప్రత్యేకంగా స్ర్కీనింగ్ చేయగా 5,072 మందికి పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. 10,11,461 మంది గిరిజనులకు స్ర్కీనింగ్ చేయగా 1977 మందికి సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్‌గా తేలిందన్నారు. రాష్ట్రంలో 95.60 శాతం జనన, మరణాల నమోదు జరిగిందని, 13,26,621 శిశు ఆధార్‌లు జారీ అయ్యాయని వివరించారు.

### సీఎంను కలిసిన బాల పురస్కార్ గ్రహీత

- జెస్సీరాజ్‌ను అభినందించిన చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు గ్రహీత జెస్సీరాజ్ సీఎం చంద్రబాబును శుక్రవారం సచివాలయంలో కలిశారు. ఇటీవల తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ తైవాన్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తాను సాధించిన విజయాలను సీఎంకు వివరించారు. ఈ పోటీల్లో జెస్సీరాజ్ రెండు బంగారు, ఒక వెండి, ఒక కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. జెస్సీ రాజ్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించిన సీఎం ఆమెను అభినందించారు.

### బర్డ్ ఫ్లూతో జాగ్రత్త

- ముందస్తు చర్యలు తీసుకోండి
- కేసులు, మరణాలు నమోదు కాకూడదు
- నరసరావుపేటలో బాలిక మృతిపై ఐసీఎంఆర్ బృందం అధ్యయనం
- వారితో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలతో కేసులు, మరణాలు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. నరసరావుపేటలో బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలతో ఇటీవల బాలిక మృతి చెందిన ఘటనపై అధ్యయనం కోసం రాష్ట్రానికి వచ్చిన ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ప్రతినిధుల బృందంతో శుక్రవారం సచివాలయంలో సమీక్ష చేశారు. నరసరావుపేటలో పర్యటన అనంతరం సీఎంను కలిసిన ఐసీఎంఆర్ బృందం బాలిక మృతికి గల కారణాలను వివరించింది. బాలిక నుంచి సేకరించిన నమూనాల్లో హెచ్5ఎన్1 లక్షణాలు బయటపడినప్పటికీ, ఇతర అనారోగ్య కారణాలు కూడా బాలిక మృతి చెందడానికి దారి తీశాయని బృందం సభ్యులు చెప్పారు. ఉడికించిన మాంసం తినడం, చిన్నారి కావడంతో వ్యాధి నిరోధక శక్తి లేకపోవడం, లెప్టోస్పిరోసిస్, అపరిశుభ్ర వాతావరణం కూడా మృతికి కారణాలుగా తమ అధ్యయనంలో తేలిందన్నారు. ప్రస్తుతం ఆ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని చెప్పారు. దీనిపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని భరోసా ఇచ్చారు. ఇలాంటి వాటిపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో యాంటీవైరల్ డ్రగ్స్ సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.

## మోసగాడు ఈ మేనమామ


- మేనల్లుడు, మేనకోడలి ఆస్తులు కాజేసే యత్నం
- ఆస్తుల్లో ఎవరికి ఏవి అనేది తేల్చిన ఎంవోయూ
- దానిపై నాడు సంతకం చేసి.. ఇప్పుడు వెనక్కి.
- ఇచ్చిన షేర్లు కూడా తిరిగి ఇమ్మంటున్నాడు
- మోదీకి నాడు దత్తపుత్రుడిలా వ్యవహరించిన జగన్
- అందుకే పోలవరాన్ని బీజేపీ చంపేసినా మౌనం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేతపత్రం ఇవ్వాలి
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్



అమరావతి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, తన సోదరుడు వైఎస్ జగన్‌ను తిట్టడం కోసమే తాను రాజకీయాల్లో కొనసాగడంలేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసమే నేను రాజకీయాల్లో ఉన్నాను. కానీ, దీనికి భిన్నంగా నా విషయంలో కవరేజీ ఇస్తున్నారు. ఇది బాధాకరం." అని ఆమె తెలిపారు. ఆస్తుల పంపకాల విషయంలో స్వయంగా ఎంవోయూపై జగన్ సంతకం చేశారని, ఆస్తుల్లో ఎవరికి ఏవి చెందాలనేది స్పష్టంగా అందులో పేర్కొన్నారని షర్మిల వివరించారు. కానీ, వాటిని ఇంతవరకూ ఇవ్వలేదని తెలిపారు. "గిఫ్ట్‌ను ఆయన విజయమ్మకు ఇచ్చారు. నాకు ఇవ్వలేదు. ఇచ్చిన షేర్లను జగన్ వెనక్కి అడుగుతున్నారు. ఇది సొంత తల్లికి కుమారుడు చేస్తున్న మోసం." అని ఆమె వాపోయారు. తల్లిమీద కేసు పెట్టినవాడిగాను, ఆస్తులు కాజేయడానికి సొంత మేనల్లుడు,మేనకోడలినే మోసం చేసిన మేనమామగాను జగన్ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో శుక్రవారం విలేకరులతో షర్మిల మాట్లాడారు. తన హయాంలో నరేంద్ర మోదీకి జగన్ దత్తపుత్రుడు అన్నట్టు వ్యవహరించారని మండిపడ్డారు. మోదీ అనాడు రాష్ట్రం నోట్లో మట్టి కొట్టారని, ఇప్పుడు సున్నం కొట్టడానికి తిరిగి అమరావతికి ఆయన వస్తున్నారని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చంపేస్తోందని ఆమె ఆరోపించారు. "పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తుకే పరిమితం చేయడంవల్ల అది బ్యారేజీ స్థాయికి పరిమితం అవుతుంది. కేవలం ఎత్తిపోతల పథకంగానే మిగిలిపోనుంది. ఇలాంటి ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనం ఏమిటి? సహాయ, పునరావాస ప్యాకేజీని ఎగ్గొట్టేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఎత్తు వేసింది. 85 వేలమంది నిర్వాసితులకు అన్యాయం చేసింది. అయినా, కూటమినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్; వైసీపీ అధినేత జగన్ కూడబలుక్కున్నట్లుగా మౌనంగా ఉన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేతపత్రం విడుదల చేయాలి." అని షర్మిల డిమాండ్ చేశారు.

## కృష్ణా కరకట్ట రోడ్డు విస్తరణకు పచ్చజెండా

**4 వరసల రహదారికి సీఎం చంద్రబాబు అనుమతి**



- రోడ్డుకు రెండువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం
- వారం రోజుల్లో టెండర్లు పిలువనున్న ఏడీసీఎల్
- రూ.1,200 కోట్ల వ్యయంతో 7 కి.మీ. మేర విస్తరణ

విజయవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా కరకట్ట రోడ్డును నాలుగు వరసలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కొండవీడు వాగు నుంచి రాయపూడి వరకు ఈ రహదారి విస్తరణకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) ప్రతిపాదనకు ఆయన మొగ్గు చూపడంతో ఈ ప్రాజెక్టుపై పూర్తి స్పష్టత వచ్చింది. కృష్ణానది వరదను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కరకట్ట రోడ్డు దుర్భేద్యంగా ఉండేలా ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలన్న ప్రతిపాదనకు కూడా సీఎం అంగీకారం తెలిపారు. దీనికి సంబంధించి మున్సిపల్ మంత్రి నారాయణ, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దీంతో రెండురోజుల్లో మంత్రి, అధికారులు భేటీ కాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు వారం రోజుల్లో టెండర్లు పిలిచేందుకు సన్నాహకాలు జరుగుతున్నాయి. సీఎంతో చర్చించి అనుమతులు తీసుకున్న మేరకు కరకట్ట రహదారి పొడవు 7 కి.మీ.. సెంట్రల్ డివైడర్‌తో నాలుగు వరసల విధానంలో ఉంటుంది. ముందుగా రిటెయినింగ్ వాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఎర్త్‌వర్క్, వెట్‌మిక్స్, హాట్ మిక్స్ వంటి పనులు చేపట్టి బీటీ లేయర్ వేస్తారు. సెంట్రల్ మీడియం, సెంట్రల్ లైటింగ్‌తో ఫినిషింగ్ టచ్ ఇస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,200 కోట్లు వ్యయం అవుతుందని ఏడీసీ అధికారులు అంచనా వేశారు.



అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరులో దెబ్బతిన్న వరి పంట



విజయవాడ రూరల్ మండలం పాతపాడు వద్ద పశ్చిమ బైపాస్‌పై ఆరబోసిన ధాన్యం తడిసిన దృశ్యం

## అకాల వర్షాలతో

# రైతన్నకు నష్టం

- మండువేసవిలో గాలివాన
- దెబ్బతిన్న మామిడి, అరటి తోటలు
- వరి, మొక్కజొన్న పంటలకూ నష్టం
- అనంతపురం జిల్లాలో 2.15 కోట్ల నష్టం
- విజయవాడ పరిసరాల్లోనూ వానదెబ్బ
- మరో 3 రోజులు వర్షసూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మండు వేసవిలో అకాల వర్షాలు అన్నదాతలను కుదేలు చేశాయి. గురువారం రాత్రి, శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మామిడికాయలు గాలివానకు రాలిపోగా, అరటితోటలు నేలకొరిగాయి. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్నతో పాటు కర్బూజ, దోస, చీనీ, కళింగర వంటి పంటలు దెబ్బతిన్నాయి. ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.2.15 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాల్లో మామిడి, అరటి పంటలు దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. 23 ప్రాంతాల్లో 50 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లా మద్దూరు, ప్రకాశం జిల్లా రాళ్లపల్లిలో అత్యధికంగా 111.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కడప జిల్లా కలసపాడులో 110.7, నంద్యాల జిల్లా పెరుసోమలలో 107, శ్రీసత్యసాయి జిల్లా కొండకమర్లలో 101 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాయలసీమ, కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. సముద్రాల నుంచి వచ్చే తేమగాలులు, వాయవ్య భారతం నుంచి వీచే పొడిగాలుల కలయికతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. మరోవైపు మన్యం జిల్లా జియ్యమ్మవలసలో 39.9 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 39.2 డిగ్రీలు, శ్రీకాకుళం జిల్లా కొల్లివలసలో 39.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### అనంతలో భారీ నష్టం

అనంతపురం జిల్లాలో గాలివానకు రూ.2.15 కోట్లకుపైగా విలువైన పంటలు దెబ్బతిన్నాయి. తాడిపత్రి, యల్లనూరు, గార్లదిన్నె, కంబదూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, అనంతపురం రూరల్, పెద్దవడుగూరు, కూడేరు, పెద్దపప్పూరు మండలాల్లో 55 మంది రైతులకు చెందిన 60.77 హెక్టార్లల్లో రూ.1.24 కోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి, కర్బూజ, చీనీ, కళింగర పంటలు ఉన్నాయి. శెట్టూరు, నార్పల, గార్లదిన్నె, అనంతపురం రూరల్ మండలాల్లో 71 మంది రైతులకు సంబంధించి 114 హెక్టార్లల్లో రూ.91.84 లక్షల విలువైన మొక్కజొన్న, వరి పంట నష్టం జరిగింది. జిల్లాలోని 30 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమలలో 70.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడిపత్రి, అనంతపురం మండలాల్లో 48.4, కంబదూరులో 42.4, గార్లదిన్నెలో 39.4, రాప్తాడులో 32.4, పుట్లూరులో 32.0, ఆత్మకూరులో 30.4, యాడికిలో 30.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

### విజయవాడలో విస్తారంగా

విజయవాడతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. విజయవాడ నగరంలో రహదారులపై నీరు నిలిచిపోయింది. అకాల వర్షం నగరాన్ని ముద్ద చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో పంటలకు నష్టం చేకూర్చింది. విజయవాడ రూరల్ మండలంలో నష్టం ఎక్కువగా జరిగింది. అసలే పూత ఆలస్యం కావడంతో మామిడి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడిప్పుడే కాయలు దశకు తోటలు చేరుకున్నాయి. గాలివానకు రూరల్ మండలంలో 50 ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానవన శాఖ అధికారులు నిర్ధారించారు. పది శాతం మామిడికాయలు గాలివానకు రాలిపోయాయి. జిల్లాలో అక్కడక్కడ గెలలు ఉన్న అరటి చెట్లు నేలపై పడటంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. రూరల్ మండలంలో ఆరబెట్టిన 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసి ముద్దయింది. జి.కొండూరు మండలంలో మిర్చి రైతులకు స్వల్ప నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల మిర్చి కల్లాల్లో తడిసిపోయింది.



ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలో మిర్చి పట్టాలపై నీళ్లు తొలగిస్తున్న రైతులు

### అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు

రానున్న మూడు రోజులు అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శనివారం అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఆదివారం ఉత్తరాంధ్రలో కొన్ని చోట్ల, కాకినాడ జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, సోమవారం అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

## వక్ఫ్ బిల్లుపై జగన్ డబుల్ గేమ్!

**లోక్‌సభలో వ్యతిరేకం.. రాజ్యసభలో అనుకూలంగా ఓటేశారని టీడీపీ ఆరోపణ**

- జగన్ ద్వంద్వ వైఖరిపై మైనారిటీల్లో తీవ్ర అసంతృప్తి

అమరావతి/న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై జగన్ ఆడిన డబుల్ గేమ్ రాజ్యసభ సాక్షిగా బయటపడింది. విప్ జారీ మొదలు ఓటింగ్ వరకు వైసీపీ రెండు నాల్కల రాజకీయం చేసిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. వక్ఫ్ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉందని.. దానిని వ్యతిరేకిస్తున్నామని జగన్, వైసీపీ నేతలు పదేపదే ప్రకటించారు. ఎన్డీయేకు బలం ఉన్న లోక్‌సభలో బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. ఎన్డీయేకి అత్తెసరు మెజారిటీ ఉన్న రాజ్యసభలోనూ వ్యతిరేకిస్తుందని అంతా భావించారు. కానీ గురువారం రాత్రి వరకు తన సభ్యులకు ఎలాంటి విప్ జారీ చేయలేదు. సాధారణంగా ఏదైనా బిల్లుపై ఓటింగ్ ఉంటే ఒక రోజు ముందే ఆ బిల్లుపై తమ వైఖరి ఏమిటో స్పష్టం చేస్తూ.. సభకు హాజరు కావాలని పేర్కొంటూ తమ ఎంపీలకు రాజకీయ పార్టీలు విప్ జారీ చేస్తుంటాయి. వైసీపీ అలా చేయలేదు. రాజ్యసభలో వైసీపీ ఎంపీలు ఏడుగురూ బిల్లుకు అనుకూలంగా ఓటేశారని టీడీపీ నేతలు చెబుతున్నారు. జాతీయ మీడియా సైతం.. వైసీపీ విప్ జారీ చేయకపోవడంతో ఆ పార్టీ ఎంపీలు ఆత్మప్రబోధానుసారం ఓటేస్తారని కథనాలు రాసింది. వైసీపీ రెండు నాల్కల ధోరణిపై సోషల్ మీడియాలోనూ పెద్దఎత్తున వార్తలు వైరల్ కావడంతో వైసీపీ పెద్దలు దిద్దుబాటు చర్యలకు దిగారు. హడావుడిగా విప్ జారీ చేశారు. అయితే అప్పటికే రాజ్యసభలో బిల్లుపై ఓటింగ్ ముగిసింది. అంతా అయ్యాక విప్ జారీపై విమర్శలు వెల్లువెత్తడంతో తాము ముందే విప్ జారీ చేశామని వైసీపీ పెద్దలు వివరణ ఇచ్చారు. ఇంకోవైపు.. తమ ఎంపీల్లో పరిమల్ నత్వానీ ఒక్కరే క్రాస్ ఓటింగ్ చేశారని వైసీపీ వర్గాలు అంగీకరించాయి. కానీ ఐదుగురు ఎంపీలు బిల్లుకు అనుకూలంగా ఓటేశారని ఆ పార్టీలోనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం వైసీపీలోనే పెద్ద గందరగోళం టీడీపీ నేతలైతే.. వైసీపీ ఎంపీలు ఏడుగురూ వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా ఓటేశారని పేర్కొంటున్నారు. రాజ్యసభలో బిల్లుకు వ్యతిరేకంగా రావలసిన ఓట్ల కన్నా తక్కువ ఓట్లు రావడమే దీనికి నిదర్శనమని చెబుతున్నారు.

### నత్వానీపై అమిత్‌షా ఒత్తిడి?

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయాలని జగన్ ఆదేశించినా రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన తమ ఎంపీ పరిమళ్ నత్వానీ.. వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఓటేశారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఒత్తిడి వల్లే ఆయనీ పనిచేశారని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడొకరు చెప్పారు. నత్వానీ భుజంపై అమిత్‌షా చేయివేసి మరీ తీసుకెళ్లారని.. బిల్లుకు అనుకూలంగా ఓటు వేయించారని తెలిపారు. ఈ సంగతి తమ ఎంపీలకే గాక.. జగన్‌కూ తెలుసని వెల్లడించారు. గతంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటు చేశారని ఆరోపిస్తూ తమ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డిలను జగన్ సస్పెండ్ చేశారు. వీరిపై నాటి స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు కూడా వేశారు. ఇదే కోవలో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఓటేసిన నత్వానీపై చర్య తీసుకుంటారా.. అనర్హత వేటు వేయాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరడం తర్వాత.. కనీసం సదరు ఎంపీని సంజాయిషీ కోరతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ఒక్క సవరణా ప్రతిపాదించని వైసీపీ

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు నిన్నమొన్నటి వరకు చెప్పిన వైసీపీ.. తీరా రాజ్యసభలో దానికి భిన్నంగా నడుచుకోవడం ద్వారా ముస్లింలను మోసం చేసిందని టీడీపీ నేతలు విమర్శించారు. 'వక్ఫ్ బిల్లులో మేం కీలకమైన మూడు సవరణలకు ప్రతిపాదించి వాటిని సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) ముందుకు తీసుకెళ్లి ఆమోదింపజేశాం. వాటిని బిల్లులో కూడా పొందుపరిచారు. వక్ఫ్ ఆస్తుల వివాదాల్లో జిల్లా కలెక్టర్ కంటే సీనియర్ అధికారికి పాత్ర కల్పించాలని, వక్ఫ్ ఆస్తులను పోర్టల్‌లో నమోదు చేసేందుకు విధించిన డెడ్‌లైన్‌లో సడలింపు ఉండాలని, ఎలాంటి ఒప్పందాలూ లేని ఆస్తులను 'వక్ఫ్ బై యూజర్' క్లాజ్ ద్వారా పరిరక్షించాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కీలక ప్రతిపాదనలు చేశారు. టీడీపీ హయాంలో ముస్లింల ప్రయోజనాలను ఏవిధంగా కాపాడుతున్నామో వివరిస్తూ లోక్‌సభలో మా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కీలక ప్రసంగం చేశారు. వక్ఫ్ బోర్డు సభ్యుల నియామకంలో రాష్ట్రప్రభుత్వాల పాత్ర ఉండాలని, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని గట్టిగా కోరారు. కానీ ముస్లింలకు మేలు కలిగేలా వైసీపీ ఒక్క ప్రతిపాదన కూడా చేయలేదు. పైగా ఎన్డీయేకు బలం ఉన్న లోక్‌సభలో వ్యతిరేకించి.. రాజ్యసభలో అనుకూలంగా ఓటేసి ముస్లింలను వంచించింది. జగన్ సూచనలతోనే రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు మద్దతుగా వైసీపీ ఎంపీలు ఓటేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఓటింగ్ తర్వాత విప్ ఇవ్వడం వైసీపీ మోసపూరిత విధానానికి తార్కాణం' అని మండిపడ్డారు. జగన్ తీరును జాతీయ మీడియాతోపాటు బిల్లును వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలూ తీవ్రంగా ఎండగట్టాయని వారు చెప్పారు. మరోవైపు.. మైనారిటీల్లోనూ జగన్ ద్వంద్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఆయన మోసం చేశారనే భావనలో ముస్లిం సమాజం ఉంది. వక్ఫ్ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉందంటూ నానా యాగీచేసి.. చడీచప్పుడు లేకుండా రాజ్యసభలో మద్దతివ్వడం ఎంతవరకు సమంజసమని ముస్లిం సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

## వక్ఫ్ బిల్లుపై వైసీపీ వంచన

**రాజ్యసభలో మద్దతివ్వడం జగన్ నీచ రాజకీయాలకు నిదర్శనం**

- తల్లీచెల్లినే మోసం చేశారు.. ముస్లింలను మోసగించడం ఓ లెక్కా
- టీడీపీ నేతలు నాగుల్ మీరా, ఆనంద్‌బాబు ధ్వజం

అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై వైసీపీ మోసపూరితంగా వ్యవహరించిందని టీడీపీ మండిపడింది. లోక్‌సభలో వ్యతిరేకించి.. రాజ్యసభలో మద్దతు పలకడం జగన్ నీచ రాజకీయాలకు అద్దం పడుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు దుయ్యబట్టారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ముస్లిలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని నాగుల్ మీరా అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న ఆకాంక్షతో అన్ని వర్గాలతోపాటు ముస్లింలు కూడా టీడీపీ కూటమికి అండగా నిలిచారన్నారు. వక్ఫ్ బిల్లులో ముస్లింలకు ఇబ్బందికరంగా ఉన్న మూడు అంశాలపై చంద్రబాబు దృష్టి సారించి, వాటికి సవరణలు ప్రతిపాదించారని అన్నారు. మాట తప్పడం మడమ తిప్పడం జగన్ పేటెంట్ అని, రాజ్యసభ సాక్షిగా ముస్లింలకు ద్రోహం చేశాడని ఆనంద్‌బాబు విమర్శించారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన ఆయనకు.. ఓట్ల కోసం ముస్లింను మోసం చేయడం పెద్ద లెక్కేమీ కాదన్నారు. మోదీ అరెస్టు చేయిస్తారనే భయం ఓ వైపు.. ముస్లిం ఓట్లు పోతాయనే భయం మరోవైపు.. జగన్‌ను ప్రభావితం చేయడంతో లోక్‌సభలో బిల్లును వ్యతిరేకించి రాజ్యసభలో బిల్లుకు మద్దతు పలికారని అన్నారు.

### జగన్ ద్వంద్వనీతి బయటపడింది: షిబ్లీ

వక్ఫ్ బిల్లుపై వైసీపీ డ్రామాలాడుతోందని రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూఖ్ షిబ్లీ ధ్వజమెత్తారు. ఎన్డీయేకు బలం ఉన్న లోక్‌సభలో వ్యతిరేకించి, బలం లేని రాజ్యసభలో అనుకూలంగా ఓటేసిందని.. జగన్ ద్వంద్వ నీతి రాజకీయం మరోసారి బయటపడిందని దుయ్యబట్టారు. బిల్లుకు రాజ్యసభలో మద్దతుగా ఓటేసిన వైసీపీ ఎంపీలు.. బయటికొచ్చాక వ్యతిరేకించినట్లు చెబుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకమన్న వైసీపీ.. రాజ్యసభలో సైలెంట్‌గా మద్దతు పలికిందని ఆక్షేపించారు. మైనారిటీలపై జగన్ తీరు, వైసీపీ వెన్నుపోటు రాజకీయాలపై ముస్లింలు మండిపడుతున్నారని షిబ్లీ తెలిపారు.

# విశాఖలో అమెరికా యుద్ధనౌకల సందడి


అమెరికా నౌక కామ్‌స్టాక్

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో అమెరికా యుద్ధ నౌకలు సందడి చేస్తున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి తూర్పు తీరంలో జరుగుతున్న టైగర్ ట్రయంఫ్-2025లో పాల్గొనడానికి అమెరికా నుంచి రెండు యుద్ధ నౌకలు (యుఎస్ఎస్ కామ్‌స్టాక్, యుఎస్ఎస్ రాల్ఫ్ జాన్సన్) ఇక్కడికి వచ్చాయి. వాటితో పాటు వచ్చిన సుమారు 3 వేల మంది నేవీ, సైనిక సిబ్బంది ఇక్కడి తూర్పు నౌకాదళంతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఉదయం వాలీబాల్, త్రోబాల్, యోగాసనాలు వంటివి చేస్తూ.. సాయంత్రం వేళ నగరంలో పర్యటిస్తున్నారు. ఇక్కడి ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లను గమనిస్తున్నారు. వివిధ రకాల ఆహారాన్ని ఆస్వాదిస్తున్నారు. మహిళా సెయిలర్లు షాపింగ్ మాల్స్‌ను సందర్శించి గోరింటాకుతో రకరకాల డిజైన్లు వేయించుకొంటున్నారు. యుఎస్ఎస్ కామ్‌స్టాక్ కమాండింగ్ ఆఫీసర్ బైరన్ స్టాక్స్ మాట్లాడుతూ.. ఇక్కడి వాతావరణం, కాలమాన పరిస్థితులు కొత్తగా ఉన్నాయని అన్నారు. ఇక్కడ ఉండే ఈ 12 రోజులు ఎంతో అద్భుతంగా ఉంటాయని, కొత్త నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.

### అబ్బుర పరుస్తున్న 'కామ్‌స్టాక్'

టైగర్ ట్రయంఫ్-2025 కోసం విశాఖపట్నం వచ్చిన అమెరికా యుద్ధనౌక 'కామ్‌స్టాక్' అత్యాధునిక ఆయుధాలతో సందర్శకులను అబ్బుర పరుస్తోంది. ఇది విడ్‌బే ఐల్యాండ్ తరగతికి చెందిన డాక్ ల్యాండింగ్ యుద్ధనౌక. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు దీన్ని వినియోగిస్తున్నారు. అమెరికాలోని శాన్‌డియోగో నేవల్ బేస్ దీని స్థావరం. ఈ నౌక పొడవు 186 మీటర్లు. బీమ్ 26 మీటర్లు. డ్రాఫ్ట్ 6.4 మీటర్లు. బరువు 16,190 టన్నులు. గంటకు 20 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ నౌకలో ఆయుధాలు, సరకులు, సెయిలర్లను సరఫరా చేయడానికి నాలుగు ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్లు (హోవర్ క్రాఫ్ట్‌లు), మరో రెండు ల్యాండింగ్ క్రాఫ్ట్ యుటిలిటీలు ఉన్నాయి. ఇవి కాకుండా ఎనిమిది చక్రాలు, 11 మంది సిబ్బందితో పనిచేసే ఇన్‌ఫాంట్రీ కంబాట్ వెహికల్స్ (ఐసీయూ), అత్యాధునిక ఆయుధాలైన ఎంకే 38 క్యానన్స్, ఫలాంక్స్ సీఐడబ్ల్యూఎస్ మౌంట్స్, ఎం2హెచ్‌బీ మెషిన్ గన్లు ఉన్నాయి.


అత్యాధునిక ఆయుధాలతో సైనికులు


ఇన్‌ఫ్యాంట్రీ కంబాట్ వెహికల్స్ (ఐసీయూ)

# రొయ్య విలవిల



## ట్రంప్ సుంకాలు ఆక్వాకు శరాఘాతమే

- ఏపీ నుంచి ఎగుమతులపై తక్షణ ప్రభావం
- ఇప్పటికే మొదలైన ధరల పతనం
- దేశంనుంచి 40% ఉత్పత్తులు అమెరికాకే..
- రూ.600కోట్లకుపైగా నష్టపోనున్న పరిశ్రమ
- కేంద్రం జోక్యం కోసం ఎదురుచూపులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అమెరికా విధించిన ప్రతీకారసుంకాల తీవ్రత రాష్ట్రంలో ఆక్వారంగాన్ని నేరుగా తాకింది. ఇప్పటికే రొయ్యలకు వ్యాధులు ప్రబలి, సాగు ఖర్చులు భారమై సతమతమవుతున్న రొయ్యల సాగుదార్లపై ట్రంప్ తాజాఆంక్షలు సమ్మెటపోటుగా పరిణమించాయి. భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం విధించిన 27% ప్రతీకార సుంకం ఈనెల తొమ్మిదోతేదీ నుంచి అమల్లోకి రానుంది. అయితే, సుంకాల ప్రకటన వెలువడిన కొన్నిగంటల్లోనే రొయ్యల ధరల్లో పతనం మొదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోకపోతే సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమ సంక్షోభంలో పడిపోతుందని ఆక్వా రంగ భాగస్వామ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల సాగు,ఉత్పత్తి,ఎగుమతుల్లో దేశంలో ఏపీ అగ్రగామిగా ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం ఊతమిస్తోంది. జీఎస్‌డీపీలో రొయ్యల పరిశ్రమ వాటా 11 శాతంగా ఉంది. అయితే, ప్రధానంగా ఈ రంగం ఎగుమతులపై ఆధారపడి ఉంది. 2023-24లో భారత్ నుంచి 4.88 బిలియన్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయ్యాయి. మొత్తం ఎగుమతుల్లో ఇది 66% కంటే అధికం. భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు. 40%పైగా రొయ్యలు అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు భారత సముద్ర ఉత్పత్తులపై 27% సుంకం విధించబడటం వల్ల మన రొయ్య యూఎస్ మార్కెట్‌ను తట్టుకొని పోటీలో నిలవలేదు.

### మార్కెట్‌ను మరిచిపోవాల్సిందే..

అమెరికా సుంకాల ప్రభావం కేవలం యూఎస్‌కు జరుగుతున్న రొయ్యల ఎగుమతులకే పరిమితం కాదు. ద్వితీయ ఎగుమతి మార్గాలను కూడా తీవ్రంగా దెబ్బతీయనుంది. అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న చైనా, వియత్నాంలకు 35 శాతం రొయ్యల ఉత్పత్తులు మన దేశం నుంచి వెళుతున్నాయి. తిరిగి ఈ రెండు దేశాలూ తాము దిగుమతి చేసుకున్న రొయ్యల్లో చాలా భాగం యూఎస్‌కే ఎగుమతి చేస్తుండటం గమనార్హం. అయితే, చైనా,వియత్నాం నుంచి యూఎస్‌కు ఎగుమతులపై 30% కంటే ఎక్కువ సుంకాలు ట్రంప్ తాజాగా విధించారు. దీంతో ఆ దేశాల నుంచి మనకు ఆర్డర్లు తగ్గిపోతాయి. ఈ సంక్షోభాన్ని నివారించేందుకు తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం అత్యవసరం. ఇప్పటికే ఉన్న 5.76 శాతం కౌంటర్ వేలింగ్ డ్యూటీ (సీవీడీ), 1.35% నుంచి 3% మధ్య ఉన్న యాంటీ-డంపింగ్ డ్యూటీలను కూడా కలుపుకొంటే ఈ సుంకాల భారం 33-35% వరకు ఉండవచ్చు. అమెరికాకు రొయ్యలు ఎగుమతి చేస్తున్న ఈక్వడార్ వంటి దేశాలపై కేవలం 16% సుంకాన్ని మాత్రమే ట్రంప్ ప్రభుత్వం విధించింది. దీంతో భవిష్యత్తులో మనకు ఈక్వడార్ ప్రధాన పోటీదారుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. తక్షణంగా ఇప్పటికే రవాణాలో ఉన్న రొయ్యల ఉత్పత్తులు ప్రభావితమౌతాయి. సుమారు రూ. రెండు వేల కోట్ల విలువైన రెండు వేల కంటైనర్లు ఇప్పుడు రూ.600కోట్ల అదనపు ఖర్చు మోయాల్సి ఉంటుంది.

### కేంద్రమే దిక్కు....

కొవిడ్ సమయంలో ప్రభుత్వం రొయ్యల ఎగుమతులను ప్రోత్సహిస్తూ ప్రాసెసింగ్ యూనిట్లను నడిపింది. కానీ ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కే ప్రత్యామ్నాయ మార్కెట్లు కనిపించడం లేదు. ఏపీలో రొయ్యల పరిశ్రమ ఉపాధికల్పనకు ఊతం ఇస్తోంది. రాష్ట్రంలో 450పైగా రొయ్యల హచరీలు, 50పైగా ఫీడ్ మిల్లులు, 2లక్షలపైగా రొయ్యల చెరువులు, 250 పైగా ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6వేలకుపైగా పడవలు, నౌకల ద్వారా వేలాదిమందికి జీవనోపాధి లభిస్తోంది. ఏటా ఏప్రిల్- సెప్టెంబరు మధ్యనే వార్షిక ఉత్పత్తిలో 70% చేతికి వస్తుంది. అయితే రొయ్యలు త్వరగా పాడయ్యే ఉత్పత్తి. సుంకాల కారణంగా కొంతకాలం సాగునీటి వనరుల్లో నిల్వ చేద్దామంటే తగిన శీతలీకరణ వసతులు లేవు. దీంతో ప్రాసెసింగ్ కష్టమై లక్షల మంది ఉపాధిని కోల్పోతారు. ఈ నేపథ్యంలో కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆక్వా భాగస్వాములు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వారంలో మెగా డీఎస్సీ!

- నోటిఫికేషన్ జారీకి పాఠశాల విద్యాశాఖ సిద్ధం

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు రాగానే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. వర్గీకరణ ఆర్డినెన్స్ కోసం ప్రభుత్వం చర్యలు వేగవంతంచేసింది. ఒకట్రెండు రోజుల్లో ఫైలు రాజ్‌భవన్‌కు పంపుతారని, వెంటనే ఆర్డినెన్స్ జారీ అవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్డినెన్స్ జారీ కాగానే సాధారణ పరిపాలన శాఖ రిజర్వేషన్లపై కొత్త రోస్టర్ విడుదల చేస్తుంది. దానికి అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు కేటాయించి, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రోస్టర్ పాయింట్లు విడుదలైన మరుసటి రోజు లేదా ఆ తర్వాత రోజు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలౌతుంది. ముందుగా ప్రకటించినట్లుగానే 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగింది. కూటమి ప్రభుత్వం ఒకేసారి 16వేలకు పైగా పోస్టులు ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు పెరిగాయి. వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావడంతో నోటిఫికేషన్ విడుదలకు మార్గం సుగమమైంది.

# 38 ఏఎంసీలకు చైర్మన్లు

- టీడీపీకి 31, జనసేనకు 6, బీజేపీకి 1

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. వారం క్రితం వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ల భర్తీకి శ్రీకారం చుట్టిన టీడీపీ అధిష్ఠానం.. తొలి విడతలో 47 ఏఎంసీలకు చైర్మన్లను నియమించింది. తాజాగా శుక్రవారం మరో 38 మార్కెట్ కమిటీలకు చైర్‌పర్సన్లను ప్రకటించారు. వీటిలో 31 టీడీపీకి, 6 జనసేనకు, ఒకటి బీజేపీకి కేటాయించారు. పదవుల భర్తీలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ప్రజాభిప్రాయానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకుల అభిప్రాయాలను తీసుకుంటూనే.. వారు సూచించిన అభ్యర్థులపై ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉందో వివిధ సర్వేల ద్వారా తెలుసుకుంటున్నారు. చివరిగా అధికశాతం ప్రజల మద్దతున్న వారిని ఎంపిక చేస్తున్నారు. మొత్తం 218 ఏంఎసీల్లో తాజా జాబితాతో కలిపి ఇప్పటికి 85 కమిటీలకు చైర్మన్లను నియమించారు. మిగిలిన 133 ఏఎంసీలకు కూడా 15 రోజుల్లోనే నియామకాలు జరుపనున్నారు. వారంరోజుల్లో ఇంకో జాబితా విడుదల చేస్తారని భావిస్తున్నారు. ఆ తర్వాత 21 ప్రధాన దేవాలయాలకు కమిటీలను ప్రకటించనున్నారు. ఈ నెలఖరులోగా కీలకమైన మరో 60 కార్పొరేషన్లకు కూడా చైర్మన్లను నియమించాలని చంద్రబాబు భావిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలన్న ఆలోచనతో కసరత్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. కొబ్బరి చెట్టుతో తప్పిన పెనుప్రమాదం



అనకాపల్లి జిల్లాలో శుక్రవారం ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. టెక్కలి డిపో నుంచి ఉదయం 11గంటలకు 22మంది ప్రయాణికులతో బస్సు.. రాజమండ్రి బయలుదేరింది. ఎలమంచిలి మండలం పురుషోత్తపురం జంక్షన్ దాటిన కొద్దిసేపటికి అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న రక్షణ స్తంభాలను ఢీకొని పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఓ కొబ్బరి చెట్టును ఢీకొని బోల్తాపడిన బస్సు.. మరో కొబ్బరి చెట్టు అడ్డుగా ఉండడంతో పల్టీలు కొట్టకుండా ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా.. మరికొంతమంది స్వల్పంగా గాయపడ్డారు. - ఎలమంచిలి, ఆంధ్రజ్యోతి

# సచివాలయంలో అగ్ని ప్రమాదం

- రెండో బ్లాక్ బ్యాటరీ రూమ్‌లో మంటలు
- బ్యాటరీల నిర్వహణ లోపమే కారణం
- ఆ బ్లాక్‌లోనే ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి చాంబర్లు
- పరిశీలించిన సీఎం చంద్రబాబు


సచివాలయంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద దృశ్యం


అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, డీజీపీ గుప్తా తదితరులు

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. రెండో బ్లాక్‌లోని కంప్యూటర్ వ్యవస్థకు సంబంధించిన బ్యాకప్ బ్యాటరీ రూమ్‌లో మంటలు చెలరేగి, దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. సచివాలయంలోని ఎస్‌పీఎఫ్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటల్ని అదుపు చేశారు. దాదాపు 60 బ్యాటరీలు కాలిపోవడంతో రెండో బ్లాక్ కింద, పై అంతస్తులకు పొగ అలుముకుంది. ఆ బ్లాక్ అంతా బ్యాటరీలు కాలిపోయిన వాసన రావడంతో ఉద్యోగులు, సందర్శకులు ఇబ్బంది పడ్డారు. దీంతో రెండో బ్లాక్ ఉద్యోగులకు సెలవు ప్రకటించారు. కాగా, రెండో బ్లాక్‌లోనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు కేశవ్, అనిత, నారాయణ, రామనారాయణరెడ్డి, మనోహర్, దుర్గేష్ చాంబర్లు ఉన్నాయి. పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాటరీల నిర్వహణ లోపంవల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటన జరిగినప్పుడు ఆ బ్లాక్‌లో ఫైర్ అలారం మోగలేదని నిర్ధారించారు.

### భద్రతా ప్రమాణాలపై ఆడిట్

అగ్ని ప్రమాద ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. హోంమంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, జీఏడీ పొలిటికల్ సెక్రటరీ ముకేష్‌కుమార్‌మీనాతో కలిసి రెండో బ్లాక్‌ను సందర్శించిన సీఎం.. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందని, ఏ సమయంలో చోటు చేసుకుందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో అన్ని చోట్లా భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అన్నది ఆడిట్ చేయాలని సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. అనంతరం మొదటి బ్లాక్‌లో ఉన్న మరో బ్యాటరీ రూమ్‌ను సీఎం పరిశీలించారు.

### అన్ని కోణాల్లో విచారణ: అనిత

ప్రమాదంపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేయిస్తామని హోంమంత్రి అనిత ప్రకటించారు. తగలబడిన బ్యాటరీ రూమ్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'తెల్లవారుజామున 6.30గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందడంతో 3నిమిషాల్లోనే అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి, 10 నిమిషాల్లో మంటల్ని అదుపు చేశారు. తగలబడిన బ్యాటరీ రూమ్ నుంచి పొగ పై ఫ్లోర్‌లోకి వెళ్లడంతో అక్కడ ఏసీలు, బ్యాటరీలు కూడా కాలినట్లు కనిపిస్తున్నాయి. జీఏడీ, సీఆర్‌డీఏ అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై అన్ని కోణాల్లో కూలంకుషంగా విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని పోలీస్‌శాఖను ఆదేశించాం. పోలీస్, ఫోరెన్సిక్ నివేదికల ఆధారంగా తదుపరిచర్యలు తీసుకుంటాం. సచివాలయంలో ఫైర్ అలారం ఎక్కడెక్కడ పని చేయట్లేదో ఫైర్ ఆడిట్ చేయించి, నివేదిక తీసుకుంటాం. రానున్న కాలంలో ఇలాంటి సమస్య తలెత్తకుండా, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీఏడీ అధికారులను ఆదేశించాం' అని చెప్పారు.

### అగమేఘాల మీద చెత్త తొలగింపు

రెండో బ్లాక్‌లోని బ్యాటరీ రూమ్‌ను పరిశీలించిన తర్వాత మొదటి బ్లాక్‌లోని సీఎంఆర్ఎఫ్ విభాగాన్ని సీఎం సందర్శించారు. అక్కడున్న ఫైళ్లను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి అపరిశుభ్రత, సచివాలయంలో అక్కడక్కడా చెత్త పేరుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో చెత్త కనిపించకూడదని, 24గంటల్లో తొలగించాలని ఆదేశించారు. దీంతో సచివాలయ శానిటేషన్ సిబ్బంది ఆఘమేఘాల మీద బ్లాకుల్లో, ప్రాంగణంలో చెత్తను ఎత్తించి, ట్రాక్టర్లతో బయటికి తరలించారు.

## సచివాలయానికి పూల బాట!





మందడం నుంచి సచివాలయం వెళ్లే మార్గమిది. ఈ రోడ్డుకిరువైపులా ఈ పూల చెట్లు స్వాగతం పలుకుతుంటాయి. ఇక రెండో చిత్రంలో ఉన్నది సచివాలయంలోని పార్కింగ్ ప్రాంతం. ఇందులో పసుపు రంగు పూలు ఆ ప్రాంతానికి కొత్త అందాలను తెచ్చాయి!!

## పారిశ్రామిక ప్రోత్సాహకాల

# బకాయిలకు మోక్షం!

- మే 15లోగా విడుదలకు ప్రభుత్వం చర్యలు
- 5 వేల కోట్ల వరకు చెల్లించేందుకు ప్రణాళిక
- 2 నెలల్లో జిల్లాకో పారిశ్రామిక పార్కు
- మంత్రులు టీజీ భరత్, కొండపల్లి వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కార్ చెల్లించని పారిశ్రామిక ప్రోత్సాహకాల బకాయిల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. వచ్చే నెల 15వ తేదీలోగా రూ.3 నుంచి 5 వేల కోట్ల వరకు చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే అత్యున్నతమైన 'ఎర్లీబర్డ్ ఇన్సెంటివ్స్'ను అందించే రాష్ట్రం ఏపీ ఒక్కటేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానాల అమలు కోసం ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను శుక్రవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మంత్రులు విడుదల చేశారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం, ఏపీ ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ (4.0)లకు సంబంధించిన మార్గదర్శకాల బుక్‌లెట్‌లను మంత్రులు ఆవిష్కరించారు. వీటితోపాటు పారిశ్రామిక ప్రోత్సాహకాలకు సంబంధించిన ఎర్లీ బర్డ్ పోర్టల్‌ను ప్రారంభించారు.

### బాబు ఇమేజ్‌తో భారీగా పెట్టుబడులు

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి భరత్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాల కారణంగా పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారని, నేడు సీఎం చంద్రబాబు బ్రాండ్‌నేమ్‌తో ఇప్పటికే రూ.8.5 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చినట్లు తెలిపారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నంలో బీపీసీఎల్ తదితర భారీ పరిశ్రమలు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇంకా పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాల్సిందిగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు దరఖాస్తులు పెట్టుకోగానే ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభించవని, వారు సమర్పించే ప్రాజెక్టు డీపీఆర్‌లు, మూలధన పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనను బట్టే ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక పాలసీని ప్రకటించినప్పటికీ.. దాని అమలుకు మార్గదర్శకాలు రూపొందించలేదని విమర్శించారు. గత ప్రభుత్వ పాలసీతోపాటు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీలకు కూడా మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేశామని తెలిపారు.

### యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. రెండు నెలల్లో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక పారిశ్రామిక పార్కును ప్రారంభించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మరో రెండేళ్లలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో, ఆ తర్వాత మండలానికో పారిశ్రామిక పార్కు చొప్పున ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. వీటిలో ఏపీఐఐసీ ద్వారా కొన్ని, పీ3, పీ4 కార్యక్రమాల ద్వారా మరికొన్ని పార్కులు అభివృద్ధి చేస్తామని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలకు ఊతమిచ్చేలా ఐటీతోపాటు సివిల్, మెకానికల్, పెట్రో కెమికల్, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటలిస్టులను ప్రోత్సహిస్తూ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్‌బాబు పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంటుకు రూ.2,400 కోట్లు

- ఆర్థిక సాయానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు



విశాఖపట్నం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు చేయూత అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. సుమారు రూ2,400 కోట్ల వరకు సాయం చేయాలని యోచిస్తోంది. దీనిపై తాజాగా జరిగిన రాష్ట్ర కేబినెట్ భేటీలో చర్చించింది. ఆర్థిక సమస్యల కారణంగా స్టీల్ ప్లాంటు విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతోంది. కర్మాగారానికి సొంతగా విద్యుత్ తయారు చేసుకునేందుకు క్యాప్టివ్ పవర్ ప్లాంటు ఉంది. అయితే ఉక్కు ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరగకపోవడంతో విద్యుదుత్పత్తికి అవసరమైన వ్యర్థ వాయువులు లభించడం లేదు. దాంతో యాజమాన్యం ఈపీడీసీఎల్ నుంచి విద్యుత్ తీసుకుంటోంది. నెలకు సగటున రూ.90 కోట్ల వరకు బిల్లు వస్తోంది. కొన్ని నెలలుగా దీనిని చెల్లించలేదు. దీనిపై ఉద్యోగ, కార్మిక సంఘాలు ఇటీవల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ ద్వారా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడారు. జీవీఎంసీకి ఆస్తి పన్ను, నీటిని ఉపయోగించుకుంటున్నందుకు విస్కోకి రూ.కోట్లల్లో చెల్లించాల్సి ఉందని, ఏడాదిన్నర వరకు బిల్లులు కట్టలేని పరిస్థితి ఉందని వివరించారు. సంఘాల అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం మంత్రివర్గంలో చర్చించి, ఆయా బిల్లుల మొత్తం సుమారు రూ2,400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. దీనికి ప్రత్యామ్నాయంగా కంపెనీలో ఆ మొత్తానికి సరిపడా ఈక్విటీ వాటా తీసుకోవాలని భావిస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంటులో వాటాల విక్రయానికి గతంలోనే ప్రకటన విడుదల చేశారు. అయితే ఇందులో వాటాలను కేంద్ర, ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయకూడదనే నిబంధన పెట్టారు. సెయిల్‌తో విశాఖ ఉక్కును కొనిపించినా, లేదంటే అందులో విలీనం చేసినా తమ కష్టాలు తీరతాయని ఉద్యోగ, కార్మిక సంఘాలు కేంద్రాన్ని కోరాయి. అయితే దీనికి నిబంధనలు అంగీకరించవని, ప్రైవేటు సంస్థలు తప్పితే ఇంకెవరూ అందులో వాటాలు తీసుకోవడానికి వీల్లేదని కేంద్రం స్పష్టం చేసింది. దీనిప్రకారం ప్రభుత్వం సాయం చేయబోయే రూ.2,400 కోట్లకు ఈక్విటీ వాటా తీసుకునే అవకాశం ఉండదని, దీనిపై న్యాయపరమైన అభిప్రాయం తీసుకోవలసి ఉంటుందని ప్లాంటు వర్గాలు చెబుతున్నాయి. ఈక్విటీ తీసుకునే అవకాశం లేకపోతే ఆ మొత్తానికి సరిపడా ప్లాంటు భూములను ప్రభుత్వం కోరే అవకాశం ఉందని కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.